ఉల్లి పండించే ప్రాంతంలోనే కిలో 90 రూపాయలు.



2 లో


# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

సంపుటి:01 | సంచిక:35 | ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు | గురువారం, అక్టోబర్,01, 2026 | పేజీలు:12 | వెల:10రూ/-





## ఈసారి సిరిసిల్లపై గురి పెడదాం

# సిరిసిల్ల గడీని నేలమట్టం చేద్దాం

- గజ్వేల్ గడీని కూల్చాం.. సిరిసిల్లను కూల్చుతాం
- కేటీఆర్‌కు కాంగ్రెస్ గురించి ఏం తెలుసు?
- బీఆర్ఎస్ పాలనలో సిరిసిల్ల ఉరిసిల్లగా మారింది
- సిరిసిల్ల సమస్యల వలయంగా మారింది
- ప్రజల ఓట్లను పచ్చనోట్లుగా మార్చుకున్నారంటూ విమర్శ
- గల్ఫ్ కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని ఆరోపణ

పిల్లకాకికి ఏం తెలుసు ఉండేలు దెబ్బ అన్నట్లుగా.. కేటీఆర్ కు ఏం తెలుసు కాంగ్రెస్ పార్టీ గురించి, రేవంత్ గురించి అని అన్నారు సీఎం రేవంత్ రెడ్డి. 2026 సెప్టెంబర్ 30న సిరిసిల్ల బహిరంగ సభలో మాట్లాడిన సీఎం.. కాంగ్రెస్ గురించి, రేవంత్ గురించి ఫామ్ హౌస్ లో పడుకున్న మీ తండ్రి కేసీఆర్ గురించి అడుగమని సలహా ఇచ్చారు.

ఈ సందర్భంగా సిరిసిల్ల గడ్డమీద గురిపెడదామని సిరిసిల్ల ప్రజలకు పిలుపునిచ్చారు రేవంత్. ఈసారి సిరిసిల్ల గడీని కూల్చేస్తామని హెచ్చరించారు.

ఆనాడు గజ్వేల్ గడీని నేలమట్టం చేస్తామని చెప్పినం.. చేసి చూపించాం.. ఈ సారి సిరిసిల్ల గడీని కూల్చేస్తామని చెప్పారు. ధైర్యం, దైవం కలగలిసిన ప్రాంతం సిరిసిల్ల అని అన్నారు సీఎం రేవంత్. సిరసాల అనే పేరు నుంచి సిరిసిల్ల వచ్చిందని.. సిరసాల అంటే సిరులకు నిలయమని అన్నారు. అలాంటిది పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సిరిసిల్ల ఉరిసిల్లగా మారిందన్నారు. సిరిసిల్ల ప్రజలు వేసిన ఓట్లను పచ్చనోట్లుగా మార్చుకుని కేటీఆర్ కోట్లు సంపాదించాడని అన్నారు సీఎం రేవంత్. సిరిసిల్లను సమస్యల వలయంగా కేటీఆర్ మార్చారని విమర్శించారు. వలసపోయిన గల్ఫ్ కార్మికులు చనిపోతే కనీసం పట్టించుకోలేదని అన్నారు.




2 లో

## ప్రభుత్వానికి మంచి పేరు.. చెడ్డపేరు ఉద్యోగుల వల్లే

- ఉద్యోగులే ప్రభుత్వానికి ప్రతినిధులు
- ప్రజలను కుటుంబు సభ్యుల్లా చూడాలి
- సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా చూడాలి
- 10.5 లక్షల మంది ఉద్యోగులు.. 4 కోట్ల ప్రజలకు సేవలు
- నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వానికే చెడ్డపేరు
- పేదల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ వేదిక కావాలి

# మహిళల కోసం భవిష్యత్తులో ఏసీ బస్సులు కొంటాం: చంద్రబాబు

- 26,401 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ
- ఇప్పటివరకు 60 వేల మందికి పట్టాలు
- పట్టాల విలువ సుమారు రూ.52 వేల కోట్లు
- పేదల ఆత్మగౌరవానికి పట్టాభిషేకం

విజయవాడ: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. విజయవాడ లో నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "డబుల్ ఇంజిన్ సర్కార్ జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తోంది. ఇవాళ 26,401 మందికి ఇళ్ల పట్టాలు అందిస్తున్నాం. గత వైకాపా పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం. కొందరు నేతలు మీ భవిష్యత్తుతో ఆటలాడుకున్నారు. గత ప్రభుత్వం భూ సర్వే పేరుతో ప్రతి ఊరిలో వివాదాలు సృష్టించింది. మీ ఆస్తులపై, పాస్‌బుక్‌లపై వారి బొమ్మలు వేసుకున్నారు. మేం మాత్రం ప్రభుత్వ రాజముద్రతో పాస్‌బుక్‌లు, పట్టాలు ఇస్తున్నాం. వైకాపా పాలనకు, కూటమి ప్రభుత్వ పాలనకు తేడా గమనించాలి.




మొన్న విశాఖలో, నిన్న మంగళగిరిలో నేడు విజయవాడలో పేదలకు పట్టాలు ఇవ్వడం జీవితంలో మర్చిపోలేను. మొత్తం 60 వేల మందికి పట్టాలు ఇచ్చాం. దీని విలువ సుమారు రూ.52 వేల కోట్లు. ఇవాళ పేదల ఆత్మగౌరవానికి పట్టాభిషేకం జరుగుతోంది. పేదల చిరకాల వాంఛ నెరవేర్చాం. వారు ఆనందంగా ఉండటమే నిజమైన అభివృద్ధి. ఈ ఆస్తిని అమ్ముకోవద్దు, భవిష్యత్తు కోసం ఉంచుకోండి. 108 ఏళ్ల నుంచి ఉన్న సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నాం. పేదలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే మూడు పార్టీలు కలిశాయి. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నాం. మహిళల కోసం భవిష్యత్తులో ఏసీ బస్సులు కొంటాం" అని సీఎం అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు సత్యకుమార్, నాదెండ్ల మనోహర్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




## మందుబాబులకు బ్యాడ్ న్యూస్.. మద్యం దుకాణాలు బంద్.. ఆ రోజు పూర్తిగా క్లోజ్.

మందుబాబులకు బ్యాడ్ న్యూస్. హైదరాబాద్‌లో మద్యం దుకాణాలన్నీ అక్టోబర్ 2వ తేదీన బంద్ కానున్నాయి. గాంధీ జయంతిని పురస్కరించుకుని మద్యం షాపులను మూసివేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశాలు జారీ చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని మద్యం దుకాణాలు, బార్లు, పబ్‌లు, క్లబ్‌లకు ఈ ఆదేశాలు వర్తింపచేస్తాయని ప్రకటించారు.

2 లో



## ఎయిర్‌పోర్టులో అనుమానంగా కనిపించిన ప్రయాణికుడు.. ఆపి చెక్ చేయగా..

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మరోసారి భారీ స్థాయిలో మత్తుపదార్థాలు పట్టుబడ్డాయి. విదేశాల నుంచి హైదరాబాద్ వచ్చిన ఓ ప్రయాణికుడి నుంచి ఏకంగా రూ.24.5 కోట్ల విలువైన 4.9 కేజీల కొకైన్‌ను సీజ్ చేశారు డీఆర్ఐ అధికారులు. సదరు ప్రయాణికుడిని

## పేషెంట్లుగా వెళ్లిన పోలీసులు... నకిలీ డాక్టర్లకు బిగ్ షాక్!



- పట్టుబడిన శ్యాంసుందర్
- ఆకస్మిక తనిఖీలతో ఐదుగురు నకిలీ వైద్యుల అరెస్ట్
- మల్లాపూర్‌లో ముగ్గురు, రాంగోపాల్‌పేట, మేడిపల్లిలో ఒకరి చొప్పున

2లో..

హైదరాబాద్: ఐదుగురు నకిలీ వైద్యులు మంగళవారం పోలీసులకు పట్టుబడ్డారు. మల్లాపూర్ పరిధిలో ముగ్గురు, రాంగోపాల్‌పేట, మేడిపల్లిలో ఒకరి చొప్పున పోలీసులు అరెస్టు చేశారు. ఎలాంటి వైద్య విద్యార్హతలు, రిజిస్ట్రేషన్, అనుమతులు లేకుండా సేవలు అందిస్తున్న నకిలీ వైద్యుల వద్దకు పోలీసులు రోగుల రూపంలో వెళ్లారు. వైద్యవిధానాన్ని పరిశీలించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.




2లో..

## ఈసీపై ఐక్య పోరాటం

# ఇండియా కూటమి

- అక్టోబర్ 2--8 దేశవ్యాప్త పాదయాత్ర
- 6న ఈసీ కార్యాలయానికి ర్యాలీ
- బ్యాలెట్ పేపర్లకు ఖర్గే డిమాండ్
- సీఈసీ రాజీనామాకు రాహుల్ డిమాండ్
- ఆందోళన తీవ్రతరం చేస్తాం: రాహుల్

కేంద్ర ఎన్నికల సంఘం తీరుకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా నిరసనలు, మార్చ్ చేపట్టాలని 'ఇండియా కూటమి' నేతలు నిర్ణయించారు. బుధవారం జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అక్టోబర్ 2నుంచి 8వరకు వారం రోజుల పాటు 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అనే నినాదంతో పాదయాత్ర చేపట్టనున్నట్టు ప్రకటించారు. అక్టోబర్ 6న ఈసీ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి నిరసన తెలియజేస్తామన్నారు. అక్టోబర్ రెండో వారంలో రాష్ట్రపతిని కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరనున్నట్లు వెల్లడించారు.

## ట్రంప్‌తో మోదీ ఫోన్ సంభాషణ

- వాణిజ్యం, రక్షణపై చర్చలు
- ఇంధనం, టెక్నాలజీపై సమీక్ష
- ద్వైపాక్షిక సహకారంపై చర్చ
- ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై అభిప్రాయాలు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ ఫోన్‌లో సంభాషించారు. వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతలతో పాటు ఆయా రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని సమీక్షించుకున్నట్లు ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. సమగ్ర అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేలా రెండు దేశాలు సన్నిహిత సంబంధాలను కొనసాగించేందుకు అంగీకరించినట్లు పేర్కొన్నారు.ప్రపంచ శాంతి, భద్రత పెంపొందించేందుకు జరుగుతున్న ప్రయత్నాలతోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపైనా అభిప్రాయాలను పరస్పరం పంచుకున్నట్లు తెలిపారు.

## మానవ నమ్మకాలే

# సైబర్ నేరగాళ్ల ఆయుధం

- సైబర్ నష్టాల్లో 60% ఇన్వెస్ట్‌మెంట్ మోసాలే
- నమ్మించి.. మోసగించి.. ఖాతాలు ఖాళీ
- విదేశాల నుంచి కాల్‌సెంటర్లతో సైబర్ ముఠాలు
- అప్రమత్తతే అతిపెద్ద రక్షణ
- రెండేళ్లలో రూ.455 కోట్ల సొమ్ము రికవరీ
- ఏఐపై అతిగా ఆధారపడొద్దు: నిపుణుల హెచ్చరిక
- డీప్‌ఫేక్‌లకు ప్రత్యేక చట్టం అవసరం
- ఫోన్ నంబర్ షేర్ చేయొద్దు: సైబర్ నిపుణులు



సైబర్ నేరాలు ఇక కేవలం సాంకేతిక పరిజ్ఞానాల మధ్య పోరాటం కాదని, అవి మానవ నమ్మకం, ఆలోచనా సరళి, మన ప్రవర్తనలక్ష్యంగా చేసుకుని జరుగుతున్న దాడిగా మారాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, తెలంగాణ పోలీసు శాఖల భాగస్వామ్యంతో సైబర్ సెక్యూరిటీకి సంబంధించి మానవ నమ్మకాలు ఎలా ప్రభావితం చేస్తాయనే అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు.

ఈ సదస్సులో తెలంగాణ రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి, టీజీసీఎస్బీ డైరెక్టర్ శిఖా గోయల్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. తెలంగాణలో నమోదవుతున్న సైబర్ నేరాల ఆర్థిక నష్టాల్లో దాదాపు 60 శాతం నష్టాలు స్టాక్ మార్కెట్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ వల్లే జరుగుతున్నాయని ఆమె వెల్లడించారు.

మిగతాది 2 లో

## ఉల్లి పండించే ప్రాంతంలోనే కిలో 90 రూపాయలు..




ఉల్లిగడ్డను కోస్తేనే కాదు.. తలచుకుంటేనే కన్నీళ్లు వచ్చేలా ఉంది . ధరలు భారీగా పెరుగుతుండటంతో సామాన్యుడి కూరల్లో ఉల్లిపాయలు కనిపించని పరిస్థితి. నిన్న మొన్నటి దాక కేజీ ఉల్లిగడ్డ 40, 70 రూపాయల దగ్గర ఉండగా.. ఇప్పుడు ఏకంగా సెంచరీకి చేరువకావడం షాకింగ్ న్యూస్.

దేశ వ్యాప్తంగా ఉల్లి ధరలు పెరిగిపోతుండటం ఆందోళన కలిగించే అంశమైతే.. ఉల్లి పండించే ప్రాంతాల్లో కూడా కేజీ 90 రూపాయలకు చేరువ కావడం కళ్లల్లో నీళ్లు వచ్చే అంశమే. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో దేశ వ్యాప్తంగా ఆనియన్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అయితే నవంబర్ లో కొత్త పంట వచ్చే వరకు 90 రూపాయలకు కేజీ అయ్యే ఛాన్సెస్ ఉన్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. మహారాష్ట్రలో ఉల్లిపాయలు బాగా పండిస్తారు. అలాంటిది ఛత్రపతి షంభాజీ నగర్ లో ఉల్లిగడ్డల ధరలు చుక్కలు చూపించడం ఆందోళనకరమైన విషయం.




## దేశంలో మొట్టమొదటిసారి.. మాజీ డీఎస్పీ భీమ్‌రెడ్డిపై బినామీ యాక్ట్ కింద కేసు నమోదు

2లో..

# ఈసీపై ఐక్య పోరాటం ఇండియా కూటమి

మొదటిపేజీ తరువాయి

కేంద్ర దర్యాప్తు సంస్థలను, ఎన్నికల సంఘాన్ని భాజపా నేతలు ఏ రకంగా స్వాధీనం చేసుకుంటున్నారో రాష్ట్రపతికి వివరించనున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కేంద్రం, ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 'ఎన్నికల్లో జరుగుతున్న అక్రమాలపై మేమంతా (ఇండియా కూటమి నేతలు) ఐక్యంగా పోరాడతాం. అధికారం కోసం మోదీ, అమిత్ షా ఈసీని ఓ రబ్బర్ స్టాంపులా వినియోగిస్తున్నారు. ఓటర్ జాబితాలో అవకతవకలను ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధారాలతో చూపించినా ఈసీ పట్టించుకోలేదు. ఈవీఎంల పనితీరుపై ఎంతో కాలంగా సమాధానం కోరుతున్నా స్పందించ లేదు. ఇకపై ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ పేపర్లు తీసుకురావాలి. సర్ ప్రక్రియకు ముందున్న ఓటర్ల జాబితానే ఎన్నికల సమయంలో పరిగణలోకి తీసుకోవాలి' అని డిమాండ్ చేశారు.

**వారికి తగిన శిక్ష పడాల్సిందే: రాహుల్ గాంధీ**

తమ స్వలాభం కోసం దేశంలోని ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసిన వారికి తగిన శిక్ష పడాల్సిందేనని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. 'వారు ఎంత పెద్దవారైనా తప్పు చేస్తే శిక్ష అనుభవించాల్సిందే. భారత ప్రజాస్వామ్యం ఈ దేశంలోని ప్రతి ఒక్కరి కన్నా ఎంతో గొప్పది. ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని మేం చెప్పే మాటలు నిజమేనని ఇప్పుడు ప్రజలకు కూడా తెలిసింది. ఈ ప్రభుత్వ అవినీతిని వారే ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తన తప్పు ఒప్పుకొని, పదవికి రాజీనామా చేయాలి. ఆయన పదవి నుంచి వైదొలగకపోతే ఆందోళన మరింత తీవ్రతరం చేస్తాం' అని రాహుల్ గాంధీ హెచ్చరించారు. బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సైతం జ్ఞానేశ్ కుమార్‌పై విమర్శలు గుప్పించారు. ఇండియా కూటమి సమావేశంలో విపక్ష పార్టీలకు చెందిన పలువురు అగ్రనేతలు పాల్గొన్నారు.

# మానవ నమ్మకాలే సైబర్ నేరగాళ్ల ఆయుధం

మొదటిపేజీ తరువాయి

బాధితుల ప్రవర్తనను అధ్యయనం చేస్తూ వారిలో నమ్మకం కలిగించి డబ్బులు బదిలీ చేసేలా వియత్నాం, మయన్మార్, కాంబోడియా వంటి విదేశాల నుంచి ఈ సైబర్ ముఠాలు కాల్ సెంటర్ల ద్వారా నెట్‌వర్క్ నడుపుతున్నాయని స్పష్టం చేశారు. అయితే, అప్రమత్తతే అతిపెద్ద రక్షణ అని, గత రెండేళ్లలో తెలంగాణ పోలీసు శాఖ రూ.455 కోట్ల బాధితుల సొమ్మును రికవరీ చేయగలిగిందని తెలిపారు. 'ఏమీ తెలియదనే అమాయకత్వం మిమ్మల్ని కాపాడదు. ఆలోచించి, అన్ని అంశాలు సరిచూసుకున్నాకే ముందడుగు వేయాలి' అని సూచించారు.

సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, సైబర్ లా నిపుణులు పవన్ దుగ్గల్ మాట్లాడుతూ.. కృత్రిమ మేధపై అతిగా ఆధారపడటం మానవ మేధస్సును క్షీణింపజేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతీ చిన్న విషయానికి ఏఐని సంప్రదించి మానవ ఆలోచనా శక్తిని తగ్గించుకోకూడదని హెచ్చరించారు. ఏఐ డీప్‌ఫేక్‌ల నిరోధానికి దేశంలో తక్షణమే ప్రత్యేక చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే సుప్రీంకోర్టు 'కోర్టుల్లో ఏఐ వినియోగంపై డ్రాఫ్ట్ నిబంధనలు - 2026' రూపొందించిందని గుర్తుచేశారు.

డీఎస్‌సీఐ అడ్వైజర్ ఎయిర్ వైస్ మార్షల్ దేవేష్ వత్స మాట్లాడుతూ.. రామాయణంలోని లక్ష్మణ రేఖయే ప్రపంచంలో మొదటి ఫైర్‌వాల్ అని వ్యాఖ్యానించారు. సైబర్ నిపుణులు జితేన్ జైన్ మాట్లాడుతూ.. ఫోన్ నంబర్లను షాపింగ్ మాల్స్‌లో ఇవ్వొద్దని, ఇది సోషల్ ఇంజినీరింగ్ దాడులకు మార్గం సుగమం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన సైబర్ అవగాహన వీడియోలు, పోస్టర్లను ఆవిష్కరించారు. 2.95 లక్షల మంది పెన్షనర్లు, మూడు లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు వీటి ద్వారా అవగాహన కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# మందుబాబులకు బ్యాడ్ న్యూస్..

## మద్యం దుకాణాలు బంద్.. ఆ రోజు పూర్తిగా క్లోజ్..

మొదటిపేజీ తరువాయి

ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా చూడాలని నగర పరిధిలోని పోలీస్ కమిషనర్లకు జీహెచ్ఎంసీ సూచించింది. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి షాపులు తెరిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సూచనలు చేసింది. గాంధీ జయంతి సందర్భంగా ప్రతీ ఏడాది అక్టోబర్ 2న మద్యం దుకాణాలు బంద్ అవుతాయి. ఈ సారి కూడా అదే రూల్ పాటించాలని జీహెచ్ఎంసీ కోరింది.

మద్యం దుకాణాలు డ్రై డేగా పాటించాలని జీహెచ్ఎంసీ ఆదేశాలు జారీ చేసింది. గాంధీజీ అహింసా సిద్ధాంతాలు, ఆయనను గౌరవిస్తూ మద్యం దుకాణాలు మూసివేయాలని జీహెచ్ఎంసీ స్టాడింగ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం మేరకు నగరవ్యాప్తంగా మద్యం అమ్మకాలు అక్టోబర్ 2వ తేదీన బంద్ కానున్నాయి. ఈ మార్గదర్శకాలను వ్యాపారులు, ప్రజలు పాటించాలని అధికారులు కోరారు. ఎవరైనా నిబంధనల ఉల్లంఘనకు పాల్పడితే చట్టప్రకారం చర్లయు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు,వ్యాపారులు దీనికి సహకరించాలని కోరారు. అక్టోబర్ 2వ తేదీ వేకువజామున నుంచి అర్ధరాత్రి వరకు మద్యం షాపులు బంద్ అవుతాయి. తిరిగి అక్టోబర్ 3న ఉదయం తెరుచుకుంటాయి.

వైన్ షాపులు, బార్లు, రెస్టారెంట్లలోని మద్యం సరఫరా, పబ్‌లు, స్టార్ హోటళ్లలో మద్యం సర్వ్ చేయడం, క్లబ్‌లకు ఈ ఆదేశాలు వర్తిస్తాయని జీహెచ్ఎంసీ తెలిపింది. ఇక కల్లు దుకాణాలు కూడా బంద్ కానున్నాయి. మద్యం విక్రయిస్తే ఎక్సైజ్ చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయడంతో పాటు లైసెన్సులు రద్దు చేసే అవకాశం కూడా ఉంటుంది. హైదరాబాద్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా అక్టోబర్ 2న మద్యం అమ్మకాలు బంద్ అవుతాయి. దేశవ్యాప్తంగా డ్రైడే అమల్లో ఉంటుంది. అటు చికెన్, మటన్, బీఫ్ దుకాణాలు కూడా బంద్ అవుతాయి. మేకలు, గొర్రెలు, పశువుల వధశాలలతో పాటు చికెన్, మటన్, బీఫ్ షాపులు అక్టోబర్ 2న పూర్తిగా మూతపడనున్నాయి.

# దేశంలో మొట్టమొదటిసారి.. మాజీ డీఎస్పీ భీమ్‌రెడ్డిపై బినామీ యాక్ట్ కింద కేసు నమోదు

మొదటిపేజీ తరువాయి

దేశంలోనే తొలిసారి బినామీ యాక్ట్ కింద కేసు నమోదైంది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో మాజీ డీఎస్పీ భీమ్‌రెడ్డి, ఆయన బినామీలపై మొట్టమొదటిసారి బినామీ యాక్ట్ కింద కేసులు నమోదు అయ్యాయి. గతంలో తెలంగాణ, కర్ణాటకలోని 16 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించి రూ.200 కోట్లకు పైగా విలువైన ఆస్తులను గుర్తించాయి. ఆయన బినామీల ఇళ్లల్లో జరిగిన సోదాల్లో ఆస్తుల పత్రాలు, నగదు, బంగారం వివరాలు లభించాయి. వాటి అసలు యజమాని, ఎక్కడి నుంచి వచ్చాయి, భీమ్‌రెడ్డితో వారికి ఉన్న సంబంధాలపై ఏసీబీ, ఐటీ అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

అక్రమాస్తుల కేసులో సస్పెండ్ అయిన తెలంగాణ మాజీ డీఎస్పీ సంకిరెడ్డి భీమ్‌రెడ్డి కేసులో సంచలన పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే భారీగా ఆస్తులను గుర్తించిన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ).. ఆ తర్వాత చేపట్టిన దర్యాప్తు ఆధారంగా ఇప్పుడు ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) కూడా రంగంలోకి దిగింది. దీంతో ఈ కేసులో దర్యాప్తు సంస్థలు ఏసీబీ, ఐటీ మరింత దూకుడు పెంచాయి. భీమ్‌రెడ్డికి బినామీలుగా వ్యవహరించినట్లు అనుమానిస్తున్న 8 మందిపై బినామీ ఆస్తుల చట్టం కింద కేసులు నమోదు చేశాయి. ఇది దేశంలోనే తొలిసారిగా బినామీ లావాదేవీల చట్టం కింద ఇలాంటి కేసుల నమోదు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

డీజీపీ కార్యాలయంలోని పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న సమయంలో భీమ్‌రెడ్డిపై ఏసీబీ కేసు నమోదు చేసింది. జూన్ 27వ తేదీన నమోదైన ఈ కేసులో భాగంగా తెలంగాణ, కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో అధికారులు సోదాలు నిర్వహించారు. భూములు, ఇళ్లు, ప్లాట్లు, బ్యాంకు డిపాజిట్లు వంటి ఆస్తులకు సంబంధించిన వివరాలను అధికారులు గుర్తించినట్లు సమాచారం. మొత్తం 16 ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం రూ.200 కోట్లకు పైగా విలువైన ఆస్తులు గుర్తించినట్లు ఏసీబీ వర్గాల ద్వారా వెల్లడైంది.

ఈ దర్యాప్తులో కొన్ని ఆస్తులు ఇతర వ్యక్తుల పేర్లపై ఉన్నప్పటికీ వాటి వెనుక భీమ్‌రెడ్డి పెట్టుబడులు ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమైనట్లు తెలుస్తోంది. దీంతో బినామీ ఆస్తుల కోణంలోనూ దర్యాప్తును అధికారులు చేపట్టారు. బినామీ ఆస్తులకు సంబంధించిన ఆధారాలను సేకరించేందుకు ఏసీబీ అధికారులు కోర్టు నుంచి సెర్చ్ వారెంట్లు పొందారు. చార్టర్డ్ అకౌంటెంట్ వెంకటేష్ సహా మొత్తం 8 మంది ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు.

హైదరాబాద్‌లోని పుప్పాలగూడతో పాటు ఇతర ప్రాంతాల్లో జరిగిన ఈ సోదాల్లో ఆస్తులకు సంబంధించిన పత్రాలు, నగదు, బంగారం, ఇతర కీలక ఆధారాలను అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆస్తుల కొనుగోలుకు డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది.. ఆ ఆస్తులకు అసలు యజమాని ఎవరు అనే అంశాలను దర్యాప్తు సంస్థలు పరిశీలిస్తున్నాయి.

ఏసీబీ దర్యాప్తులో లభించిన సమాచారాన్ని పరిశీలించిన ఐటీ శాఖ.. భీమ్‌రెడ్డికి బినామీలుగా అనుమానిస్తున్న 8 మందిపై బినామీ ప్రాపర్టీ ట్రాన్సాక్షన్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. బినామీ పేర్లపై ఉన్న ఆస్తులకు అసలు పెట్టుబడులు ఎవరివి.. ఆస్తుల కొనుగోలుకు ఉపయోగించిన నిధుల మూలం ఏంటి.. ఆస్తులను ఎవరు కంట్రోల్ చేస్తున్నారు వంటి అంశాలపై ఐటీ అధికారులు దృష్టి సారించారు.

బినామీ చట్టం కింద నమోదైన కేసుల నేపథ్యంలో సంబంధిత ఆస్తులపై తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. దర్యాప్తులో బినామీ లావాదేవీలు నిర్ధారణ అయితే ఆయా ఆస్తులపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. భీమ్‌రెడ్డి వ్యవహారంలో ఏసీబీ ఇప్పటివరకు గుర్తించిన ఆస్తుల విలువ రూ.200 కోట్లకు పైగా ఉన్నట్లు దర్యాప్తు వర్గాలు చెబుతున్నాయి. ఇందులో భూములు, ఇళ్లు, ఇతర స్థిరాస్తులతో పాటు బ్యాంకు ఖాతాలు, పెట్టుబడులకు సంబంధించిన వివరాలు కూడా ఉన్నట్లు సమాచారం.

బినామీల పేరిట ఉన్న ఆస్తులు కూడా దర్యాప్తులో భాగం కావడంతో మొత్తం ఆస్తుల విలువ మరింత పెరిగే అవకాశం ఉందా అనే కోణంలో అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఈ కేసులో సుమారు 57 రోజుల పాటు భీమ్‌రెడ్డి చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఆ తర్వాత సెప్టెంబర్ 1వ తేదీన బెయిల్‌పై విడుదల అయ్యారు. అయితే ఆయనపై నమోదైన కేసులో దర్యాప్తు మాత్రం కొనసాగుతోంది. ప్రస్తుతం ఏసీబీతో పాటు ఐటీ అధికారులు కూడా బినామీ ఆస్తులపై దృష్టి పెట్టడంతో కేసు మరింత కీలకంగా మారింది. మరోవైపు ఈ వ్యవహారంలో ఈడీ కూడా మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

ఈ కేసులో బినామీ ఆస్తులపై దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో మీరు ఏం అభిప్రాయపడుతున్నారు? మీ అభిప్రాయాన్ని కామెంట్ బాక్స్‌లో పంచుకోండి.

# ప్రేమను నిరాకరించిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై దాడి



ప్రేమిస్తున్నా.. పెళ్లి చేసుకుంటానంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిని ఓ యువకుడు ఏడాది కాలంగా వేధిస్తున్నాడు. నిరాకరించిన ఆమెపై విచక్షణ రహితంగా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన యువతిని ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో బుధవారం చోటుచేసుకుంది. ఆర్జీఐఏ పోలీసుల వివరాల ప్రకారం.. ఝార్ఖండ్‌కు చెందిన యువతి(25) ఐటీ ఉద్యోగిని. హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ మాదాపూర్‌లో నివాసం ఉంటోంది. అదే సంస్థలో పని చేస్తున్న ఆకాశ్.. ప్రేమిస్తున్నానంటూ వెంటపడుతున్నాడు. గతంలో ఆమె మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెనక్కి తగ్గాడు. దిల్లీలోని బంధువుల వద్దకు వెళ్లి తిరిగి వస్తున్న ఆమెను శంషాబాద్ విమానాశ్రయంలో బెదిరించి కారులో ఎక్కించుకుని హైదరాబాద్ వైపు బయలుదేరాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కోపంతో ఆకాశ్ ఆమెను పిడిగుద్దులు గుద్ది కారు నుంచి దింపేసి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పేషెంట్లుగా వెళ్లిన పోలీసులు...

# నకిలీ డాక్టర్లకు బిగ్ షాక్!

మొదటిపేజీ తరువాయి

మల్లాపూర్ చండీయానగర్‌లో నవోదయ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పేరుతో చిక్సిత అందిస్తున్న ఇస్మాయిల్, వెంకటరమణ కాలనీలో రుదీక్ష మెడికల్ జనరల్ స్టోర్ పేరుతో గంగుల సాయితేజ, సూర్యనగర్‌లో వెంకటేశ్వర ఫస్ట్‌ఎయిడ్ సెంటర్ పేరుతో వైద్యసేవలు అందిస్తున్న పూల శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మైబెల్లి తెలిపారు.

గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో 'మైసమ్మ ఫస్ట్ ఎయిడ్ క్లినిక్' పేరుతో క్లినిక్ నిర్వహిస్తున్న కేశవరావు అనే వ్యక్తిని పోలీసులు గుర్తించారు. క్లినిక్ వద్ద రిజిస్ట్రేషన్ నంబర్ పేరుతో వివరాలు ప్రదర్శించినప్పటికీ, పోలీసులు తనిఖీ చేసిన సమయంలో సరైన అనుమతులు, పత్రాలు చూపించలేదని సమాచారం. మల్కాజిగిరి ఎస్ఓటీ పోలీసులు క్లినిక్‌పై దాడి చేసి కేశవరావును అదుపులోకి తీసుకున్నారు. కాగా, బోడుప్పల్ బొల్లిగూడెం శ్రీసాయి నగర్ శ్రీలక్ష??మీనర్సిహ క్లినిక్ నిర్వహిస్తున్న బోడ శ్యాంసుందర్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

# ప్రభుత్వానికి మంచి పేరు వచ్చినా, చెడ్డపేరు వచ్చినా ఉద్యోగుల వల్లే: రేవంత్

మొదటిపేజీ తరువాయి

సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలంటే.. ఉద్యోగులే ప్రభుత్వ ప్రతినిధులని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని ప్రారంభించిన అనంతరం.. కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. సహాయం కోసం వచ్చిన వాళ్లను మన కుటుంబ సభ్యుల్లా చూడాలని అధికారులకు సూచించారు.

"అందరి సహకారంతోనే సమస్యలు పరిష్కరిస్తూ ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఇంకా సమస్యలున్నాయి.. ప్రజలకు సేవలందిస్తూనే సమస్యలు పరిష్కరించుకోవాలి. 10.5లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులే 4 కోట్ల ప్రజలకు సేవలందిస్తున్నారు. మూడు శాతం ఉద్యోగులు 97 శాతం ప్రజలకు సేవ చేయడం శ్రమతో కూడిన పని. మంచి పేరు వచ్చినా, చెడ్డపేరు వచ్చినా ప్రభుత్వ ఉద్యోగుల వల్లే. సమస్యల పట్ల ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వం సరిగా పనిచేయట్లేదంటారు. ప్రజల కోసం ఎన్ని చట్టాలు చేసినా.. నిధులు ఇచ్చినా చేరవేయాల్సింది ఉద్యోగులే. పేదల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ కార్యాలయం ఉపయోగపడాలి" అని సీఎం అన్నారు. సమావేశంలో కేంద్రమంత్రి బండి సంజయ్ , రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# ఉల్లి పండించే ప్రాంతంలోనే కిలో 90 రూపాయలు..

మొదటిపేజీ తరువాయి

సిటీకి ఎక్కువగా సిల్లోడ్, అలంద్, ఫులంబ్రి, గనోరి.. మొదలైన ప్రాంతాల నుంచి వస్తుంటాయి. అయితే వర్షాభావం కారణంగా పంట సాగు తగ్గిందని.. సిటీకి ఉల్లిగడ్డలు చాలా మేరకు తగ్గిపోయాయని చెబుతున్నారు. ఉల్లి పండించే ప్రాంతంలోనే ఇలా ఉంటే ఇతర ప్రాంతాల పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు.

# ఎయిర్‌పోర్టులో అనుమానంగా కనిపించిన ప్రయాణికుడు.. ఆపి చెక్ చేయగా..

మొదటిపేజీ తరువాయి

తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం, పోలీసులు కొత్త విధానాలను అమలు చేస్తుంటే.. కొందరు కేటుగాళ్లు మాత్రం.. అక్రమంగా రాష్ట్రంలోకి మత్తుపదార్థాలను సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. తాజాగా ఇలానే శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.24.5 కోట్ల విలువైన కొకైన్‌ను సీజ్ చేశారు డీఆర్ఐ అధికారులు.

అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి విదేశాల నుంచి హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఓ ప్రయాణికుడి దగ్గర ఈ భారీ మొత్తంలోని కొకైన్ పట్టుబడింది. ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వస్తుండగా.. సదరు ప్రయాణికుడి ప్రవర్తనపై అనుమానం వచ్చిన డీఆర్ఐ అధికారులు.. అతన్ని ఆపి చెక్ చేయగా.. క్యాబిన్ బ్యాగేజీలో ఏడు డార్క్ చాక్లెట్ డబ్బాలు కనిపించాయి.

అయితే వాటిని ఓపెన్ చేసి చూడగా.. అందులో చాక్లెట్లతో పాటు 207 కొకైన్ క్యాప్సూల్స్ ఉన్నట్టు గుర్తించారు అధికారులు. పట్టుబడిన కొకైన్ మొత్తం సుమారు 4.9 కేజీలు ఉందని... బహిరంగ మార్కెట్‌లో ఈ కొకైన్ విలువ రూ.24.5 కోట్ల వరకు ఉండొచ్చని అధికారులు తెలిపారు. దీంతో అతన్ని అదుపులోకి తీసుకున్న అధికారులు ఘటనపై కేసు నమోదు చేసి.. ఈ రాకెట్ వెనుక ఇంకెవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# రష్యాలో ఉద్యోగ ఆఫర్లకు ఆకర్షితులు కావద్దు! - కేంద్రం హెచ్చరిక



విదేశాల్లో ఉద్యోగాలంటూ వస్తున్న వార్తలపై భారత విదేశాంగ శాఖ మరోసారి స్పందించింది. రష్యా సాయుధ దళాల్లో భారతీయులను నియమించుకుంటున్నట్లు నివేదికలు వస్తూనే ఉన్నాయని, ఇందులో ఉన్న నష్టాలు, ప్రమాదాల గురించి గత రెండేళ్లుగా చెబుతూనే ఉన్నామని పేర్కొంది. విదేశాల్లో ఉద్యోగ అవకాశాల కోసం ప్రయత్నించే భారతీయులు.. ధ్రువీకరించని వ్యక్తులు, ఏజెంట్ల ఆఫర్లకు ఆకర్షితులు కావొద్దని హెచ్చరించింది. ఈ మేరకు విదేశాంశ శాఖ అడ్వైజరీ జారీ చేసింది.

రష్యన్ సాయుధ దళాల్లో చేరితే భారీగా డబ్బు వస్తుందని, ఆ తర్వాత భారత ప్రభుత్వాన్ని ఆశ్రయించి విడుదల కావచ్చని భావించి ఉద్దేశపూర్వకంగా రష్యా సైన్యంలో చేరేందుకు సిద్ధమవుతున్న వారినీ చూశామని కేంద్రం పేర్కొంది. కానీ, ఇది ప్రమాదకరమైన మార్గమని.. ఇటువంటి వాటిని ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రోత్సహించబోమని ఉద్ఘాటించింది.

భారత పౌరసత్వాన్ని వదులుకొని, రష్యా పాస్‌పోర్టు తీసుకొని అక్కడి సైన్యంలో చేరేందుకు కొందరు ప్రయత్నిస్తున్నట్లు కూడా తమ దృష్టికి వచ్చిందని కేంద్రం వెల్లడించింది. భారత అధికారులను సంప్రదించకుండానే ఇప్పటికే పలువురు ఇలా చేశారని చెప్పింది. తాత్కాలిక ఆర్థిక ప్రయోజనాల కోసం ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం వల్ల ప్రాణాలకు తీవ్ర ముప్పు ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించింది.

విదేశీ పౌరులను రష్యా సాయుధ దళాల్లో చేర్చేందుకు ప్రైవేట్ సంస్థలు, కొన్ని గ్రూపులు ప్రయత్నిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని కేంద్రం తెలిపింది. విదేశాంగశాఖలో నమోదు కాని అనధికార ఏజెంట్ల నుంచి ఉద్యోగ ఆఫర్లు అంగీకరించే ముందు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించింది.

# గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం’

## వీబీ జీ రామ్ జీ అమలుపై మంత్రి సీతక్క సమీక్ష

**హైదరాబాద్, త్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 30:**
వీబీ జీ రామ్ జీపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు సంబంధించి క్షేత్రస్థాయి పరిస్థితులపై సమీక్ష చేపట్టారు. గ్రామాల్లో పనుల గుర్తింపు, ఉపాధి కల్పన, పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి క్షేత్రస్థాయి సమస్యలపై మంత్రి ఆరా తీశారు. వీబీ --జీ రామ్ జీ అమలులో గ్రామ పంచాయతీల పాత్ర, బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. పనుల ఎంపికలో గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఉపాధి పనుల్లో పారదర్శకత, నాణ్యత, జవాబుదారీతనానికి పెద్దపీట అని మంత్రి తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా మండల, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని



ఆదేశించారు. గ్రామీణ ప్రజలకు ఉపాధి, గ్రామాలకు అభివృద్ధి, వీబీ --జీ రామ్ జీ అమలును మరింత పటిష్ఠం చేయాలని మంత్రి సీతక్క దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో 12 వేల మందికిపైగా సర్పంచులతో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మండల, జిల్లా అధికారులు పాల్గొన్నారు

# నాచారం ఎస్సై పల్లా ప్రభాకర్‌రెడ్డి పదవీ విరమణ

## 37 ఏళ్ల సుదీర్ఘ సేవలో అనేక అవార్డులు, రివార్డులు



**నాచారం, సెప్టెంబర్ 30 (త్రైనెట్ న్యూస్):**
నాచారం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సబ్‌ఇన్‌స్పెక్టర్ పల్లా ప్రభాకర్‌రెడ్డి 37 ఏళ్ల సుదీర్ఘ పోలీసు సేవ అనంతరం మంగళవారం పదవీ విరమణ చేశారు.
1989లో కానిస్టేబుల్‌గా పోలీసుశాఖలో చేరిన ప్రభాకర్‌రెడ్డి అంకితభావంతో విధులు నిర్వహిస్తూ అంచెలంచెలుగా ఎదిగారు. 2011లో హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన ఆయన, 2024లో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. గత రెండేళ్లుగా నాచారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా సేవలందించారు. విధి నిర్వహణలో చూపిన ప్రతిభ, నిజాయతీ, క్రమశిక్షణకు గుర్తింపుగా ఆయన తన సర్వీసులో 95 నగదు రివార్డులు, ఒక సేవా పతకం, ఒక ఉత్తమ సేవా పతకం, ఆరు ప్రశంసాపత్రాలు, 60 గుడ్ సర్వీస్ ఎంట్రీ రివార్డులు అందుకున్నారు. మాజీ డీజీపీలు పేర్వారం రాములు, సుకుమార్, మహేందర్‌రెడ్డి చేతుల మీదుగా పలు నగదు రివార్డులు స్వీకరించారు.
ప్రభాకర్‌రెడ్డి పదవీ విరమణ సందర్భంగా నాచారం పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. పోలీసుశాఖకు ఆయన అందించిన సేవలను కొనియాడుతూ భవిష్యత్ జీవితం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, సిబ్బంది పల్లా ప్రభాకర్‌రెడ్డికి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.

# నిమ్స్ డాక్టర్ లక్ష్మీ భాస్కర్‌పై సస్పెన్షన్ వేటు

**హైదరాబాద్, త్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 30:**
అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసులో అరెస్టై కస్టడీలో ఉన్న నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్, అదనపు ప్రొఫెసర్ డాక్టర్ నోరి లక్ష్మీ భాస్కర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ సెప్టెంబర్ 28న ఉత్తర్వులు జారీ చేశారు.ఏసీబీ అధికారులు పంపిన రేడియో మెసేజ్‌ల ఆధారంగా డాక్టర్ లక్ష్మీ భాస్కర్‌ను సెప్టెంబర్ 22న సాయంత్రం 6.30 గంటల నుంచి అరెస్టు చేసి కస్టడీలో ఉంచినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన కస్టడీ 48 గంటలకు మించడంతో తెలంగాణ స్టేట్ సివిల్ సర్వీసెస్ (క్లాసిఫికేషన్, కంట్రోల్ అండ్ అప్పీల్) రూల్స్, 1991 ప్రకారం సస్పెన్షన్‌కు అర్హత ఏర్పడినట్లు నిమ్స్ అధికారులు తెలిపారు.ప్రభుత్వ మెమో, ఏసీబీ రేడియో మెసేజ్‌లను పరిశీలించిన అనంతరం డాక్టర్ లక్ష్మీ భాస్కర్‌ను 2026 సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి వచ్చేలా సస్పెండ్ చేస్తున్నట్లు నిమ్స్ డైరెక్టర్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. సస్పెన్షన్ కాలంలో నిబంధనల ప్రకారం ఆయనకు జీవన భృతి చెల్లించనున్నట్లు పేర్కొన్నారు.డాక్టర్ లక్ష్మీ భాస్కర్ సస్పెన్షన్‌కు సంబంధించిన సమాచారాన్ని ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ, తెలంగాణ ప్రభుత్వం, ఏసీబీ, విజిలెన్స్ కమిషన్ తదితర



సంబంధిత అధికారులకు నిమ్స్ అధికారులు పంపించారు. ఉత్తర్వుల ప్రకారం, తదుపరి ఆదేశాలు వెలువడే వరకు సస్పెన్షన్ కొనసాగనుంది.

# సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా ఉద్యోగులు పనిచేయాలి సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, త్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 30:**
పేదలకు సంక్షేమ పథకాలు అందాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు(బుధవారం) జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి..కలెక్టరేట్ భవన సముదాయాన్ని ప్రారంభించారు. ఆపై కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ చేసి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఉద్యోగులే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రతినిధులని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లేది అధికారులే అని చెప్పుకొచ్చారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తున్నామని, మిగతా సమస్యలను కూడా పరిష్కరిస్తామని వెల్లడించారు.ప్రభుత్వానికి మంచిపేరు వచ్చినా.. చెడ్డపేరు వచ్చినా అది ప్రభుత్వ ఉద్యోగుల వల్లే అని సీఎం అన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం రూ.944 కోట్లతో పనులను ప్రారంభించుకున్నామని తెలిపారు. సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా ఉద్యోగులు పనిచేయాలని సూచించారు. అందరి సహకారంతోనే ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. సహాయం కోసం వచ్చినవారిలో కుటుంబసభ్యులను చూడాలన్నారు. సమస్యలతో వచ్చిన పేదలకు వెంటనే పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలను ముందు కార్యక్రమాలను ఎన్నికల సమయంలోనే రాజకీయం చేయాలన్నారు. ఎన్నికలు లేని సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణితో ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.





# పట్టాల పంపిణీతో 26వేల పేద కుటుంబాలకు భరోసా

## డబుల్ ఇంజన్ సర్కార్‌తో పేదలకు వందల రెట్ల లబ్ది

**-ఎన్టీఆర్ జిల్లాలో ఇంటి పట్టాలు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు**
**-రూ.28,112 కోట్ల విలువైన 707ఎకరాల భూములకు హక్కులు**
**-విమెన్ వర్క్ ఫోర్సులో అగ్రస్థానంలో విశాఖ, విజయవాడ**
**-కూటమి ప్రభుత్వ ప్రతి అడుగూ స్వర్ణాంధ్ర సాధన వైపే**
**-ప్రభుత్వం చేసే అభివృద్ధికి అడ్డు పడటమే గొడ్డలి పార్టీ పని**
**--విజయవాడలో ‘పేదలకు పట్టాభిషేకం’ బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

**అమరావతి, త్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:**
ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రజలు వేసిన ప్రతీ ఓటుకూ న్యాయం చేస్తూ ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ జెట్ స్పీడుతో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ ముందుకు వెళ్తోందని వ్యాఖ్యానించారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో నిర్వహించిన పేదలకు పట్టాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న సీఎం దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న భూములకు హక్కులు కల్పిస్తూ పేదలకు పట్టాలు పంపిణీ చేశారు. బహిరంగ సభలో ఏర్పాటు చేసిన ర్యాంపుపై మంత్రులు సత్యకుమార్ యాదవ్, నాదెండ్ల మనోహర్ తో కలిసి నడుస్తూ ప్రజలకు అభివాదం చేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ..” విశాఖపట్నంలో 28 వేల మందికి, మంగళగిరిలో 5,800 కుటుంబాలకు భూములపై హక్కులు కల్పిస్తూ పట్టాలు ఇచ్చాం. ఇప్పుడు విజయవాడలో 26,401 వేల మంది కుటుంబాలకు పట్టాలు ఇస్తున్నాం. మొత్తం కలిపి ఇప్పటి వరకూ 60 వేల మంది పేదలకు పట్టాలు ఇవ్వటం నా అదృష్టంగా భావిస్తున్నాను. రూ.52 వేల కోట్ల విలువైన భూముల్ని పేదలకు ఇవ్వటం సంతోషంగా ఉంది. పేదలకు జరుగుతున్న పట్టాభిషేకం ఇది. విజయవాడలో ఇస్తున్న భూముల విలువ రూ.28,112 కోట్లుగా ఉంది. 707 ఎకరాల్లోని 34 లక్షల చదరపు గజాల స్థలానికి పేదలకు హక్కులు కల్పించాం. ఒక్కో స్థలం విలువ రూ.50 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకూ ఉంటుంది. ఇదే పేదల ఆత్మగౌరవానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న పట్టాభిషేకం. దశాబ్దాలుగా పేదలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చూసి చలించి మీ స్థలాలకు హక్కుల కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నాం. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో పేదలకు పట్టాలు వచ్చేలా కృషి చేసిన ప్రజాప్రతినిధులకు, అధికారులకు అభినందనలు తెలియచేస్తున్నా. గత పాలనలో ఐదేళ్ల పాటు విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టాం, ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటాం. ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను భవిష్యత్తు కోసం జాగ్రత్తగా కాపాడుకోవాలని అందరికీ సూచిస్తున్నాను. రాష్ట్రంలో దశాబ్దాలుగా ఉన్న భూ సమస్యల్ని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నాం. విశాఖ, వట్టిచెరుకూరు, కంగుమంది, కైకలూరు, అమలాపురం లాంటి చోట్ల ఉన్న ఈ తరహా సమస్యల్ని పరిష్కరించి పట్టాలు ఇచ్చాం.” అని ముఖ్యమంత్రి అన్నారు.

**అభివృద్ధికి గొడ్డలి పార్టీ అడ్డంకులు**
“2019-24లో గత పాలకులు ప్రతి ఇంట్లోనూ ఆస్తుల వివాదాలు సృష్టించారు. పట్టాదారు పాస్ పుస్తకాలపై వారి బొమ్మలేసుకున్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో ఇబ్బందులు సృష్టించారు. సర్వేరాళ్లపై బొమ్మలు వేసుకోడానికి రూ.800 కోట్లు ఖర్చు చేశారు. ఆ డబ్బులు ఉంటే పేదలకు మరింత సంక్షేమం జరిగేది. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో భూములన్నిటిని రీసర్వే చేసి రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నాం. ఎలాంటి వివాదాలు లేని కొత్త వ్యవస్థను తీసుకువచ్చేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. సంక్షేమం- అభివృద్ధి- సంపద సృష్టి అనేది నిరంతరం జరిగేలా వివిధ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఇప్పటికే రూ.1.50 లక్షల కోట్లు అభివృద్ధికి ఖర్చు చేశాం. వైసీపీ రాక్షసులు పట్టిసీమ ప్రాజెక్టుకు అడ్డంపడ్డారు. కానీ పట్టుదలతో ప్రాజెక్టు పూర్తి చేసి ఇప్పటికే 490 టీఎంసీల నీటిని తీసుకువచ్చాం. ఎల్ నినో కారణంగా కృష్ణా



నదిలో శ్రీశైలం, ప్రకాశం బ్యారేజీకి నీరే రాలేదు. పట్టిసీమ నుంచి నీరు తెచ్చి డెల్టా ప్రాంతానికి నీరు ఇచ్చాం. విజయవాడకు కూడా నీటి సమస్య లేకుండా చేయగలిగాం. గోదావరి నదిలో ఈ ఏడాది ఇప్పటి వరకూ 1400 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లాయి. రోజుకు 75 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్తోంది. అందులో ఓ 100 టీఎంసీలు తెచ్చుకుంటే అంతా సస్యశ్యామలం అవుతుంది. పోలవరం ప్రాజెక్టును వచ్చే ఏడాదికి పూర్తి చేసి గ్రావిటీపై తీసుకువస్తాం. కృష్ణా డెల్టాలో పొదుపు చేసిన నీటిని రాయలసీమ ప్రాంతానికి ఇస్తాం. అన్ని ప్రాంతాలకూ తాగు, సాగునీరు ఇవ్వాలన్నదే మా లక్ష్యం. మనతో పాటు మన పొరుగు రాష్ట్రాల వారు కూడా బాగుండాలన్నదే మా సిద్దాంతం. గోదావరి - కావేరి నదుల అనుసంధానం జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు నీటి కొరతే రాదు. వచ్చే మూడేళ్లలో రూ.35 వేలకోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. 2028 కృష్ణా పుష్కరాల నాటికి కృష్ణా-గోదావరి నీళ్లు పుష్కలంగా మనకు వస్తాయి” అని సీఎం వ్యాఖ్యానించారు.

**మహిళా వర్క్ ఫోర్సులో ఏపీ కీలకం**
“అభివృద్ధి భవిష్యత్తులో సంపద సృష్టికి అవసరం. అభివృద్ధి- సంక్షేమమే కూటమి ప్రభుత్వానికి రెండు కళ్లు. ప్రజల ఆదాయాన్ని పెంచేలా మా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పేదల సంక్షేమం మా మొదటి ప్రాధాన్యం ఇస్తున్నాం. ఠంచనుగా మొదటి తేదీనే వారికి పెన్షన్ ఇస్తున్నాం. స్త్రీశక్తి ద్వారా ఆడబిడ్డలకు డబ్బులు ఆదా అవుతున్నాయి. గత పాలకులు రూ.32 వేల కోట్ల మేర విద్యుత్ ఛార్జీల భారం వేశారు. మేం ట్రూ డౌన్ చేసి విద్యుత్ భారం తగ్గించాం. కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చాం. ఆ మాట నిలబెట్టుకున్నాం. అన్నా క్యాంటీన్ ద్వారా పేదల కడుపు నింపేలా మేం చర్యలు తీసుకుంటున్నాం. మత్స్యకారుల సేవలో, ఆటోడ్రైవర్ల సేవలో, నేతన్నల సేవలో కార్యక్రమాల ద్వారా ఆయా వర్గాలకు చేయూత అందుతోంది. వడ్డెర్లు, గీత కార్మికులకు కూడా సహకారం అందిస్తున్నాం. పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా పీ4 కార్యక్రమం తీసుకువచ్చాం. కుప్పంలో ఓ సాధారణ మహిళను టీవీఎస్ కంపెనీ దత్తత తీసుకుంది. నిన్నటి వరకూ కూలీగా ఉన్న ఆ మహిళ ఇటుకల బట్టీ యూనిట్ ను ఏర్పాటు చేసుకుని 20 మందికి ఉపాధి అందిస్తోంది. కేంద్ర గణాంకశాఖ విమెన్ వర్క్ ఫోర్సుపై ఓ నివేదిక విడుదల చేసింది. విశాఖ మొదటి స్థానంలో ఉంది. ప్రతీ వంద మందిలో 42 మంది మహిళలు ఉన్నారు. విజయవాడలో ప్రతీ వంద మందిలో 37 మంది పనిచేస్తున్నట్టు వెల్లడైంది. పారిశ్రామిక వేత్తలుగా ప్రతీ వంద మందిలో 30 శాతం మంది మహిళలే ఉన్నారు. రాష్ట్రంలో డ్వాక్రా మహిళలు ఉత్పత్తి చేస్తున్న ఉత్పత్తులను స్వయం బ్రాండ్ కింద మార్కెటింగ్ చేయిస్తున్నాం. ఇప్పటికే 5.5 లక్షల ఇళ్లు పూర్తి చేసి లబ్దిదారులకు అందించే వచ్చే ఏడాదిలోగా మరో 5.5 లక్షల ఇళ్లు ఇస్తాం. పేదలందరికీ ఇంటిజాగా, ఇల్లు, తాగునీటికి కుళాయి ఉండేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని” సీఎం వ్యాఖ్యానించారు.

**గ్లోబల్ సిటీస్ ఇండెక్స్‌లో ఏపీ నగరాలు**
పురాణ కాలంలో రాజులు యజ్ఞాలు చేస్తే రాక్షసులు అడ్డుపడే వారు. ఇప్పుడు గొడ్డలి పార్టీ అదే పనిచేస్తోంది. పేదలకు పట్టాలు ఇస్తుంటే ఎలా ఇస్తారంటూ గొడ్డలి పార్టీ అడ్డుపడుతోంది. ఇలా ఏ పనిచేసినా ఆ పార్టీ నేతలు అడ్డుపడుతున్నారు. అమరావతి ప్రజా రాజధాని నిర్మాణాల్ని కూడా ఆ పార్టీ అడ్డుకుంటోంది. ప్రపంచ బ్యాంకులు లేఖలు రాశారు. చెరుకు తోటలు తగులబెట్టారు. ఇలా నానా విన్యాసాలు చేశారు. రాజధాని నిర్మాణానికి నిధులు రాకుండా అడ్డుకునేందుకు ప్రపంచబ్యాంకుకు లేఖలు రాశారు. చెరుకు తోటలు తగలబెట్టారు. నానా విన్యాసాలు చేశారు. మూడు రాజధానులని, అమరావతి శ్మశానమని వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటులో అమరావతికి చట్టబద్ధత వచ్చిన రోజే మావిగన్ అంటూ కొత్త ఆటలు మొదలు పెట్టారు. మావిగన్ అంటే విజయవాడలో ఉన్నవారికైనా అర్థం అయ్యిందా అని ప్రశ్నిస్తున్నా. ఎవరికి ఇష్టం ఉన్నా లేకపోయినా అమరావతి అత్యుత్తమ రాజధాని నగరంగా తయారవుతుంది. విజయవాడకు, అమరావతికి అందం తెచ్చిపెట్టేది నీళ్లే. ఇది బ్లూ సిటీ, 50 శాతం పచ్చదనంతో కళకళలాడేలా నగర నిర్మాణం జరుగుతోంది. రాజధాని అమరావతిలో వినియోగించే విద్యుత్ అంతా గ్రీన్ ఎనర్జీనే. నెట్ జీరోగా నగరాన్ని తీర్చిదిద్దుతున్నాం. విజయవాడ, గుంటూరులో భూములకు విలువ పెరిగింది. ఇన్నర్ రింగ్ రోడ్డు, అవుటర్ రింగ్ రోడ్ల ద్వారా కనెక్టివిటీ పెరుగుతుంది. బుల్లెట్ ట్రైన్ సహా, 4 లేన్ రైల్వే లైన్ వస్తుంది. అమరావతి-విజయవాడ-గుంటూరు ఒకే నగరంగా తయారవుతాయి. మన విజయవాడ ప్రపంచంలోని వెయ్యి నగరాల్లో చోటు సంపాదించింది. నాణ్యమైన జీవన ప్రమాణాలు, మానవ వనరులు, పర్యావరణం లాంటి అంశాల్లో విజయవాడ, గుంటూరు, నెల్లూరు, విశాఖ చోటు సంపాదించాయి. విజయవాడ నగరంలో కాలుష్యం లేకుండా వాటర్ స్ప్రేయింగ్ చేయిస్తున్నాం. విజయవాడ ఎయిర్ పోర్టులో కొత్త టెర్మినల్ తో అత్యద్భుతంగా తీర్చిదిద్దుతున్నాం. మచిలీపట్నంలో గోవాషిప్ యార్డు షిప్ బిల్డింగ్ సెంటర్ నిర్మిస్తోంది. రూ.8 వేల కోట్ల పెట్టుబడులతో ఈ నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటు చేస్తుంది. ప్రకాశం బ్యారేజి ఎగువన దిగువన వైకుంఠపురం, చోడవరం దగ్గర బ్యారేజీలను నిర్మించి నీటిని నిల్వచేస్తాం. అమరావతికి కనెక్టివిటీ పెరిగేలా వెస్ట్ బైపాస్ తో పాటు మరో బ్రిడ్జి కూడా నిర్మాణం చేస్తాం. రూ.50 వేల కోట్లతో పట్టణాల్లో అభివృద్ధి కార్యక్రమాలు మొదలు పెట్టాం. గ్రామీణ ప్రాంతాల్లో రూ.11 వేల కోట్లతో పనులు ప్రారంభించాం
ఒక్క కియా ప్రాజెక్టు అనంతపురంలో, వెలిగొండ మార్కాపురంలో, భోగాపురం విజయనగరంలో మార్పులు తీసుకువస్తున్నాయి. అమరావతి ఈ ప్రాంతంలో భూముల రేట్లు పెరిగాయి. పోర్టులు, ఎయిర్ పోర్టులు, రోడ్, రైల్ నెట్వర్క్‌లు పూర్తై అవకాశాలను అందిపుచ్చుకోవాలి” అని ముఖ్యమంత్రి అన్నారు.

**పేటీఎం బ్యాచ్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి**
“2019-24 మధ్య కాలంలో విభజన కంటే ఎక్కువగా రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. ఇప్పుడు ఆ కష్టనష్టాలను అధిగమించి వికాసం వైపు మనం ముందడుగు వేస్తున్నాం. ప్రతీ అడుగు స్వర్ణాంధ్ర సాధన దిశగా వేసుకుంటూ ముందుకు వెళ్తున్నాం. ఇక ఎవరి వల్లా రాష్ట్రం నష్ట పోకూడదనే కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపటమే లక్ష్యంగా మేం పనిచేస్తున్నాం. మంచి చేసే ప్రభుత్వాన్ని గుర్తించాలని ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రజా బలమే శ్రీరామ రక్షగా 2024లో మేం అధికారంలోకి వచ్చాం. గొడ్డలి పార్టీని చిత్తుగా ఓడించి శాశ్వతంగా సమాధి చేయాలని కోరుతున్నా .ప్రభుత్వం చేసిన మంచి గురించి ప్రజలు సామాజిక మాధ్యమాల్లో పంచుకోవాలి. పేటీఎం బ్యాచ్‌ల రీల్స్‌తో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారు. లబ్దిపొందిన వారంతా అనుభవాలు పంచుకుంటే సోషల్ మీడియా బద్దలవుతుంది. గతంలో సీఈఓ సీఎం అని పిలిచినా కలగని ఆనందం వాటర్ మాన్ అంటూ చేసిన వ్యాఖ్యతో కలిగింది. పలు సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి సాగునీరు, తాగు నీరందిస్తున్నందుకు వాటర్ మాన్ అంటూ పత్రికలు రాశాయని” సీఎం వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, నాదెండ్ల మనోహర్ సహా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

# ప్రత్యేక ప్రచారం--6 సన్నద్ధతపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సమీక్ష

## పరిశుభ్రతకు సంస్థాగత రూపం.. పెండింగ్ సమస్యల పరిష్కారంపై దృష్టి

**‘వ్యర్థాల నుంచి సంపద’, ఈ--వ్యర్థాల నిర్వహణకు ప్రాధాన్యం**
**బొగ్గు ప్రభుత్వ రంగ సంస్థల్లో 1,500కు పైగా ప్రదేశాల గుర్తింపు**
**సమీక్షకు దాదాపు 60 వేల ఫైళ్లు**

**ఢిల్లీ, సెప్టెంబర్ 30 (త్రైనెట్ న్యూస్ న్యూస్):**
ప్రత్యేక ప్రచారం--6 అమలుకు సంబంధించి కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) చేపట్టిన సన్నాహాలు, సాధించిన పురోగతిని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి సమీక్షించారు.
బొగ్గు శాఖ కార్యదర్శి, సీఐఎల్ ఛైర్మన్, అనుబంధ సంస్థల సీఎండీలు, ఇతర సీనియర్ అధికారులతో నిర్వహించినసమావేశంలోప్రచార కార్యక్రమాలపై మంత్రి సమగ్రంగా చర్చించారు. పరిశుభ్రతను సంస్థాగత సంస్కృతిగా మార్చడంతోపాటు పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.
ముఖ్యంగా ‘వ్యర్థాల నుంచి సంపద’ సృష్టించడం, ఈ--వ్యర్థాల సమర్థ నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ప్రత్యేక ప్రచారం-



-6లో భాగంగా బొగ్గు రంగ ప్రభుత్వ సంస్థల పరిధిలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టేందుకు 1,500కు పైగా ప్రదేశాలను గుర్తించారు. అలాగే దాదాపు 60 వేల ఫైళ్లను సమీక్షించాలని లక్ష్యంగా నిర్ణయించారు.

# దరఖాస్తులకు ఆహ్వానం మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్



**మెదక్ ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:**

ఖరీఫ్ 202627 ధాన్యం కొనుగోలు సీజన్ సందర్భంగా జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో (గ్రాజం) సన్న రకం ధాన్యాన్ని గుర్తించి, ధృవీకరించేందుకు దీ.వా.ఎ.అగ్రికల్చర్ / అగ్రికల్చర్ లో డిప్లొమా అర్హత కలిగిన వ్యక్తుల సేవలు 2 నెలల కాలానికి అవసరమున్నవనీ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ధాన్యం కొనుగోల కేంద్రాల సంఖ్య ,అర్హతను పరిగణనలోకి తీసుకుని, అర్హత కలిగిన వ్యక్తుల సేవలు కొరకు జిల్లా స్థాయి కమిటీ తుది నిర్ణయం తీసుకోబడుతుందన్నారు. ఆసక్తి , అర్హత కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతలు, అనుభవ వివరాలతో మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని సంప్రదించగలరనీ తెలిపారు.

# 28 ప్యాకేజీ పై ప్రత్యేక దృష్టి సారించండి



**విభాగాల వారిగా అంచనాలు తయారు చేయండి**
**అధికారులకు సూచించిన ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్**



**నిర్మల్ జిల్లా. ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:**

నియోజకవర్గం లో 50 వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా చేపట్టనున్న 28 ప్యాకేజీ పనులపై అంచనాలు తయారు చేసి తక్షణమే ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సూచించారు. ఇటీవల ఎమ్మెల్యే 28 ప్యాకేజీ కి 500 కోట్ల రూపాయల నిధులు ఇవ్వాలని అసెంబ్లీ సమావేశాల్లో కోరిన విషయం విదితమే.. అందులో భాగంగానే బుధవారం భైంసా లోని ఎమ్మెల్యే నివాసం లో ఇరిగేషన్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించిన సందర్భంగా అయన మాట్లాడారు. పది సంవత్సరాలుగా ప్యాకేజీ పనులు ముందుకు సాగపోవడంతో పనులు ఎంతవరకు చేపట్టారు, ప్రస్తుతం చేపట్టాల్సిన పనులేంటి అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. గతంలో 48 శాతం పనులు అయ్యాయని, ప్రస్తుతం మిగిలిన పనులకు ఎన్ని నిధులు అవసరం అన్న విషయంపై చర్చించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ముధోల్, తానుర్, కుభీర్ మండలాలోని ఆయా గ్రామాల్లో 50 వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పెట్టుకుంది ప్రభుత్వం. అధికారులు విభాగాల వారీగా అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి తక్షణమే నివేదిక సమర్పించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పటేల్ మాట్లాడుతూ 28 ప్యాకేజీ పనులు పూర్తయితే, గోదావరి నది జలాల ద్వారా లిఫ్ట్ ఇరిగేషన్ తో ముధోల్ నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుందన్నారు. రామన్న రెండు సంవత్సరాల్లో ఈ ప్రాజెక్టును పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు. ఈ విషయమై పలుమార్లు అసెంబ్లీలో ప్రస్తావించడం జరిగిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించడం జరిగిందన్నారు. త్వరలోనే ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని ఆశా భావం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎస్. ఇ. రాజేంద్రప్రసాద్, ఈఈ ప్రవీణ్, డి. ఇ.నవీన్ తో పాటు అధికారులు పాల్గొన్నారు.

# సర్వే నంబర్ 167 భూమిపై ఆరోపణలు సరికావు

**మహబూబాబాద్ జిల్లా ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:**



మండలం వెలికట్ల గ్రామంలోని సర్వే నంబర్ 167లోని 600 గజాల భూమికి సంబంధించి ఇటీవల కొంతమంది వ్యక్తులు చేస్తున్న ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని బాధితులు పేర్కొన్నారు. ఈ భూమికి సంబంధించి తమ వద్ద కోర్టుకు సంబంధించిన పత్రాలతో పాటు, మండల స్థాయి అధికారుల నుంచి జారీ చేసిన ధృవీకరణ పత్రాలు, ఇతర అధికారిక ఆధారాలు తమ వద్ద ఉన్నాయని వారు తెలిపారు.భూమి విషయంలో తమ హక్కులు,లావాదేవీలకు సంబంధించిన అంశాలను పరిశీలించిన అనంతరం సంబంధిత అధికారులు అవసరమైన ధ్రువపత్రాలను జారీ చేశారని బాధితులు వెల్లడించారు.అయినప్పటికీ కొంతమంది వ్యక్తులు ఎలాంటి పూర్తి ఆధారాలు లేకుండా తమపై అసత్య ఆరోపణలు చేస్తూ గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.తమ వద్ద ఉన్న కోర్టు పత్రాలు, మండల అధికారుల ధృవీకరణ పత్రాలు, ఇతర రికార్డులను సంబంధిత అధికారుల ముందు సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నామని బాధితులు తెలిపారు. అధికారిక రికార్డులు, న్యాయపరమైన పత్రాలను పరిశీలించిన అనంతరం మాత్రమే భూమికి సంబంధించిన వాస్తవాలను నిర్ధారించాలని వారు కోరారు.తమపై చేస్తున్న ఆరోపణలను ఉపసంహరించుకోవాలని, ఆధారాలు లేకుండా వ్యక్తిగతంగా ఆరోపణలు చేయవద్దని బాధితులు విజ్ఞప్తి చేశారు.ఈ వ్యవహారంపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని వారు కోరారు.

# సిరిసిల్ల సీఎం రేవంత్ రెడ్డి సభకు కదిలిన చిగురుమామిడి కాంగ్రెస్ శ్రేణులు

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్ ఆధ్వర్యంలో సభకు..




**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30: /చిగురుమామిడి:**

రాజన్న సిరిసిల్లలో నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు చిగురుమామిడి మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులుభారీసంఖ్యలో తరలివెళ్లారు.

బుధవారం చిగురుమామిడి మండల కేంద్రం నుండి ప్రత్యేక బస్సుల్లో వారు సభకు స్వచ్ఛందంగా తరలిపోయారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా రంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేసేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పిలుపు మేరకు మండల ప్రజలు,కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున కదిలివచ్చారని తెలిపారు.నియోజకవర్గ అభివృద్ధికి,ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ఈ కార్యక్రమంలో చిగురుమామిడి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్,హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్,డిసిసి జిల్లా కార్యదర్శి బడుకోలు దేవేందర్ రెడ్డి,సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మార్క రాజ్ కుమార్ గౌడ్, పార్టీ ప్రతినిధి పొన్నం శ్రీనివాస్,గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ తోపాటు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు,ముఖ్య నాయకులు,అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# పిల్లల్లోని ప్రతిభను గుర్తించి వారిని సరైన దిశలో ప్రోత్సహించడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత:-ఎస్పీ డా. శబరీష్,, ఐపీఎస్.

**మహబూబాబాద్ జిల్లా ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:**

కరాటే పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించిన పోలీస్ కానిస్టేబుల్ కుమారుడు విఘ్నేష్‌ను అభినందించిన మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఐపీఎస్

వరల్డ్ ఫునాకోషి షోటోకాన్ కరాటే ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ముంబైలోని ప్రియదర్శిని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన 37వ ఆల్ ఇండియా / ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో మహబూబాబాద్ జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్నఉన్నపోలీస్ కానిస్టేబుల్ సోమలింగయ్య కుమారుడు జి. విఘ్నేష్ యాదవ్ ప్రతిభ కనబరిచి రెండు స్వర్ణ పతకాలు సాధించాడు.

అండర్-12 ఆరంజ్ బెల్ట్ విభాగంలో అద్భుతమైన



ప్రతిభను కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి రెండు బంగారు పతకాలను విఘ్నేష్ గెలుపొందాడు.

ఈ సందర్భంగా సాధించిన విజయానికి గాను, జిల్లా పోలీస్ కార్యాలయంలో మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, ఐపీస్ విఘ్నేష్ కు అభినందనలు తెలిపారు. చిన్నవయస్సులోనే జాతీయ/అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి జిల్లాకు, పోలీస్ కుటుంబానికి మంచి పేరు తెచ్చాడని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇదే పట్టుదలతో శ్రమించి మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని విఘ్నేష్‌ను ప్రోత్సహించారు.

అలాగే, విధులు నిర్వహిస్తూనే కుమారుడిని క్రీడల్లో ఎంతో ప్రోత్సహిస్తున్న తండ్రి, కానిస్టేబుల్ సోమలింగయ్యనుఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. పిల్లల్లోని ప్రతిభను గుర్తించి వారిని సరైన దిశలో ప్రోత్సహించడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత అని ఈ సందర్భంగా ఎస్పీ పేర్కొన్నారు.

# అప్రమత్తతే రక్షణ మహిళలు, బాలికల భద్రతకు అండగా షీ టీం వేధింపులు, సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగాహన అత్యవసర పరిస్థితుల్లో 112, సైబర్ మోసాలకు 1930

**మహబూబాబాద్ జిల్లా ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:**

కేసముద్రం పరిధిలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ అప్‌గ్రేడెడ్ స్కూల్ మరియు జూనియర్ కాలేజీలో మహిళలు, బాలికలు మరియు విద్యార్థినుల భద్రతపై మహబూబాబాద్ షీ టీం, కేసముద్రం పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ డా. పి. శబరీష్, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా షీ టీం ఎస్ఐ కుమారి సునంద మాట్లాడుతూ మహిళలు, బాలికల భద్రత పోలీస్ శాఖకు అత్యంత ప్రాధాన్య అంశమని తెలిపారు. ఎలాంటి వేధింపులు లేదా సమస్య ఎదురైనా భయపడకుండా పోలీసులను, షీ టీంను సంప్రదించాలని సూచించారు.

వేధింపులపై అప్రమత్తంగా ఉండాలి.

ఈవ్ టీజింగ్, స్ట్రీట్ హరాస్మెంట్, మహిళలపై వేధింపులు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా మోసాలు, మానవ అక్రమ రవాణా తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలు, యువతులు వేధింపులకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, నేరాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మైనర్ బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడే వారిపై పోక్సో చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు వివరించారు.





సైబర్ మోసాలపై జాగ్రత్త అవసరం.

విద్యార్థులు సోషల్ మీడియా, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరం లేదా ఆన్‌లైన్ ఆర్థిక మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు, మహిళలు లేదా బాలికలు వేధింపులకు గురైనప్పుడు షీ టీం నంబర్ 8712656935కు సంప్రదించాలని సూచించారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి.

విద్యార్థులు చదువుపై దృష్టి సారించి, చిన్న వయసులో ప్రలోభాలకు లోనుకాకుండా తమ భవిష్యత్తుకోసం ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని ఎస్ఐ సునంద సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల, ఓపికతో కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు.

ఏదైనా తప్పు నిర్ణయం తీసుకునే ముందు తల్లిదండ్రులు తమ కోసం పడుతున్న కష్టాలను గుర్తు చేసుకోవాలని, తల్లిదండ్రులను గౌరవిస్తూ వారి ఆశయాలను నెరవేర్చే విధంగా ముందుకు సాగాలని సూచించారు.

నిర్భయంగా ఫిర్యాదు చేయాలి.

మహిళలు, బాలికలు తమకు ఎదురయ్యే సమస్యలను దాచుకోకుండా పోలీసులకు సమాచారం అందించాలని, "ఏ సమస్య ఉన్నా నిర్భయంగా ఫిర్యాదు చేయండి" అని షీ టీం ఎస్ఐ సునంద పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ అప్‌గ్రేడెడ్ స్కూల్ మరియు జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ కె. సుజాత, అధ్యాపక బృందం, సుమారు 550 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. షీ టీం సిబ్బంది రమేష్, సుధారాణి, ప్రియాంక, కేసముద్రం పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ధర్మానాయక్, ఉమెన్ కానిస్టేబుల్స్ అరుణ, రజిత తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలకు అండగా నేనావత్ దేవరన్ నాయక్

**- 70వ ఎస్ జి ఎఫ్ జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు భోజన సౌకర్యం.. విజేతలకు బహుమతులు.**
**- నల్లగొండ జిల్లా ఆరు నియోజకవర్గాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులులి**
**- ఆటల పోటీల నిర్వాహకులు ప్రాంతాల వారిని కాకుండా నిష్పక్షపాతంగా ఎంపైరింగ్ చేసి నిజమైన క్రీడాకారులను విజేతలుగా చేయాలని కోరిన ఎమ్మెల్యే.**
**- దేవరకొండలో స్పోర్ట్స్ అకాడమీతో పాటు ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేస్తాం.**
**- ఎమ్మెల్యే బాలు నాయక్.**

**దేవరకొండ నియోజకవర్గం ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:**

క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. విద్యార్థులు, యువత క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

దేవరకొండలో నిర్వహిస్తున్న 70వ ఎస్ జి ఫ్ జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఎమ్మెల్యే బాలు నాయక్ కుమారుడు నేనావత్ దేవరన్ నాయక్ సహకారం అందిస్తున్నారు. పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు భోజన సౌకర్యం కల్పించడంతో పాటు విజేత జట్లకు బహుమతులు అందించే బహుమతుల ధాతగా దేవరన్ నాయక్ వ్యవహరిస్తున్నారు.క్రీడాకారులను ప్రోత్సహించడంలో దేవరన్ నాయక్ గతంలోనూ ముందుండేవారని, ఇలాంటి క్రీడా కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తూ యువతను క్రీడల వైపు ప్రోత్సహిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు.

**ఆరు నియోజకవర్గాల నుంచి క్రీడాకారులు**

70వ స్గఫ్ ఎస్ జి ఎఫ్ జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో దేవరకొండ, నల్లగొండ, నకిరేకల్, నాగార్జునసాగర్, మునుగోడు, మిర్యాలగూడ నియోజకవర్గాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొంటూ తమ ప్రతిభను చాటుతున్నారు.దేవరకొండలో స్పోర్ట్స్ అకాడమీతో పాటు ఇండోర్ స్టేడియం దేవరకొండ ప్రాంతంలో క్రీడలకు ఉన్న ఆదరణను దృష్టిలో పెట్టుకొని స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేయబోతున్నామని ఎమ్మెల్యే బాలు నాయక్ వెల్లడించారు. కబడ్డీతో పాటు బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ తదితర ఇండోర్



క్రీడల్లో యువత శిక్షణ పొందేందుకు అవసరమైన వసతులు కల్పించడమే లక్ష్యమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

దేవరకొండ ప్రాంతంలో విద్యా రంగాన్ని మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు. ఇందులో భాగంగా రూ.9.60 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు, క్రీడా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

దేవరకొండలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ అభివృద్ధికి రూ.2.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు. ముఖ్యమంత్రి శ్రీ ఏ. రేవంత్ రెడ్డి గారి చొరవతో ఈ అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీకి చారిత్రక ప్రాధాన్యత ఉందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి మామగారు, మాజీ కేంద్ర మంత్రి స్వర్గీయ సూదిని జైపాల్ రెడ్డి ఇదే కళాశాలలో చదువుకున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జైపాల్ రెడ్డి విద్యార్థి దశతో అనుబంధం ఉన్న ఈ విద్యాసంస్థను మరింత అభివృద్ధి చేసి, నేటి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు.

**దేవరకొండలోనే మోటార్ వెహికిల్ రిజిస్ట్రేషన్ సేవలు**

ప్రజలకు పరిపాలనా సేవలను మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. గతంలో మోటార్ వెహికిల్ రిజిస్ట్రేషన్ వంటి పనుల కోసం దేవరకొండ ప్రాంత ప్రజలు



మిర్యాలగూడకు వెళ్లాల్సి వచ్చేదని ప్రస్తుతం దేవరకొండలోనే ఈ సేవలు అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా అవుతున్నాయని తెలిపారు.

**క్రీడలకు ప్రోత్సాహం కొనసాగిస్తాం**

క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులు, యువతకు తన కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. నేనావత్ దేవరన్ నాయక్ ఇప్పటికే పలు క్రీడా కార్యక్రమాలకు సహకరిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని, భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలకు తనవంతు సహకారం కొనసాగిస్తారని తెలిపారు.క్రీడల్లో పాల్గొనే ప్రతి విద్యార్థిని తల్లిదండ్రులు ప్రోత్సహించాలని, క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ పెంపొందుతాయని ఎమ్మెల్యే అన్నారు.

**క్రీడాకారులకు అభినందనలు**

70వ SGF జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు సహకరిస్తూ క్రీడాకారులకు భోజన సౌకర్యం కల్పించడం, విజేతలకు బహుమతులు అందించేందుకు ముందుకు వచ్చిన నేనావత్ దేవరన్ నాయక్ క్రీడాకారులు, నిర్వాహకులు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవరకొండ సబ్ కలెక్టర్, ఎస్ జి ఎఫ్ నిర్వాహకులతో పాటు దేవరకొండ పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, హనుమంతు వెంకటేష్ గౌడ్, స్థానిక కౌన్సిలర్లు, మారుపాకుల సురేష్ గౌడ్, దొండేటి మల్లారెడ్డి, కొర్ర రాంసింగ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పంచ్‌చర్ షాపు నుంచి డీఎస్పీ వరకు.. వల్లేపు మౌనిక అరుదైన విజయగాథ




**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంచార్జ్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:**

పులివెందుల:పేదరికం ఏ సక్సెస్ కైనా అడ్డుకాదని, పట్టుదల ఉంటే ఎంతటి శిఖరాగ్రాలనైనా అధిరోహించవచ్చని నిరూపించారు పులివెందులకు చెందిన వల్లేపు మౌనిక. సాధారణ కుటుంబంలో జన్మించిన ఆమె, కష్టాలను ఓడిస్తూ గ్రూప్-1 పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు.

గ్రూప్-1 పోటీ పరీక్షల్లో 315వ ర్యాంకు సాధించి, నేరుగా డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా ఎంపికై రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

**తల్లిదండ్రుల కష్టమే స్ఫూర్తి:**

మౌనిక తండ్రి ఒక సాధారణ పంచ్?చర్ షాపు నిర్వహిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ఇక తల్లి కూలీ పనులు చేస్తూ బిడ్డలను ప్రయోజకులను చేయడానికి అహర్నిశలు శ్రమించారు. అమ్మానాన్నల కష్టాన్ని కళ్లారా చూసిన మౌనిక, వారి కన్నీళ్లను తుడవడమే లక్ష్యంగా కష్టపడి చదివారు. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఎదురైనా వెనకడుగు వేయకుండా, సంకల్పబలంతో చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించి చూపించారు. విద్య, క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఎలాంటి ఉన్నత శిఖరాలనైనా చేరుకోవచ్చని వల్లేపు మౌనిక నేటి యువతకు రోల్ మోడల్‌గా నిలిచారు. ఈ ఘన విజయం సాధించిన మౌనికను పలువురు అభినందిస్తున్నారు.

# వడ్డెరల ఐక్యతే మన బలం.. రాజకీయంగా ఎదగాలని బర్లు లక్ష్మీకాంత్ రాజు పిలుపు




**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంచార్జ్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:**

**అమరావతి:**

సమాజంలో సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన వడ్డెర, వడియరాజు వర్గాలు అన్ని రంగాల్లో సముచిత స్థానం దక్కించుకోవడానికి రాజకీయ ప్రస్థానంలో మునుపెన్నడూ లేని విధంగా ఐక్యత ప్రదర్శించాలని ఆంధ్రప్రదేశ్ వడ్డెర సంఘం అధ్యక్షులు, వడ్డెర హక్కుల ఉద్యమ నేత బర్లు లక్ష్మీకాంత్ రాజు పిలుపునిచ్చారు. "వడ్డెర్ల ఐక్యతే.. విజయానికి మార్గం.." అనే బలమైన నినాదంతో ఆయన రాష్ట్రవ్యాప్తంగా వర్గ చైతన్యాన్ని తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

**రాజకీయ భాగస్వామ్యమే లక్ష్యంగా:**

ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టసభల్లోనూ, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ తగిన ప్రాతినిధ్యం ఉంటేనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. మున్సిపల్ కార్పొరేషన్లు, పంచాయతీలు మరియు ఇతర ఎన్నికల్లో వడ్డెర, వడియరాజులు కేవలం ఓటర్లుగానే కాకుండా, నిర్ణాయక శక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు. రాబోయే ఎన్నికల్లో పోటీకి పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

**హక్కుల సాధన కోసం ఉద్యమ బాట:**

వడ్డెరల సంక్షేమం, హక్కుల పరిరక్షణే ధ్యేయంగా వడ్డెర హక్కుల ఉద్యమ నేతగా బర్లు లక్ష్మీకాంత్ రాజు నిరంతరం శ్రమిస్తున్నారు. "మీ సేవకుడు" అంటూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, కుల బాంధవుల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారు. కుల వృత్తిదారులను ఆదుకోవడంతో పాటు, చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు, రాజకీయ రంగంలో సముచిత స్థానం దక్కే వరకు విశ్రమించేది లేదని ఆయన తేల్చిచెప్పారు.

వడ్డెరలంతా పార్టీలకు అతీతంగా ఒకే తాటిపైకి వచ్చి, తమ సత్తా చాటాలని, ఐకమత్యంతోనే రాజ్యాధికార దిశగా అడుగులు వేయాలని ఈ సందర్భంగా ఆయన ఉద్ఘాటించారు.

# వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిని జాతీయ డిమాండ్‌గా ప్రకటించాలి




**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంచార్జ్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:**

**అమరావతి/న్యూఢిల్లీ:**

వడ్డెర కులాన్ని షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ఎస్టీ) జాబితాలో చేర్చాలనే డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఒక అధికారిక జాతీయ డిమాండ్‌గా తక్షణమే ప్రకటించాలని వడ్డెర సంఘం నాయకులు గట్టిగా డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల్లోనూ వడ్డెరల సంక్షేమం కోసం ఈ అంశాన్ని ప్రధాన సర్కార్లు అత్యంత ప్రాధాన్యతతో తీసుకోవాలని కోరారు.

దశాబ్దాలుగా అణగారిన వర్గంగా ఉంటున్న వడ్డెర సమాజం తమ హక్కుల సాధన కోసం చేస్తున్న పోరాటం ఇప్పుడు దేశవ్యాప్త రూపు సంతరించుకుందని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అలాగే రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై సానుకూలంగా స్పందించి, వడ్డెరలకు తగిన రాజ్యాంగ రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

**ప్రధాన డిమాండ్లు:**

వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చే అంశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ డిమాండ్‌గా ప్రకటించాలి.

వడ్డెరలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు కల్పించి, విద్య మరియు ఉపాధి రంగాల్లో సముచిత స్థానం ఇవ్వాలి.

దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న వడ్డెరల సమస్యలన్నింటినీ తక్షణమే పరిష్కరించాలి.

"మా హక్కు – మా గౌరవం – ఎస్టీ హక్కు మాదే" అనే నినాదంతో ఈ జాతీయ డిమాండ్ నెరవేరే వరకు పోరాటం ఉధృతం చేస్తామని నేతలు తేల్చిచెప్పారు. జై వడ్డెర! జై జై వడ్డెర!

# ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల నగారా: అక్టోబర్ చివరి నాటికి నిర్వహణకు సన్నాహాలు



**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంచార్జ్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:**

**అమరావతి:**

ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఉత్కంఠ నెలకొంది. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలను 2026 అక్టోబర్ చివరి నాటికి విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం గట్టి పట్టుదలతో ఉంది. ఈ మేరకు మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఏపీ ప్రభుత్వం ఇప్పటికే పూర్తిస్థాయిలో ఆమోదం తెలిపింది.

**ఎన్నికల ఏర్పాట్లు మరియు యంత్రాంగం వేగం:**

ఎన్నికల నిర్వహణకు అవసరమైన ప్రక్రియను అధికారులు అత్యంత వేగవంతం చేశారు.

క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితా రూపకల్పన పనులను ముమ్మరం చేశారు. వార్డుల విభజన ప్రక్రియను పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియను అధికారులు పరిశీలిస్తున్నారు.

ఎన్నికలకు సంబంధించి రిజర్వ్‌డ్ ప్రక్రియను కూడా వేగవంతంగా పూర్తి చేసే పనిలో యంత్రాగం నిమగ్నమైంది.

రాష్ట్ర ఎన్నికల సంఘం త్వరలోనే ఇందుకు సంబంధించిన పూర్తిస్థాయి ఎన్నికల షెడ్యూల్‌ను అధికారికంగా విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల ప్రకటన వెలువడుతుండటంతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ప్రధాన రాజకీయ పార్టీలన్నీ స్థానిక పోరుకు వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నాయి.

# సీఎం రేవంత్ రెడ్డి సిరిసిల్ల బహిరంగ సభకు వస్తున్న సందర్భంగా రాయికల్ పట్టణ బిజెపి నాయకులను ముందస్తు అరెస్టులు

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంచార్జ్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:**

సీఎం రేవంత్ రెడ్డి సిరిసిల్ల బహిరంగ సభకు వస్తున్న సందర్భంగా జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు కురుమల్లారెడ్డిని, నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం జరిగింది

ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడుతూ మమ్ములను అరెస్టు చేయడశీ ఏశీతవరకు సమంజసమని రేవంత్ రెడ్డి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాడని ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చమని అడగడం తప్ప ఎందుకు ఇలాంటి




# ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్య వైభవం: దేశవ్యాప్తంగా వెలసి ఉన్న పవిత్ర శైవ క్షేత్రాల సమగ్ర విశేషాలు

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంచార్జ్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:**

అమరావతి:హిందూ సనాతన ధర్మంలో అత్యంత పరమ పవిత్రమైనవిగా, ముక్తి ప్రదాతలుగా భావించే ద్వాదశ జ్యోతిర్లింగాలు భారత దేశం నలుమూలలా దివ్యక్షేత్రాలుగా వెలసిల్లాయి. సాక్షాత్తుపరమేశ్వరుడుస్వయంభూవుగాఆవిర్భవించిన ఈ పవిత్ర పుణ్యక్షేత్రాలను దర్శించుకోవడం వల్లసకల పాపాలు హరించుకుపోయి, మోక్షప్రాప్తి కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దేశ విదేశాల నుంచి నిత్యం లక్షలాది మంది భక్తులు ఈ పన్నెండు జ్యోతిర్లింగాలను దర్శించి తరిస్తుంటారు. సోమనాథుడి నుంచి ప్రారంభమై ఘృష్ణేశ్వరుడి వరకు వెలసి ఉన్న ఆ ద్వాదశ జ్యోతిర్లింగాల పూర్తి వివరాలు, క్షేత్రాల విశేషాలు మీకోసం ప్రత్యేకంగా...

ద్వాదశ జ్యోతిర్లింగాలు – ప్రాంతాలు మరియు విశేషాలు:

**సోమనాథ్ (సౌరాష్ట్ర, గుజరాత్):**

భారతదేశంలోనే అత్యంత ప్రాచీనమైనదిగా మరియు మొదటి జ్యోతిర్లింగ క్షేత్రంగా సోమనాథ ఆలయం సర్వవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. సముద్ర తీరాన అద్భుతమైన వాస్తుశిల్పంతో అలరారుతున్న ఈ క్షేత్రానికి అపారమైన చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది.

**మల్లికార్జున (శ్రీశైలం, ఆంధ్రప్రదేశ్):**

మన తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలో నల్లమల దట్టమైన అడవుల నడుమ, పవిత్ర కృష్ణానది తీరాన ఈ క్షేత్రం వెలసి ఉంది. ఇక్కడ అమ్మవారు భ్రమరాంబికా సమేతుడిగా శ్రీ మల్లికార్జున స్వామి భక్తుల కోర్కెలు తీరుస్తూ కొలువై ఉన్నారు.

**మహాకాళేశ్వర్ (ఉజ్జయిని, మధ్యప్రదేశ్):**

మధ్యప్రదేశ్‌లోని చారిత్రాత్మక నగరమైన ఉజ్జయినిలో క్షిప్రా నది తీరాన వెలసిన ఈ దివ్యక్షేత్రంలో మహాకాలుడు కొలువై ఉన్నాడు. ఇక్కడ తెల్లవారుజామున నిర్వహించే 'భస్మ హారతి' ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రత్యేకతను సంతరించుకుంది.




**ఓంకారేశ్వర్ (మధ్యప్రదేశ్):**

పవిత్ర నర్మదా నది మధ్యలో ఉన్న ఒక ప్రత్యేకమైన ద్వీపంపై ప్రకృతి రమణీయత నడుమ ఈ క్షేత్రం వెలసింది. ఇక్కడి భూభాగం సహజంగానే 'ఓం'కార ఆకారంలో ఉండటం ఈ క్షేత్రం యొక్క అత్యంత అద్భుతమైన ప్రత్యేకత.

**కేదార్‌నాథ్ (ఉత్తరాఖండ్):**

హిమాలయ పర్వత శ్రేణులలో, మంచు కొండల నడుమ, అత్యంత ఎత్తైన క్షేత్రంగా కేదార్‌నాథ్ విరాజిల్లుతోంది. అత్యంత ప్రతికూల వాతావరణ పరిస్థితుల మధ్య ఉండే ఈ ఆలయం సంవత్సరంలో కేవలం కొన్ని నెలలు మాత్రమే భక్తుల దర్శనార్థం తెరువబడుతుంది.

**భీమశంకర్ (మహారాష్ట్ర):**

మహారాష్ట్రలోని సహ్యాద్రి పర్వత శ్రేణుల అడవులలో, పవిత్ర భీమా నది ఉద్భవించే ప్రాంతంలో ఈ జ్యోతిర్లింగం వెలసి ఉంది. చుట్టూ పచ్చని అడవులు, ప్రకృతి అందాల నడుమ ఈ క్షేత్రం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటుంది.

**కాశీ విశ్వనాథ్ (వారణాసి, ఉత్తర ప్రదేశ్):**

త్రిశూలంపై నిలబడి ఉంటుందని ఆధ్యాత్మిక గ్రంథాలు వర్ణించే అత్యంత పవిత్ర వారణాసి (కాశీ) నగరంలో గంగానది తీరాన ఈ క్షేత్రం వెలసింది. మోక్షపురిగా పిలువబడే కాశీలో విశ్వనాథుని దర్శనం సర్వపాప హరమని భక్తుల నమ్మకం.

**త్రయంబకేశ్వర్ (నాసిక్, మహారాష్ట్ర):**

మహారాష్ట్రలోని నాసిక్ సమీపంలో, పవిత్ర గోదావరి నది ఉద్భవించే ప్రాంతం దగ్గర ఈ జ్యోతిర్లింగం ఉంది. ఇక్కడి లింగం బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల త్రిమూర్తుల స్వరూపంగా మూడు ముఖాలతో ప్రత్యేకంగా దర్శనమిస్తుంది.

**వైద్యనాథ్ (దేవఘర్ / పర్లి):**

భక్తుల సమస్త రోగాలను, భవరోగాలను నివారించే దివ్య వైద్యుడిగా శివుడు కొలువైన మహిమాన్విత క్షేత్రం వైద్యనాథ జ్యోతిర్లింగం. దేశవ్యాప్తంగా ఈ క్షేత్రానికి భక్తుల తాకిడి ఎప్పుడూ అధికంగా ఉంటుంది.

**నాగేశ్వర్ (ద్వారక, గుజరాత్):**

గుజరాత్‌లోని పవిత్ర ద్వారకా క్షేత్ర ప్రాంతంలో, సముద్ర తీరానికి సమీపంలో కొలువై ఉన్న శక్తివంతమైన జ్యోతిర్లింగం ఇది. భక్తులపాలిట కొంగు బంగారమై నాగేశ్వరుడు రక్షణగా నిలుస్తాడని నమ్ముతారు.

**రామేశ్వరం (తమిళనాడు):**

దక్షిణ భారతదేశంలో సముద్ర తీరాన వెలసిన అత్యంత ప్రముఖ పుణ్యక్షేత్రం రామేశ్వరం. సాక్షాత్తు శ్రీరామచంద్రమూర్తి తన హస్తాలతో స్వయంగా ప్రతిష్ఠించారని పురాణాల్లో చెప్పబడిన పవిత్ర జ్యోతిర్లింగ క్షేత్రం ఇది.

**ఘృష్ణేశ్వర్ (ఔరంగాబాద్, మహారాష్ట్ర):**

ద్వాదశ జ్యోతిర్లింగాలలో చివరిదైన ఈ దివ్య క్షేత్రం మహారాష్ట్రలోని చారిత్రాత్మక ఎల్లోరా గుహల సమీపంలో భక్తులకు దర్శనమిస్తోంది. శైవ క్షేత్రాలలో దీనికి విశేషమైన ప్రాముఖ్యత ఉంది.

ఈ పన్నెండు జ్యోతిర్లింగాల క్షేత్రాలను జీవితంలో ఒక్కసారైనా దర్శించుకోవడం ద్వారా మానవ జన్మ సార్థకమవుతుందని, భక్తుల కోరికలు నెరవేరుతాయని పండితులు పేర్కొంటున్నారు.

# జగన్ ఢిల్లీ పర్యటన: రాజకీయ వర్గాలలో తీవ్ర చర్చ మరియు విశ్లేషణ

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంచార్జ్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:**

అమరావతి/న్యూఢిల్లీ:

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ పర్యటనకు సంబంధించి రాజకీయ వర్గాలలో ప్రస్తుతం తీవ్రమైన చర్చ జరుగుతోంది. ఆయన గత రాజకీయ సరళిని, ప్రస్తుత పరిణామాలను బేరీజు వేస్తూ విశ్లేషకులు రకరకాల అంచనాలు వేస్తున్నారు. పర్యటనల నేపథ్యం **మరియు పరిమితులు:**

ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్న సమయంలో కూడా వైఎస్ జగన్ ఢిల్లీ పర్యటనలు చాలా పరిమితంగానే ఉండేవి.

రాష్ట్రపాలనావ్యవహారాలు,అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టడంతో పాటు ప్రత్యేకంగా అవసరమైనప్పుడే ఆయన జాతీయ రాజధానికి వెళ్లేవారు. అయితే, 2024 శాసనసభ ఎన్నికలలో వైసీపీ ఓటమి చవిచూసిన తర్వాత



ఆయన రాజకీయ వ్యూహాల్లోనూ, పర్యటనల్లోనూ స్పష్టమైన మార్పు వచ్చింది. ఓటమి అనంతరం ఢిల్లీకి వెళ్లి, ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ శ్రేణులు మరియునాయకులపైఅక్రమకేసులుబనాయిస్తున్నారంటూఅప్పట్లోఆయననేరుగాధర్నా నిర్వహించడం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించింది.

**వచ్చిన ఊహాగానాలు - వాస్తవాలు:**

ఇటీవలి కాలంలో వైఎస్ జగన్ ఢిల్లీ పర్యటనకు సంబంధించి జాతీయ స్థాయిలో పలు రకాల ఊహాగానాలు చక్కర్లు కొట్టాయి. దేశ ప్రధాని నరేంద్ర మోడీని, కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ఆయన అపాయింట్‌మెంట్లు కోరారని, అలాగే పార్లమెంటులో రాబోయే డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు తెలిపే విషయమై చర్చలు జరుపుతున్నారంటూ ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలన్నీ కేవలం ఊహాగానాలేనని, వాటిలో ఎలాంటి వాస్తవం లేదని రాజకీయ పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు.

జాతీయ రాజకీయ పరిణామాలు:

ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం పనితీరు మరియు దాని విధానాలపై జాతీయ స్థాయిలో ప్రతిపక్ష పార్టీలు తీవ్రమైన ఆందోళనలను వ్యక్తం చేస్తున్నాయి.

ఈ నేపథ్యంలో మారుతున్న జాతీయ రాజకీయ సమీకరణాలు, ప్రాంతీయ పార్టీల పాత్ర మరియు భవిష్యత్తు కార్యాచరణపై రాజకీయ వర్గాల్లో లోతైన చర్చ సాగుతోంది.

# హైదరాబాద్ ప్రజాబవాన్ ల్లో'సీఎం ప్రవాసీ ప్రజావాణి సందర్శించిన గల్ఫ్ సోషల్ వర్కర్స్‌ను సత్కరించినా ప్రజావాని ఇంచార్జ్ విజయలక్ష్మి

**జగిత్యాల జిల్లా ఆ ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:**

గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారంలో సామాజిక సేవకులు, ప్రవాస సంఘాల పాత్ర కీలకం హైదరాబాద్‌ప్రజాభవన్‌లోని 'సీఎం ప్రవాసీ ప్రజావాణి' వేదికపై గల్ఫ్ సామాజిక సేవకులు పొన్నం సత్యనారాయణ (దుబాయి) మరియు సౌదీ అరేబియా తెలుగు అసోసియేషన్ (సాటా) రియాద్ ప్రతినిధి ఖాజా ముజాములుద్దీన్ను మంగళవారం సత్కరించారు.

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్‌పర్సన్, 'సీఎం ప్రజావాణి' ఇన్‌చార్జి గద్వాల్ విజయలక్ష్మి, స్టేట్ నోడల్ ఆఫీసర్ కె. విద్యాసాగర్ ఇద్దరు సామాజిక సేవకులను అభినందించారు.ఈ సందర్భంగా గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారంలో సామాజిక సేవకులు, ప్రవాస సంఘాల పాత్ర ఎంతో కీలకమని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా ఎంబసీలు,కాన్సులేట్లతోసమన్వయం చేసుకుంటూ




గల్ఫ్ కార్మికులకు అత్యవసర సమయాల్లో అందిస్తున్న సేవలను వారు అభినందించారు.

గల్ఫ్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్మికులకు అత్యవసర పరిస్థితుల్లో అండగా నిలుస్తూ, వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో సామాజిక సేవకులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, సీఎం ప్రవాసీ ప్రజావాణి లైజన్ ఆఫీసర్ భార్గవి నద్దునూరి, వాలంటీర్లు గంగుల మురళీధర్ రెడ్డి, మహమ్మద్ బషీర్ అహ్మద్, అలాగే మహేష్ కె పి సాటా తెలంగాణ రిప్రజెంటేటివ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గల్ఫ్ సామాజిక సేవకులకు లభించిన ఈ ప్రత్యేక గుర్తింపుపై సాటా ఫౌండర్ మల్లేశం, సాటా రియాద్ అధ్యక్షులు శ్రీనివాస్ మచ్చ, మరియు రియాద్ ఉమెన్స్ అధ్యక్షులు శర్వాణి విద్యాధరణి మరియు సాట కోర్ టీమ్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ, వారిని ప్రత్యేకంగా అభినందించారు.గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం సామాజిక సేవకులు చేస్తున్న సేవలకు లభిస్తున్న గుర్తింపు మరింత మంది సేవకులకు స్ఫూర్తినిస్తుందని సాటా నాయకత్వం పేర్కొంది.

# నాలుగు వేల నూట డెబ్బై ఒకటి పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలకు బ్రేక్: రేపు ఎన్నికల నిర్వహణ

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంచార్జ్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:**

**అమరావతి:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా సుమారు ముప్పై తొమ్మిది వేల ఎనిమిది వందల ఎనభై ఎనిమిది పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)ఎన్నికలువిజయవంతంగా ముగిశాయి. అయితే, పలు ప్రాంతాలలో చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల విషయంలో వివిధ పార్టీల మధ్య రాజకీయ వివాదాలు చెలరేగడంతో నాలుగు వేల నూట డెబ్బై ఒకటి పాఠశాలల్లో ఈ ఎన్నికలు తాత్కాలికంగా వాయిదా పడ్డాయి.

ఎన్నికల్లో రాజకీయ జోక్యమే కారణం:



ప్రశాంత వాతావరణంలో, పూర్తిగా సామరస్యంగా జరగాల్సిన ఈ పాఠశాలల ఎన్నికల్లో రాజకీయ జోక్యం తగదని పలువురు విద్యావేత్తలు మరియు స్థానికులు తీవ్రంగా అభిప్రాయపడుతున్నారు. విద్యాలయాలను రాజకీయాలకు అతీతంగా ఉంచాలని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకునికమిటీలనుఎన్నుకోవాలని కోరుతున్నారు.

**వాయిదా పడిన చోట రేపు ఎన్నికలు:**

రాజకీయ వివాదాల కారణంగా వాయిదా పడిన పాఠశాలల్లో అక్టోబర్ 1వ తేదీన (రేపు) ఎన్నికలు నిర్వహించనున్నట్లు సంబంధిత అధికారులు అధికారికంగా తెలిపారు. ఎలాంటి ఉద్రిక్తతలు చోటుచేసుకోకుండా పటిష్ఠ పోలీసు భద్రత మధ్య ఈ ఎన్నికలు పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

# లోయలోకి దూసుకెళ్లిన కారు.. నాలుగురు యువకులకు తీవ్ర గాయాలు





ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంచార్జ్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:

**చింతూరు:**

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం పోల్లూరు జలపాతం సమీపంలో ఒక ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. విజయవాడకు చెందిన నలుగురు యువకులు ప్రయాణిస్తున్న కారు ప్రమాదవశాత్తు అదుపుతప్పి సుమారు నూట యాభై అడుగుల లోతులో ఉన్న లోయలోకి దూసుకెళ్లింది. ఈ దుర్ఘటనలో నలుగురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి.

**ప్రమాద వివరాలు:**

పుష్ బ్రిడ్జికి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో ఈ కారు అదుపుతప్పి లోయలో పడిపోయినట్లు సమాచారం.

సమాచారం అందుకున్న మోతుగూడెం ఉప నిరీక్షకులు (ఎస్ఐ) అబ్దుల్ నాసిర్ హుస్సేన్ మరియు స్థానిక పోలీసులు వెటనే స్పందించారు.

పోలీసుల తాఖు మరియు స్థానికుల సహాయంతో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను సురక్షితంగా బయటకు తీసి మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు.

ఈ ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జలపాతాలు మరియు మలుపుల ప్రాంతాల్లో ప్రయాణించేటప్పుడు వాహనదారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మళ్లీ దగ్గరవుతున్న భారత్–చైనా: గగనతల మార్గాలపై దౌత్య చర్చలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంచార్జ్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:

**న్యూఢిల్లీ:**

భారత్ మరియు చైనా దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం పాకిస్తాన్ తన గగనతలాన్ని భారత విమానయాన సంస్థలకు మూసివేయడంతో రవాణా రంగంలో పెద్ద సవాలు ఎదురైంది. దీనివల్ల ఐరోపా, ఉత్తర అమెరికా వైపు వెళ్లే భారత విమానాలు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాల్సి వస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు.

**ప్రయాణ ఖర్చులు మరియు ఆర్థిక భారం:**

సుదూర ప్రాంతాలకు వెళ్లే విమానాలు ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించడం వల్ల ప్రయాణ సమయం గణనీయంగా పెరిగిపోతుంది. దీనితో పాటు నిర్వహణ ఖర్చులు అధికమై, విమానయాన సంస్థలపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతున్నట్లు స్పష్టమవుతోంది.

**చైనాతో చర్చలు - ప్రత్యామ్నాయ గగనతలం:**



ఈ క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొనే నేపథ్యంలో, భారత్ చైనాలోని హోటాన్ మీదుగా విమానాలు నడిపేందుకు అనుమతి కోరుతోంది.

అలాగే జిన్‌జియాంగ్ గగనతలాన్ని సురక్షితమైన ప్రత్యామ్నాయ మార్గంగా ఉపయోగించుకునే విషయమై చైనా అధికారులతో సానుకూల చర్చలు జరుపుతోంది.

బ్రిక్స్ సదస్సు సందర్భం మరియు ఇతర దౌత్యపరమైన వేదికల ద్వారా ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగవుతున్న సూచనలు కనిపిస్తున్నాయి.

# మహిళల వేధింపులపై ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ కీలక ప్రకటన: స్టాకింగ్ మరియు సైబర్ వేధింపులపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంచార్జ్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:

**తిరుపతి:**

మహిళలు మరియు యువతను లక్ష్యంగా చేసుకుని పెరుగుతున్న సైబర్ వేధింపులు, స్టాకింగ్ వంటి అక్రమ చర్యలపై ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ స్పష్టమైన ప్రకటన చేశారు. తిరుపతిలో నిర్వహించిన స్టాకింగ్ నివారణ అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని దిశానిర్దేశం చేశారు.

**వేధింపుల పరిధిపై స్పష్టత:**

ఒక ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేసినప్పటికీ, నిందితులు వేరే నంబర్ల నుంచి పదే పదే ఫోన్ కాల్స్ చేయడం, మెసేజ్‌లు పంపడం కూడా చట్టపరంగా వేధింపుల కిందకే వస్తుందని డాక్టర్ రాయపాటి శైలజ స్పష్టం చేశారు.

మహిళలు సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నప్పుడు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ వేధింపులకు గురైతే ఎలాంటి భయానికి లోనుకాకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆమె గట్టిగా సూచించారు.

**అత్యవసర సహాయ కేంద్రాలు:**

ఆపదలో ఉన్న మహిళలు తక్షణ సాయం పొందేందుకు వీలుగా ఏర్పాటు చేసిన మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 181ని సంప్రదించాలని తెలిపారు.

అత్యవసర పరిస్థితుల్లో తక్షణ రక్షణ కోసం పోలీసు శాఖను ఆశ్రయించి ప్రాణాలను, గౌరవాన్ని కాపాడుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.

# రాయికల్ నుండి సిరిసిల్ల సీఎం రేవంత్ రెడ్డి సభకు సంజయ్ సేన పల్లికొండ గంగాధర్ ఆధ్వర్యంలో100 మంది యువకులు

రాయికల్ ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:

సిరిసిల్లలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభకు జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ ఎనిమిదో వార్డు కౌన్సిలర్ పల్లికొండ గంగాధర్ ఆధ్వర్యంలో 100 మంది యువకులం సభకు తరలి వెళ్తున్నామని పల్లికొండ గంగాధర్ తెలిపారు పట్టణ యువకులు రేవంత్ రెడ్డి చేసిన మంచి పనులకు ఆకర్షితులై సభకు వెళ్లాలని నిర్ణయించుకున్నారని ఆయన అన్నారు

అలాగే ఐదు, ఆరు,ఏడు వార్డుల మునిసిపల్ మాజీ కోఆప్షన్ నెంబర్ డాక్టర్ పిప్పోజీ మహేందర్ బాబు ఆధ్వర్యంలో కొన్ని బస్సులలో యువకులను తీసుకెళ్తున్నానని ఆయన అన్నారు




# మొలగవల్లి, ఎం కొట్టాల రీసర్వే పనులను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ నూరల్ క్వామర్

( కర్నూలు జిల్లా ఇన్చార్జ్ ) ఆలూరు ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:

ఆలూరు మండలం పరిధిలోని మొలగవల్లి, మొలగవల్లి కొట్టాల లో జరుగుతున్న భూమి రీ సర్వే పై జాయింట్ కలెక్టర్ నూరల్ క్వామర్, ఆర్డీఓ చిన్న ఓబులేసు, పొలాలను పరిశీలించారు. రీ సర్వే లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, ముఖ్యంగా మొలగవల్లి కొట్టాల రైతులగా భూములకు ఫ్రీహోల్డ్, 22ఏ ఇతర సమస్యలు, సీలింగ్ ల్యాండ్ భూములను రీ సర్వే చేయాలని, అసైన్డ్ తదితర సమస్యలను పక్కనపెట్టి తక్షణమే రిసర్వ్ చేసి రైతులకు పట్టా పాస్ పుస్తకాలు పంపిణీ చేయాలని, త్వరగా రీ సర్వే పనులు పూర్తి చేయాలని సర్వేయర్లకు ఆదేశించారు. అలాగే జాయింట్ కలెక్టర్ నూరల్ క్వామార్ , ఆర్డీఓ చిన్న ఓబులేసు లను మాజీ ఎంపిటిసి బంగారు సునంద పటేల్ యాదవ్, పూల రామాంజనేయులు , ఇతర రైతు లు శాలువ పూలమాలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో తహాసీల్దార్



శోభ సువర్ణమ్మ, ఆర్ ఐ బసవన్నగౌడ్, మండల సర్వేయర్ అరుణజ్యోతి, రీ సర్వే సర్వేయర్ నవీన్ మరియు రెవెన్యూ

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంబేద్కర్ రాజ్యాంగాన్ని ఆదర్శంగా తీసుకోవాలి కానీ హిట్లర్ నైజాములను ఆదర్శంగా తీసుకుంటుండు-- మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఆరోపణ

జగిత్యాల ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:

జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల కేంద్రంలో పత్రికా విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి

**జీవన్ రెడ్డి మాట్లాడుతూ...**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా జగిత్యాల జిల్లాలో ముందస్తు అరెస్టులు చేయడం బీ ఆర్ ఎస్ కార్యకర్తలకు ఆశ్చర్యం కలిగిస్తుంది అందరూ రైతులు వారిని నిర్బంధిస్తే పొలానికి కరెంటు ఎవరు పెడతారు రేవంత్ రెడ్డి మంచి పనులు చేస్తే ఇలా ముందస్తు అరెస్టు చేయాల్సిన అవసరం లేదు

ఎలినినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర కరువు ఏర్పడే పరిస్థితి ఉంది

ఖరీఫ్ ఉన్న పంటలను కాపాడేందుకు ఎస్సారెస్పీ నుండి నీళ్లు ఇవ్వడం లేదు కనీసం విద్యుత్ అయినా ఇచ్చి పూర్తిస్థాయిలో పంటలు కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉంటదా ఉండదా –?

కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కోవిడు సమయంలో కూడా కేసీఆర్ 24 గంటలవిద్యుత్ ఇచ్చి పంటలను కాపాడడం జరిగింది

కాల్వ నీరు ఇవ్వలేకపోతున్నారు ఎస్సారెస్పీ 46 టీఎంసీలు ఉన్నది దానికి ఇంకొక 20 టిఎంసి అదనంగా జోడించినట్టయితే రబి పంటకు నీరు ఇచ్చే అవకాశం ఉంటుంది

ప్రాణహిత నది మేడిగడ్డ వద్ద లక్ష క్యూసెక్కుల నీరు పోతుంది

కన్నెపల్లి పంప్ హౌస్ నుండి 93.5 లెవెల్ లో మేడిగడ్డతో సంబంధం లేకుండా ఎగువకు నీరును అన్నారంకు అక్కడి నుండి పశీదిళ్లకు పశీదిళ్ల నుండి ఎల్లంపల్లికి ఎత్తిపోయవచ్చు

ఎల్లంపెల్లికి ఇన్ ఫ్లో తగ్గింది కాబట్టి నంది మేడారం పంపోవుకి లిఫ్ట్ ఆపినారు కింద ప్రాణహిత నీరు వృధాగా పోతున్నది

ఇప్పటికీ అయిన మనం ఎస్సారెస్పీని నిండుకుండలా చేసుకోవచ్చు 90 టిఎంసి నింపుకునే అవకాశం ఉన్నది

మల్లన్న సాగర్ కానీ రంగనాయక సాగర్ గాని కొండపోచమ్మ సాగర్ ఈ జలాశయాలు అన్ని కేసీఆర్ ముందు చూపుగా నిర్మాణం చేయడం జరిగింది

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణమే ఇటువంటి కరువును ఎదుర్కోవడానికి కేసీఆర్ ముందు చూపుగా కాళేశ్వరం నిర్మాణం చేశారు

కేంద్ర జల విద్యుత్ పరిశోధన నివేదిక ఇచ్చారు వారి నివేదిక ప్రకారం అన్నారం సుందిళ్ల వాటికి ఏ విధమైన ఇబ్బందులు లేవు ఆ రెండింటిని వినియోగించుకోవచ్చు అని నివేదిక ఇచ్చారు

మేడిగడ్డ 8 బ్లాక్ లలో ఒక బ్లాక్ దెబ్బ తిన్నది అందులో పియర్స్ మాత్రమే దెబ్బతిన్నాయి దానిని మరమ్మతులు చేసుకుంటే సరిపోతుందని అన్నరు

ఏ అవసరం లేనిది అన్నారం,పంది దిళ్లకు నిన్న ఉత్తంకుమార్ రెడ్డి ఢిల్లీకి పోయి మేము డిఫెన్స్ వల్ల సహకారం తీసుకుంటాం అనడం ఆశ్చర్యం కలుగుతుంది



తెలంగాణ ఇంజనీర్లు కనీసం అన్నారం సుందిళ్లను పరిశీలించి వినియోగంలోకి తేలేరా!!

ఇదంతా ఒక కుట్ర ఇది ఎత్తిపోయాలంటే విద్యుత్ కావాలి ఇది ఎత్తిపోస్తే కేసీఆర్ కు ఎక్కడ పేరు వస్తుందో రేవంత్ రెడ్డి ఆలోచన అంతా ఏ విధంగా కేసీఆర్ ని దోషిగా చూపించే ప్రయత్నం తప్ప ఏం చేయడం లేదు

ఉత్తర తెలంగాణ అన్ని అవకాశాలు ఉండి కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం సాగునీటి సౌకర్యం పొందే అవకాశం ఉంది విద్యుత్ థర్మల్ పవర్ ఎంత అంటే అంత జనరేట్ చేసుకొని విద్యుత్ కొరత లేకుండా అంతరాయం లేకుండా పంటలకు సరిపడే విద్యుత్ పొందే అవకాశం ఉంది

రేవంత్ రెడ్డి అసమర్థ పాలన ఆయన పాలన వైఫల్యం వల్ల రైతాంగం ఇక్కట్లు కొట్టొచ్చినట్లు కనబడుతున్నాయి

ప్రజాస్వామ్యంలో కనీసం ప్రశ్నించే హక్కు కూడా లేదా

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందే ప్రజాస్వామ్య హక్కులు నిలబెట్టుకునే కొరకు ఏర్పాటు చేసుకున్నాం అటువంటి తెలంగాణ రాష్ట్రంలో ఈ నిర్బంధమేంటి మళ్లీ నైజాం ప్రభుత్వ కాలానికి పోతున్నట్టు కనిపిస్తుంది

రేవంత్ రెడ్డి అసెంబ్లీలోనే అంటుండు నైజాం ప్రభుత్వం మెరుగ్గా ఉండే అని రేవంత్ రెడ్డి మదిలో నెత్తిలో హిట్లర్ నైజాం కూర్చున్నారు

ఆయనకు పాలన అంటే హిట్లర్ నైజాం గుర్తుకువస్తారు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంబేద్కర్ రాజ్యాంగాన్ని ఆదర్శంగా తీసుకోవాలి కానీ హిట్లర్ నైజాములను ఆదర్శంగా తీసుకుంటుండు

ఈ నిర్బంధణాలు ఏంటి అందరూ రైతు బిడ్డలు మీరు ఉన్న కరెంటును ఎలా వినియోగించుకోవాలని ఆలోచన చేసే రైతును నిర్బంధంగా పోలీస్ స్టేషన్లో పెడితే వ్యవసాయం ఏం కావాలి

వరి పంటలు పొట్టకు వచ్చినాయి ఎరువులు లేవు ఆఫ్ ధ్రువీకించబడదు

రాష్ట్రంలో సాగునీరు లేదు ఎరువులు లేవు కరెంటు లేదు

ఈరోజు సిరిసిల్లకు వచ్చి ఏం గొప్పలు చెప్పుకుందాం అనుకుంటున్నావు

పక్కనున్న మహారాష్ట్ర ప్రభుత్వం రైతులకు తక్షణ సహాయం కింద 5000 కోట్లు ఆర్థిక సహాయం ప్రకటించింది

ఇక్కడ నీకు సోయిలేదు ఈరోజు సిరిసిల్లకు వస్తున్నావు కరువు మండలాల గురించి రాష్ట్రంలో



రైతాంగం దొరుకుతున్న దుర్భిక్ష పరిస్థితులు సాగునీరు అందింప చేయలేకపోవడము కరెంటు ఇయ్యలేకపోవడం ఎరువులు అందింపజేయలేకపోవడం దానిపై స్పందించు ముఖ్యమంత్రి కి ఈర్షద్వేషాలు ఉండకూడదు

రాజ్యాంగ ప్రమాణం చేసేటప్పుడే చెప్తావ్ రాగద్వేషాలకు అతీతంగా రాజ్యాంగ బద్ధంగా పాలన చేస్తాను అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కడుపునిండా ఈర్ష ద్వేషాలే

అక్రమ నిర్బంధనలతోటి తెలిసి వస్తుంది ముఖ్యమంత్రి ఆలోచన ఏ విధంగా కనబడుతుందని

ఉదయం పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడుతుంటే మాకు ఉండే ఆదేశాలు మాకు ఉన్నాయి సార్ అని అంటున్నారు

అక్రమ నిర్బంధనలను అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం

రబిని కాపాడాలంటే ఎస్సారెస్పీకి నీళ్లు ఎత్తిపోయాలి

రేవంత్ రెడ్డి రక్షణశాఖ సహాయం తీసుకున్నాడు అంటే ఆయన అసమర్థత కనిపిస్తుంది

కెసిఆర్ గారు ఎర్రవెల్లిలో ఏదో ఆక్రమించుకున్నాడు అని రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మొరిగినాడు కానీ 325 సర్వేలో ఏమీ తేలలేదు ఏం చేయాలో ఇప్పుడు రేవంత్ రెడ్డికి తోచడం లేదు

కెసిఆర్ గారు ఎన్నికల అఫిడవిట్లో ఎంత పేర్కొన్నారో అంతే కలిగి ఉన్నారు

సర్వే నెంబర్ 325 లో ఎవరు సాగులో ఉన్నారో వారికే నోటీసులు ఇచ్చారు

అక్కడ సాగులో ఉన్న వారంతా దళితులు అందరూ ఏ విదంగా సాగులో ఉన్నారో ఆధారాలు సమర్పిస్తున్నారు

అక్కడ ఏం లేదు ఆ కోపం తోని తెలంగాణ రైతుల కడుపులు కలిస్తే ఎలా

కేసీఆర్ మీద కోపంతో రేవంత్ రెడ్డి రైతాంగం కడుపు కాలుస్తున్నాడు

మహారాష్ట్ర ప్రభుత్వం ఏం చేసిందో తెలుసుకో లేకపోతే గూగుల్లో సెర్చ్ చెయ్

ప్రాణహిత నది జిల్లాల్లో లక్ష క్యూసెక్కుల నీరు క్రిందకు వృధాగా పోతుంది అది పోలవరం కు పోతుంది మన రేవంత్ రెడ్డి గారు చంద్రబాబు నాయుడుకు గురుదక్షిణ కింద సమర్పించుకుంటున్నాడు

బీ ఆర్ ఎస్ కార్యకర్తలు అంతా రైతులు వారిని నిర్బంధిస్తే పంటలకు కరెంటు ఎవరు పెడతారు ఈ అక్రమ నిర్బంధాలను తీవ్రంగా ఖండిస్తున్నాం అరెస్టు చేసిన వారిని విడుదల చేయండి

# జగిత్యాల టిఆర్ నగర్ లో ఓర్సు దినోత్సవం ముస్లిం మైనార్టీల కార్యక్రమంలో పాల్గొన్న జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

జగిత్యాల జిల్లా ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:

జగిత్యాలపట్టణంలోముస్లింమైనార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఓర్సు దినోత్సవం కార్యక్రమంలో జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ పాల్గొన్నారుఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, నిర్వాహకులుమరియుముస్లింమైనార్టీ సోదరులకు ఓర్సు దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గంలోఅన్నివర్గాలప్రజల సోదరభావంతో, ఐకమత్యంతో పండుగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు.

టి ఆర్ నగరాల్లో నిరుపేదలకు GO 59 కింద 116 మందికి పట్టాలు ఇవ్వడం జరిగింది అన్నారు.దాదాపు 200మందికి డబల్ బెడ్ రూమ్ ఇండ్ల మంజూరు చేయటం జరిగింది టి ఆర్



నగర్ అభివృద్ధి కి కట్టుబడి ఉన్నాను కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి ప్రభుత్వం నిరంతరం పేద మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి అభివృద్ధి కి కృషి చేస్తా అని అన్నారు.శాంతి, సౌభ్రాతృత్వం, పరస్పర గౌరవంతోజగిత్యాలమరింతఅభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు గజంగి నందయ్య మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ మాజీ




మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం మాజీ వైస్ చైర్మన్ మన్సూర్ కౌన్సిలర్ లు చాంద్ పాషా, లావణ్య రాజేందర్ ,పద్మ రాజేందర్, స్వప్న గిరిధర్, పవిత్ర మహేష్ ,మమత రామకృష్ణ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉప అధ్యక్షులు జెల్ల రవీందర్ ,ప్రోగ్రామ్ ఆర్గనైజర్ సద్దాం హుస్సేన్, కోటగిరి మోహన్,మెన్నెనీ ప్రవీణ్ రావు,ముస్లిం మైనార్టీనాయకులు,మతపెద్దలు,ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# గోవుల సంరక్షణ తో చెడు వ్యసనాలు దూరం!! గో విజ్ఞాన రాయికల్ జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో పరీక్షలు

రాయికల్ ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:

యువత లో చెడు వ్యసనాలు దూరం చేసేందుకు గోవుల సంరక్షణ అత్యంత ఉపయుక్తంగా ఉంటుందని గో సేవా ఖండ ప్రముఖ్ శ్రీ గద్దె సుమన్ అన్నారు జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం గో విజ్ఞాన పరీక్షలు నిర్వహించారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవు యొక్క పాలు, పెరుగు,నెయ్యి, మూత్రం,పేడ ల సమ్మేళనం పంచగవ్యంగాప్రసిద్ధిచెందిందనితెలిపారు.ఈపరీక్ష




ల నిర్వహణ లో ప్రధానోపాధ్యాయులు కాపు శ్రీనివాస్ ఉపాధ్యాయులు చెరుకు మహేశ్వర




శర్మ,ఎం.పద్మ,జి.తరంగిణి,యం.రమ తదితరులు పాల్గొన్నారు

ట్రై నెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

గురువారం, అక్టోబర్,01, 2026

www.trinetnews.com

# గొట్టిపర్తిలో పోషణ మాస వారోత్సవాలు.



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:తుంగతుర్తి

మండల పరిధిలోని గొట్టిపర్తి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాస వారోత్సవాలను నిర్వహించారు. అంగన్వాడీ సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిలుకల మంజుల వెంకన్న, అంగన్వాడి సూపర్వైజర్ ప్రమీల పాల్గొని చిన్నారులకు ముందుగా అక్షరభ్యాసం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోజువారీ ఆహారంలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పెరటి తోటలను ఏర్పాటు చేసుకుని ఇంటి వద్దే కూరగాయలు పండించుకోవడం వల్ల ఆరోగ్యంతో పాటు ఖర్చును కూడా తగ్గించుకోవచ్చని తెలిపారు. కూరగాయల్లో లభించే సూక్ష్మ పోషకాలు, విటమిన్లు, ఖనిజాలు శరీరానికి ఎంతో అవసరమని వివరించారు.గర్భిణీలు, పాలిచ్చే తల్లులు సాధారణం కంటే పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తగిన మోతాదులో తీసుకోవాలని, తద్వారా తల్లితో పాటు శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అవసరమైన పోషకాలు అందుతాయని తెలిపారు.

కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు రజిత, లీల , బేగం, శాంతి, ఏఎన్ఎం స్వాతి, ఆశ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణీ స్త్రీలు, చిన్నారులు, తదితరుపాల్గొన్నారు.

# కుబీర్ మండలం సిర్పల్లి తండా 3 గ్రామంలో గ్రామసభ - పర్యటించిన ఎంపీవో

కుబీర్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:

కుబీర్ మండలం ఫకీర్ నాయక్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని సిర్పల్లి తండా 3 గ్రామంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. కుబీర్ మండల ఎంపీవో గ్రామంలో పర్యటించి గ్రామసభలో పాల్గొన్నారు. ఈ గ్రామసభకు సర్పంచ్ క్రాంతి రాజ్ చౌహాన్ అధ్యక్షత వహించారు. వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీశారు. గ్రామంలోని ప్రధాన సమస్యలైన రోడ్లు, తాగునీరు, వీధి దీపాలు, ఉపాధి హామీ పనులపై గ్రామస్తులతో చర్చించారు. ప్రజల నుండి వచ్చిన వినతులను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామస్తులు తమ సమస్యలను ఎంపీవో దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా తండాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ



పథకాలను అర్హులందరికీ అందించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ క్రాంతి రాజ్ చౌహాన్ తో పాటు వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నేషనల్ కరాటేలో సత్తా చాటిన శ్రీ నలంద విద్యార్థులు



మహబూబాబాద్ జిల్లా ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:

ఈనెల 27న ముంబైలోని ప్రియదర్శిని స్టేడియంలో జరిగిన కరాటే టోర్నమెంట్ లో తొర్రూరు పట్టణ కేంద్రంలోని బీరప్ప నగర్ లో గల శ్రీ నలంద పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ పాలడుగుల రవీందర్ అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో సాధన చేస్తూ.. ఆత్మ రక్షణ కోసం కరాటే ఎంతో అవసరమని అన్నారు. భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించి పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. ప్రతిభ కనబరిచిన వారిలో కె.శివ స్వాత్విక్, మామిళ్ళపల్లి ప్రజ్వల్ విరాట్, రిషితేజ్, విష్ణు తేజ్, గౌతమనంద ఉన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం చేతన్, ఏజీఎం పద్మాకర్, జెడ్ఎసీ శివ, ప్రైమరీ కోఆర్డినేటర్ రజిని, ప్రీ ప్రైమరీ కోఆర్డినేటర్ సుధారాణి, అకాడమిక్ డీన్ వీరన్న, ప్రైమరీ, ప్రీ ప్రైమరీ ఇన్చార్జులు, కరాటే మాస్టర్ రాజ్ కుమార్, పీఈటీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# దామన్న కుటుంబానికి దక్కిన గౌరవం

## రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గారికి ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వడం హర్షనీయం..





ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:

నల్లగొండఖమ్మంవరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి పార్టీ అధిష్ఠానం ఖరారు చేసిన సందర్భంగా తుంగతుర్తి మండల కేంద్రంలో తెలంగాణ యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా స్టేట్ కోఆర్డినేటర్ కొండ రాజు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో నిరుద్యోగ యువత కోసం పలు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేసిందన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. గ్రాడ్యుయేట్లు, ఉద్యోగులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి కి మద్దతుగా నిలిచి, భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.అలాగే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తుంగతుర్తిలో త్వరలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు హెల్ప్ డెస్క్‌ను ప్రారంభిస్తున్నట్లు కొండ రాజు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరుగా అర్హులైన గ్రాడ్యుయేట్లు తమ పేర్లను నమోదు చేసుకోవడానికి హెల్ప్ డెస్క్‌ను వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప్పుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు

# జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ పీఠం ఎవరిది?

- 2024 అసెంబ్లీ తీర్పు ప్రభావం చూపుతుందా..?
- 2021 నాటి వైసీపీ ఆధిపత్యం కొనసాగుతుందా..?
- టీడీపీజనసేనబీజేపీ కూటమికి స్థానిక ఎన్నికలు మరో కీలక పరీక్ష

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30: జగ్గయ్యపేట

జగ్గయ్యపేట మున్సిపల్ రాజకీయాలు మరోసారి వేడెక్కుతున్నాయి.రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో రాజకీయ సమీకరణాలు, అభ్యర్థుల ఎంపిక, వార్డు స్థాయి బలాబలాలు, గత ఎన్నికల ప్రభావం ఇప్పుడు ప్రధాన చర్చగా మారాయి.

1987 నుంచి 2026 వరకు జరిగిన ప్రత్యక్ష మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకోలేకపోయిందన్న చర్చ స్థానిక రాజకీయ వర్గాల్లో ఉంది. అయితే 2009, 2024లో పరోక్ష విధానంలో మున్సిపల్ పీఠం టీడీపీకి దక్కిన సందర్భాలు ఉన్నాయి.

2021లో వైసీపీ ఆధిపత్యం

2021 మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ ఆధిపత్యంతో మున్సిపల్ పాలకవర్గం ఏర్పడింది. ఆ ఎన్నికల తర్వాత జగ్గయ్యపేట మున్సిపల్ రాజకీయాల్లో వైసీపీ బలమైన స్థానాన్ని సంపాదించింది.

అయితే 2024లో రాజకీయ సమీకరణాల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. అప్పటి మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో పాటు ముగ్గురు కౌన్సిలర్లు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. దీంతో మున్సిపల్ రాజకీయాల్లో అప్పటి వరకు ఉన్న బలాబలాల్లో మార్పులు కనిపించాయి.

2024 అసెంబ్లీ తీర్పు ప్రభావం ఉంటుందా?

2024 అసెంబ్లీ ఎన్నికల్లో జగ్గయ్యపేట నియోజకవర్గం నుంచి టీడీపీకి చెందిన శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) ఎమ్మెల్యేగా ఉన్నారు. రాష్ట్రంలో టీడీపీజనసేనబీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది.

ఈ నేపథ్యంలో రాబోయే మున్సిపల్ ఎన్నికలు స్థానికంగా రాజకీయ పార్టీలకు మరో కీలక పరీక్షగా మారుతున్నాయి.

అయితే అసెంబ్లీ ఎన్నికల లెక్కలు, మున్సిపల్ ఎన్నికల లెక్కలు ఒకేలా ఉండవని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గం మొత్తం ఒక రాజకీయ పరిధిగా ఉంటే.. మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి వార్డు, ప్రతి అభ్యర్థి, స్థానిక సమస్యలు, వ్యక్తిగత పరిచయాలు, సామాజిక మరియు రాజకీయ సమీకరణాలు కీలకంగా మారే అవకాశం ఉంటుంది.

టీడీపీ శిబిరంలో ఎవరు?

జగ్గయ్యపేటలో టీడీపీ తరపున ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య)తో పాటు ఆయన సోదరులు ధనుంజయ్ చినబాబు, శ్రీరామ్ సాయి ప్రసాద్




కుటుంబ సభ్యులు రాజకీయంగా ప్రస్తావనలో ఉన్నారు.

అదేవిధంగా మాజీ మంత్రి నెట్టెం రఘురాం, మాజీ ఎమ్మెల్సీ తొండపు దశరథ జనార్ధన్ వంటి సీనియర్ నాయకుల ఉనికి కూడా టీడీపీ రాజకీయ సమీకరణాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

జనసేన వైపు సామినేని కుటుంబం

జనసేన తరపున మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కుటుంబం కూడా స్థానిక రాజకీయాల్లో కీలకంగా ఉంది. ఆయనతో పాటు ఆయన భార్య విమల భాను, కుమారులు ప్రసాద్ బాబు, ప్రశాంత్ బాబు పేర్లు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

రాష్ట్ర స్థాయిలో టీడీపీజనసేనబీజేపీ కూటమి అధికారంలో ఉన్న నేపథ్యంలో జగ్గయ్యపేట మున్సిపల్ ఎన్నికల్లో ఈ మూడు పార్టీల మధ్య సమన్వయం ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

వైసీపీ శిబిరంలో బలమైన కేడర్

మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున మాజీ మునిసిపల్ చెర్మన్ లు గా పనిచేసిన తన్నీరు నాగేశ్వరరావు, ఇంటూరి రాజగోపాల్ (చిన్నా)తో పాటు పార్టీకి ఉన్న స్థానిక కేడర్ కూడా మున్సిపల్ ఎన్నికల్లో కీలకంగా మారే అవకాశం ఉంది.

2021లో మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ సాధించిన ఆధిపత్యాన్ని తిరిగి కొనసాగించగలదా? లేక 2024 తర్వాత మారిన రాజకీయ సమీకరణాలు ఈసారి ప్రభావం చూపుతాయా? అన్నది చర్చనీయాంశంగా మారింది.

టికెట్ల కోసం పోటీ.. ఇండిపెండెంట్లుగా బరిలోకి?

మరో ఆసక్తికరమైన అంశం టికెట్ల ఆశావహులు.

కూటమి తరపున టికెట్లు ఆశించి అవకాశం దక్కని కొందరు నాయకులు, కార్యకర్తలు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగే అవకాశం ఉందన్న చర్చ కూడా స్థానికంగా వినిపిస్తోంది.

అలా జరిగితే అధికారిక పార్టీ అభ్యర్థులతో పాటు రెబల్ లేదా స్వతంత్ర అభ్యర్థుల పోటీ కూడా వార్డు వారీగా ఎన్నికల సమీకరణాలను ప్రభావితం చేసే అంశంగా మారే అవకాశం ఉంది.

కూటమి గెలిస్తే.. అది ఎవరి విజయం?

జగ్గయ్యపేట మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీజనసేనబీజేపీ కూటమి కలిసి పోటీ చేస్తే.. మున్సిపల్ పీఠం కూటమికి దక్కితే దాన్ని కేవలం టీడీపీ విజయంగా చూడాలా? లేక మూడు పార్టీల ఉమ్మడి విజయంగా చూడాలా? అన్న చర్చ కూడా రాజకీయ వర్గాల్లో మొదలైంది.

అయితే దీనికి సమాధానం ఎన్నికల తర్వాతే స్పష్టమవుతుంది. ఎందుకంటే మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి వార్డులోని అభ్యర్థి బలం, స్థానిక సమస్యలు, ఓటర్ల అభిప్రాయం, పార్టీ సమీకరణాలు ఫలితాలను ప్రభావితం చేయవచ్చు.

అసలు ప్రశ్న ఇదే..

2024లో వచ్చిన అసెంబ్లీ తీర్పు 2026 మున్సిపల్ ఎన్నికల్లోనూ ప్రభావం చూపుతుందా?

2021లో వైసీపీ సాధించిన మున్సిపల్ ఆధిపత్యం కొనసాగుతుందా?

2024లో చోటుచేసుకున్న రాజకీయ మార్పులు ఈ ఎన్నికల్లో ప్రతిఫలిస్తాయా?

టీడీపీజనసేనబీజేపీ కూటమి కలిసి పనిచేస్తే దాని ప్రభావం ఎంతవరకు ఉంటుంది?

టికెట్లు దక్కని ఆశావహులు స్వతంత్రులుగా బరిలోకి దిగితే వార్డు వారీగా లెక్కలు ఎలా మారతాయి?

ఇవన్నీ ఇప్పుడు జగ్గయ్యపేట రాజకీయాల్లో ఆసక్తికరమైన ప్రశ్నలుగా మారాయి.

అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గ స్థాయి తీర్పు ఒకటైతే.. మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి వార్డు ఒక ప్రత్యేక రాజకీయ రంగం. ప్రతి అభ్యర్థి తనకంటూ ప్రత్యేక సమీకరణాలతో ప్రజల ముందుకు వెళ్లే అవకాశం ఉంది.

అందుకే ఎమ్మెల్యే ఏ పార్టీకి చెందినవారు అన్నది ఒక అంశం మాత్రమే. రాష్ట్రంలో ఏ కూటమి అధికారంలో ఉందన్నది మరో అంశం. కానీ మున్సిపల్ పీఠాన్ని నిర్ణయించేది చివరికి వార్డు వారీగా ప్రజలు వేసే ఓటే.

జగ్గయ్యపేట మున్సిపల్ పీఠం ఈసారి ఎవరిది?

2021లో వైసీపీ ఆధిపత్యం.. 2024లో మారిన రాజకీయ సమీకరణాలు.. 2026లో కొత్త ఎన్నికల సమీకరణాలు..ఈ పరిణామాల మధ్య జగ్గయ్యపేట మున్సిపల్ పీఠం కోసం జరిగే పోటీ స్థానిక రాజకీయాల్లో మరో కీలక అధ్యాయానికి నాంది పలకనుందా?సమాధానం చెప్పేది నాయకుల అంచనాలు కాదు.. రాజకీయ వ్యూహాలు కాదు.. చివరికి జగ్గయ్యపేట ప్రజల తీర్పే.

# రహదారి నిర్మాణానికి అనుమతి ఇచ్చినందుకు అధికారులకు ధన్యవాదాలు తెలిపిన బేరి రామచందర్ యాదవ్

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:

శేరిలింగంపల్లి.. నేతాజీ నగర్ కాలనీలో నివాసం ఉండే పేద మధ్య తరగతి కుటుంబాలను ప్రతినిత్యం పనుల కోసం అపర్ణ సరోవర్ దారి హాస్పిటల్కు వెళ్లాలన్న ఇంకేదన్నా పనుల మీద వెళ్లాలన్నా దారి పూర్తిగా మూసి వేయడం జరిగింది. ఈ రహదారి కోసం అధికారులకు చాలాసార్లు విన్నవించుకోవడం జరిగిందని కాలనీ అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ తెలిపారు. అసోసియేషన్ వారు మాకు దారి కల్పించాలని జిహెచ్ఎంసి అధికారులకు వినతిపత్రం ఇవ్వగా వాళ్లు సానుకూలంగా స్పందించి ఈరోజు దారి చేయడానికి అనుమతి



ఇచ్చినందుకు అధికారులకు ధన్యవాదాలు తెలిపిన కాలనీ అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీధర్, సూపర్వైజర్ లక్ష్మణ్, కాలనీ ఉపాధ్యక్షులు రాయుడు, కే నరసింహ యాదవ్, అన్నదొర, దశరథ్ నాయక్, గణేష్ నాయక్, బాల్రాజ్ సాగర్, మరియు కాలనీ అసోసియేషన్ సభ్యులు దగ్గరుండి పనులు పర్యవేక్షించడం జరిగింది దారి కల్పిస్తున్నందుకు ఆదివారం అధికారులకు ధన్యవాదాలు తెలిపినారు కాలనీ అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్.

# ప్రజాస్వామ్య రక్షణకు ఐక్యంగా ఉద్యమిద్దాం

మహబూబాబాద్ జిల్లా
ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:

బిజెపి ఆర్ఎస్ఎస్ ల నాయకత్వంలో కొనసాగుతున్న కేంద్ర ప్రభుత్వము నుండి ఏర్పడుతున్న ప్రజాస్వామ్యపు ముప్పును ఎదుర్కోవటానికి ఐక్యంగా ఉద్యమిద్దమని వామపక్ష ముస్లిం మైనార్టీ, క్రిస్టియన్, బిసి, దళిత, గిరిజన సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. తొర్రూరు లైన్స్ భవనంలో నేడు భారత ప్రభుత్వ ఎన్నికల ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్ కుమార్ ను తొలగించాలని ఎస్ ఐ ఆర్ ప్రక్రియ నిలిపివేయాలని తదితర డిమాండ్స్ తో రౌండ్ టేబుల్ సమావేశం నేడు జరిగింది. ఈ సమావేశానికి మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న సిపిఐ మండల కార్యదర్శి బందు మహేందర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర మాజీ నాయకులు సమ్మెర విశ్వేశ్వరరావు మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి బిసి హక్కుల పోరాట సంఘం మండల అధ్యక్షుడు అన్నపురం వెంకన్న




ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుగులోతు బాలు నాయక్, బి ఎస్ పి మండల అధ్యక్షులు ఈదురు ప్రసాద్, క్రిస్టియన్ డివిజన్ అధ్యక్షులు దేవిద్రాజు ముస్లిం మండల అధ్యక్షులు అలీంలు హాజరై మాట్లాడుతూ పాం నెంబర్ ఆరు పేరుతో అర్థం లేని ప్రశ్నలు వేస్తూ భారతీయ ప్రజలకు గందరగోళానికి గురి చేశారు. బిజెపి- ఆర్ఎస్ఎస్ ఏజెంట్ మారిన సీ ఈ ఎస్ జ్ఞానేశ్వర్ భారత ప్రజాస్వామ్యం ను అపహాస్యం చేస్తున్నారని అన్నారు. ప్రపంచ ఉన్మాది హిట్లర్ వారసులుగా నేటి ఆర్ఎస్ఎస్ చర్యలు ఉన్నాయని అన్నారు. ఇదే అంశశీ శుక్రవారం జిల్లా కేంద్రం లలో నిరసన ఉందని అన్నారు. అక్టోబర్ 5న తొర్రూర్ లో వందలాది మంది ప్రజల తో భారీ నిరశన ఉన్నదని, ఇందులో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపు నిచ్చారు. సిపిఐ నాయకులు ఓమ బిక్షపతి గుండాల సోమనరసయ్య గణపురం లక్ష్మణ్ ముద్ర బోయిన వెంకన్న పేర బోయిన కిరణ్ కుమార్, క్రాంతి కుమార్. తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ట్రైనెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
గురువారం, అక్టోబర్,01, 2026
www.trinetnews.com

# రౌతుపాలెంలో ఎస్ఎంసీ చైర్మన్,వైస్ చైర్మన్లుగా వీరబాబు, పూర్ణ శ్రీ ఏకగ్రీవ ఎన్నిక

## -- నిమ్మల రాంబాబు సమక్షంలో ఎన్నికైన కమిటీ సభ్యులను సత్కరించిన ఎమ్మెల్యే సత్యప్రభ..





ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రౌతుపాలెం గ్రామంలోని ఎంపీపీ పాఠశాల పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. గ్రామ ప్రజలు, కూటమి నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో ఎస్ఎంసీ చైర్మన్‌గా తామర వీరబాబు, వైస్ చైర్మన్‌గా కుండల పూర్ణ శ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా బండి లోవకుమారి, సానబోయిన లోవరాజు, బెణుకం సత్తిబాబు, మానెల్లి అచ్యుతమణి, సానబోయిన కోటేశ్వరి, జానకి రాణి, కాయల వెంకన్నబాబు ఎన్నికయ్యారు. ఎన్నికైన ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి కమిటీ సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నిమ్మల రాంబాబు, కొంగన కుమారస్వామి, కోలా ధనబాబు, గుండం సత్తిబాబు, కొంగన నాని, దాసరి గణేష్, ఉమ్మిడి సర్వారాయుడు, కాయల సూరిబాబు, గోనెల బాబురావు, ఉపాధ్యాయురాలు వానపల్లి లీలా ఈశ్వరి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గొల్లప్రోలులో పితృపక్ష అన్నదానం





గొల్లప్రోలు, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:

పితృదేవతలు, పూర్వీకులను స్మరించుకుంటూ వారికి కృతజ్ఞతలు సమర్పించాలనే ఉద్దేశంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సొంత నిధులతో పిఠాపురం నియోజకవర్గవ్యాప్తంగా 14 రోజుల పాటు నిర్వహిస్తున్న పితృపక్ష అన్నదాన కార్యక్రమంలో భాగంగా బుధవారం గొల్లప్రోలులో అన్నదానం నిర్వహించారు.పట్టణంలోని శివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పాల్గొని భక్తులకు స్వయంగా భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పితృదేవతలను స్మరించుకోవడంతో పాటు సమాజంలో సేవా భావాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కౌడా చైర్మన్ తలాటం సత్య, జనసేన నాయకుడు యనమల కృష్ణుడు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి






తుని: ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:

గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జాయింట్ యాక్షన్ కమిటీ (JAC) నాయకులు తుని వీణాకు వినతిపత్రం అందజేశారు. కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, పెండింగ్ జీతాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. FTA, బదిలీలు, ప్రమోషన్లు, హెల్త్ కార్డులు, ప్రమాద బీమా తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 5లోపు సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేపడతామని JAC నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, సభ్యులు, గాంధీ రాజు, విజయ్ కుమార్, సీఐటీయూ నాయకులు నక్కెళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# వృద్ధురాలి బంగారు గొలుసు చోరీ కేసు ఛేదన..

## ముగ్గురు నిందితుల అరెస్ట్

**రూ.2.50 లక్షల విలువైన బంగారం స్వాధీనం..**



పిఠాపురం, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:

పిఠాపురం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని విరవ గ్రామంలో వృద్ధురాలి ఇంట్లో చొరబడి బంగారు గొలుసు దోపిడీ చేసిన కేసును పోలీసులు ఛేదించారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, సుమారు రూ.2.50 లక్షల విలువైన 2 కాసుల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 27న రాత్రి విరవ గ్రామానికి చెందిన తోట నాగమణి (60) ఇంట్లో నిద్రిస్తుండగా నిందితులు ఆమె నోటిని టవల్‌తో అదిమిపట్టి మెడలోని బంగారు గొలుసును బలవంతంగా లాక్కెళ్లారు. దీనిపై సెప్టెంబర్ 28న పిఠాపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.దర్యాప్తులో భాగంగా సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించిన పోలీసులు సెప్టెంబర్ 29న విరవలోని జట్లమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో వారిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో తోట రాంబాబు (40), దాసరి ప్రసాద్ (39), రంపం విజయకుమార్ (36) ఉన్నారు.నిందితుల నుంచి నేరానికి ఉపయోగించిన పల్సర్ మోటార్‌సైకిల్, ఒప్పో ఏ16 ఆండ్రాయిడ్ మొబైల్, మోటరోలా కీప్యాడ్ ఫోన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపీఎస్ ఆదేశాలు, అడ్మిన్ ఏఎస్పీ మహంతి కిషోర్ కుమార్ సూచనల మేరకు పిఠాపురం సీఐ జి.వి.వి. సత్యనారాయణ నేతృత్వంలో ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టింది. కేసును త్వరితగతిన ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంలో కృషి చేసిన సీఐ, రూరల్ ఎస్ఐ ఎస్.కె. జాన్ భాషా, క్రైమ్ టీం సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# ఆదర్శ్ కళాశాలలో 'సాధన 2కె26' పోస్టర్ ఆవిష్కరణ







గొల్లప్రోలు, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:

గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలోని ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో 'సాధన 2కె26' జాతీయ స్థాయి టెక్ హ్యాకథాన్ పోస్టర్‌ను బుధవారం కళాశాల చైర్మన్ బుర్రా అనుబాబు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బుర్రా అనురాధ ఆవిష్కరించారు. అక్టోబర్ 8 నుంచి 10వ తేదీ వరకు మూడు రోజుల పాటు హ్యాకథాన్ నిర్వహించనున్నట్లునిర్వాహకులు తెలిపారు.వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు పాల్గొనేలా కార్యక్రమాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. సైబర్ సెక్యూరిటీ, కోడింగ్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆవిష్కరణలపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యంగా 'సాధన 2కె26' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హ్యాకథాన్‌లో విద్యార్థులు తమ సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించడంతో పాటు సమస్యలకు సృజనాత్మక పరిష్కారాలను రూపొందించే అవకాశం ఉంటుందన్నారు.ఈ సందర్భంగా చైర్మన్ బుర్రా అనుబాబు మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను విద్యార్థులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. టెక్నాలజీని విద్యాభివృద్ధి, నైపుణ్యాల పెంపు, భవిష్యత్తు అవకాశాలకోసంసద్వినియోగంచేసుకోవాలన్నారు. చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పోటీ తత్వంతో లక్ష్యసాధనకుకృషిచేయాలనిసూచించారు.సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బుర్రా అనురాధ మాట్లాడుతూ విద్యార్థుల్లోని సాంకేతిక ప్రతిభను వెలికితీయడమే 'సాధన 2కె26' ఉద్దేశమన్నారు. జాతీయ స్థాయి హ్యాకథాన్ ద్వారా విద్యార్థులకు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు మంచి వేదిక లభిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బుర్రా అఖిలేష్, ప్రిన్సిపల్ డాక్టర్ వైవీఎస్ రాజశేఖర్, డీన్ ఎస్.కొండలరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు టి.ప్రేమ్ బాస్కో, ఎం.సుబ్బారావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ధర్మవరంలో ఉద్యాన పంటల పరిశీలన

## --రైతులకు యాజమాన్య పద్ధతులపై ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు



ప్రత్తిపాడు,(యజ్ఞ ) ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:

ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో కూరగాయలు, బొప్పాయి, పూల తోటలను ఉద్యాన శాఖ ఏడీఏ శ్రీనివాస్, ఉద్యాన అధికారి కె దివ్యశ్రీ, వ్యవసాయ అధికారిణి జోకా అమృత బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంటల్లో తెగుళ్లు, పురుగుల నివారణతో పాటు రైతులు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. ఆకాకర, చిక్కుడు పంటల్లో విరిగిన కొమ్మలు, కుళ్లిన ఆకులు, కాయలను తొలగించాలని సూచించారు. ఆకుమచ్చ, కుళ్లు తెగుళ్ల నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కాండం, వేరుకుళ్లు నివారణకు బ్లైటాక్స్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్క మొదల్లో పోయాలని తెలిపారు. పురుగుల నివారణకు సూచించిన మందులను సిఫార్సు చేసిన మోతాదులోనే వినియోగించాలని సూచించారు. నేలలో నీరు తగ్గిన అనంతరం 19:19:19 నీటిలో కరిగే ఎరువును 5 గ్రాములు లీటరు నీటికి లేదా పంటకు అనుకూలమైన నీటిలో కరిగే ఎన్‌పీకే, సూక్ష్మపోషకాలను సిఫార్సు చేసిన మోతాదులో పిచికారీ చేయడం ద్వారా పూత, పిందె నిలిచి దిగుబడి మెరుగుపడుతుందని వివరించారు. బొప్పాయి తోటల్లో కుళ్లిన ఆకులు, పండ్లు, కాండం భాగాలను తొలగించాలని సూచించారు. వేరుకుళ్లు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్ల వద్ద మట్టి తడిచేలా పోయాలని తెలిపారు. కాపు వచ్చిన తోటల్లో పండ్ల కుళ్లు నివారణకు హెక్సాకోనాజోల్‌ను సిఫార్సు చేసిన మోతాదులో స్టిక్కర్‌తో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. గులాబీ తోటల్లో కొమ్మల కత్తిరింపులు చేసి కార్బెండజిమ్ లేదా బ్లైటాక్స్ పిచికారీ చేయడం ద్వారా ఎండు తెగులును నియంత్రించవచ్చని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ అర్జున్, గ్రామ ఉద్యాన, వ్యవసాయ సహాయకులు సత్తిబాబు, రామలక్ష్మి, బాబీతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

## విద్యార్థులకు పిఠాపురం జూనియర్ సివిల్ జడ్జి అపర్ణ సూచనలు...





గొల్లప్రోలు, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:

విద్యార్థులు విద్యతో పాటు ఆత్మవిశ్వాసం, నైతిక విలువలు, క్రమశిక్షణ, పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని పిఠాపురం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.వి. అపర్ణ సూచించారు. గొల్లప్రోలులోని బాలుర, బాలికల ఉన్నతపాఠశాలలనుఆమెసందర్శించి విద్యార్థులకు ప్రేరణాత్మకసందేశాన్నిఅందించారు

.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్య మనిషిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు స్వావలంబన దిశగా అడుగులు వేసేందుకు, జీవితంలో లక్ష్యాలను నిర్దేశించుకుని మెరుగైన భవిష్యత్తును నిర్మించుకునేందుకు దోహదపడుతుందన్నారు. దేశ నిర్మాణంలో విద్యావంతులైన బాలలు కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. ప్రతి చిన్నారికి జీవించే హక్కు, నేర్చుకునే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, రక్షణ పొందే హక్కులతో పాటు గౌరవం, సమానత్వంతో సమాజంలో భాగస్వామ్యం అయ్యే హక్కులు ఉన్నాయని వివరించారు.బాలికల పాఠశాలలో మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అసౌకర్యం లేదా భయం కలిగించే స్పర్శను వెంటనే 'వద్దు' అని చెప్పి, అక్కడి నుంచి దూరంగా వెళ్లి నమ్మకమైన పెద్దలకుసమాచారంఅందించాలనితెలిపారు.

బాలుర పాఠశాలలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలు ఆరోగ్యం, ఆలోచనా శక్తి, చదువుపై ప్రతికూల ప్రభావం చూపుతాయని తెలిపారు. చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ, స్నేహితుల ఒత్తిడికి లోనుకాకుండా ధైర్యంగా 'వద్దు' అని చెప్పాలని సూచించారు. చదువు, క్రీడలు, మంచి లక్ష్యాలపై దృష్టి సారించి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పిఠాపురం బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.ఎం. అలీ, న్యాయవాదులు ఎం. సత్యవతి, ఏ.హెచ్. సాయి, లీగల్ వాలంటీర్ ఎం.వి. సూరిబాబు, ప్రధానోపాధ్యాయులు ఆశాభి, పాపారావు, సీఆర్‌పీలు ఆకుల రామకృష్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# లింగంపర్తిలో మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావును కలిసిన కూటమి నేతలు





ఏలేశ్వరం ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:

: ఏలేశ్వరం మండలం లింగంపర్తిలోని మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు స్వగృహంలో కూటమి నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల వైసీపీని వీడి జనసేనలో చేరిన వరుపుల సుబ్బారావును కలిసి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.మాజీ ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన అల్పాహార విందులో కూటమి నేతలు పాల్గొన్నారు.జనసేనలో చేరిన వరుపుల సుబ్బారావును కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభా రాజా, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రత్యేకంగా కలిసి అభినందించారు.ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలకు, జనసేన ఆశయాలకు ఆకర్షితుడై జనసేనలో చేరానని అన్నారు. తనను అభినందించేందుకు వచ్చిన నేతలు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా దూసుకుపోతోందని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన బలోపేతానికి ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కుడా చైర్మన్ తలాటం సత్య, టీడీపీ నేత మీసాల రాజు, మండల స్థాయి టీడీపీ, జనసేన, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మాదిగ రిజర్వేషన్ పోరాట సమితికి నిర్మల్ జిల్లా నుండి ముగ్గురికి పదవులు - గర్వంగా ఉందన్న ముధోల్ మాదిగ సంఘం అధ్యక్షుడు నామత్కర్ దిగంబర్

ముధోల్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30::

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్పీఎస్), ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో కొత్తగా ఎన్నికైన జాతీయ నాయకులకు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు ముధోల్ మాదిగ సంఘం అధ్యక్షుడు, పాంగ్రీ సర్పంచ్ నామత్కర్ దిగంబర్ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో మన నిర్మల్ జిల్లా నుండి ముగ్గురికి సంఘంలో బాధ్యతలు ఇవ్వడం చాలా గర్వంగా ఉందని అన్నారు. ఈ బాధ్యతలు రావడం వెనుక గత 32 సంవత్సరాలుగా వారు జాతి కోసం పడిన కష్టాలు, చేసిన సేవలు, వర్గీకరణ కోసం చేసిన నిరంతర పోరాటం, తీసుకొచ్చిన ఐక్యతా భావమే కారణమని తెలిపారు. అందుకే నిర్మల్ జిల్లా ఎంఈఎఫ్ కు ఇన్ని బాధ్యతలు ఇవ్వడం అనేది మన నాయకుల మీద ఉన్న నమ్మకానికి నిదర్శనమని అన్నారు.



అదే నమ్మకంతో ముందుకు కొనసాగాలని, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ అడుగుజాడల్లో నడవాలని కోరుతున్నామని తెలిపారు. గత రెండేళ్ల క్రితం జరిగిన శాసనసభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి మన సామాజిక వర్గం నుండి ఓట్లు వేయడమే కాకుండా ప్రచారం చేయాలని అన్నగారు ఆదేశాలు ఇచ్చారని గుర్తు చేశారు. కానీ కొందరు ఎంఈఎఫ్ నాయకులు అన్నగారి ఆదేశాలను లెక్కచేయకుండా టీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎన్నికల్లో ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

కాబట్టి అన్నగారి పేరుతో నాయకులుగా చెప్పుకుంటూ, అన్నగారి సూచనలకు తూట్లు పొడిచే నాయకులు ఇప్పుడైనా క్రమశిక్షణగా ఉండాలని, ఎంఈఎఫ్, ఎంఆర్పీఎస్ నిర్ణయమే మన నిర్ణయంగా భావించి ముందుకు సాగాలని ముధోల్ మాదిగ సామాజిక వర్గం తరపున కోరుకుంటున్నామని ఆయన తెలిపారు.

# ముదిమాణిక్యం మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా జక్కుల బాబు ఏకగ్రీవ ఎన్నిక...



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30: /చిగురుమామిడి:

- రెండోవసారి అధ్యక్షుడిగా ఎన్నికైన బాబు..
- నూతన కార్యవర్గానికి మాజీసర్పంచ్ ఘన సత్కారం

మండలంలోని ముదిమాణిక్యం గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఎన్నికల అధికారి,జూనియర్ ఇన్స్పెక్టర్ లత ఆధ్వర్యంలో ఈ నూతన కార్యవర్గ ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు.ఈ ఎన్నికల్లో సంఘ సభ్యులందరూ ఏకాభిప్రాయంతో జక్కుల బాబును సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జక్కుల బాబు అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఇది వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడుగా నాగుల రాజేందర్,కార్యదర్శిగా జక్కుల మల్లేష్,డైరెక్టర్లుగా జక్కుల స్వామి,దుర్మొట్ల కనకయ్య, జక్కుల కనకయ్య,జక్కుల రవి, యాట వెంకటయ్య,యాట రాజయ్య,జక్కుల బాబు రెండోసారి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు సంతోషం వ్యక్తం చేస్తూ గ్రామానికి చెందిన మాజీసర్పంచ్ జక్కుల రవి నూతన అధ్యక్షుడిని,మిగిలిన కార్యవర్గ సభ్యులను శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా మత్స్య పారిశ్రామిక సంఘం అభివృద్ధికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు,గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కంభం ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు 35 రోజులుగా ఆందోళన.. ఒంటి కాలిపై నిలబడి నిరసన

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30: ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రతినిధి

కంభం ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం గత 35 రోజులుగా శాంతియుతంగా నిరవధిక నిరసన కొనసాగిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం భోజన సమయంలో పేషెంట్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వినూత్న రీతిలో ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు.రెగ్యులరైజేషన్‌తో పాటు 100 శాతం గ్రాస్ శాలరీ, బేసిక్ పే, డీఏ, హెచ్ఆర్ఏ కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. కరోనా మహమ్మారి సమయంలో సైతం తమ ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహించామని, అయినప్పటికీ తమ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదని కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం తమను రెగ్యులర్ చేయాలని, రెగ్యులరైజేషన్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ప్రతి కాంట్రాక్ట్ ఉద్యోగికి బేసిక్ పే, డీఏ, హెచ్ఆర్ఏతో కూడిన 100 శాతం




గ్రాస్ శాలరీ అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, రేడియోగ్రాఫర్లు తదితర కాంట్రాక్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్మీ హవల్దార్ కు జిల్లా కలెక్టర్ ఘన నివాళులు



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30: ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రతినిధి

బేస్తవారిపేట మండలం పందిళ్ళపల్లి గ్రామానికి చెందిన కువ్వారపు కిషన్ ఆర్మీలో హవల్దార్ గా విధులు నిర్వహిస్తూ అస్సాం రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈ నెల 27 వ తేదిన మరణించారు. ఈ నేపథ్యంలో స్వగ్రామం లో కిషన్ పార్థివ దేహానికి బుధవారం ప్రభుత్వ లాంఛనాల ప్రకారం అంతక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత , జిల్లా ఎస్పీ ఫంకజ్ కుమార్ మీనా, ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి, ఆర్మీ, పోలీస్ అధికారులు అంతక్రియల్లో పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా న్యాయం చేస్తామని వారికి భరోసా నిచ్చారు.

# "ఖేలో తెలంగాణ" కార్యక్రమం ప్రారంభం

## ఆరోగ్యవంతమైన, చురుకైన తెలంగాణ కోసం రాష్ట్రవ్యాప్త ఫిట్‌నెస్ ఉద్యమం

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 30:



పౌరుల్లో ఫిట్‌నెస్, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం క్రీడల శాఖ, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (SATG) ఆధ్వర్యంలో"ఖేలో తెలంగాణ" కార్యక్రమాన్ని ప్రారంభించింది. పౌరులు తమ దైనందిన జీవితంలో శారీరక వ్యాయామాన్ని అంతర్భాగంగా చేసుకునేలా ప్రోత్సహించడం ద్వారా తెలంగాణను ఆరోగ్యవంతమైన, చురుకైన, ఉత్సాహభరితమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడం ఈ కార్యక్రమం లక్ష్యం. నడక, పరుగు, యోగా, క్రీడలు, ఇతర ఫిట్‌నెస్ కార్యకలాపాల్లో ప్రజలు క్రమం తప్పకుండా పాల్గొనాలని ఈ ప్రచారం ప్రోత్సహిస్తోంది.

రాష్ట్ర క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి ప్రజలందరూ ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు శారీరక వ్యాయామానికి కేటాయించాలని పిలుపునిచ్చారు. ఎల్బీ స్టేడియంలో జరిగిన "ఖేలో తెలంగాణ" కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే అభివృద్ధి చెందిన, సుసంపన్నమైన తెలంగాణకు పునాది అని ఆయన పేర్కొన్నారు. ఫిట్‌నెస్‌ను జీవితాంతం అలవాటుగా చేసుకోవాలని పౌరులను కోరారు.విద్యార్థులు, యువత, మహిళలు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, వృద్ధులు, అన్ని వర్గాల ప్రజలు ఈ ఉద్యమంలో చురుకుగా పాల్గొని, తమ కుటుంబాలు మరియు సమాజాలను ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించేలా ప్రేరేపించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

**సీఎంకు ఖేలో తెలంగాణ బంధన్ చాలెంజ్**

ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మాజీ భారత క్రికెట్ కెప్టెన్ మొహమ్మద్ అజహరుద్దీన్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఐఏఎస్, SATG ఛైర్మన్ శ్రీ కె. శివసేన రెడ్డి, SATG వైస్ చైర్‌పర్సన్ ఁ మేనేజింగ్ డైరెక్టర్ డా. ఎ. సోనిబాలా దేవి, ఐఎఫ్ఎస్, డీజీపీ సి.వి. ఆనంద్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి. సింధు, బాక్సింగ్ ఛాంపియన్ నిఖత్ జరీన్, పారా అథ్లెట్ దీప్తి జీవాంజి, షూటర్ ఈషా సింగ్ తదితర ప్రముఖులకు మంత్రి ఫిట్‌నెస్ ఛాలెంజ్ విసిరారు. పాల్గొనేవారు మరో తొమ్మిది మందిని నామినేట్ చేయాలని ప్రోత్సహించారు. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యం, ఫిట్‌నెస్ సందేశాన్ని విస్తృతం చేయవచ్చని తెలిపారు. ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు, పౌరులు తమ ఫిట్‌నెస్ కార్యకలాపాలను ప్రదర్శించే 27 సెకన్ల వీడియో రీల్ రూపొందించి, మరో తొమ్మిది మందిని ఈ ఉద్యమంలో చేరాలని సవాలు చేయాలని కోరారు. ఫిట్‌నెస్ అవగాహనను సమర్థవంతంగాపెంపొందించేఉత్తమ వీడియోలను తెలంగాణస్పోర్ట్స్అథారిటీగుర్తించిప్రోత్సహిస్తుంది.

స్వామి వివేకానంద ప్రేరణాత్మక సందేశమైన "లేచి నిలబడండి, మేల్కొనండి, లక్ష్యాన్ని చేరుకునే వరకు ఆగకండి" అని ఉటంకిస్తూ, ప్రతి ఇల్లు, గ్రామం, పట్టణం "జాగో తెలంగాణ -- భాగో తెలంగాణ -- ఖేలో తెలంగాణ" స్ఫూర్తిని స్వీకరించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ థర్డ్ డిప్యూటీ డైరెక్టర్ అశోక్ కుమార్ పిఆర్ ఓ కాలేరు సురేష్ గచ్చిబౌలి స్టేడియం అడ్మినిస్ట్రేటర్ కన్నం మధు కోచ్ లు క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి - డాక్టర్ షేక్ మహబూబ్ వలి

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:






బిజెపిఅక్రమాలకుఅనుకూలంగావ్యవహరిస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి డిమాండ్ చేశారు.మార్కాపురం పట్టణ ప్రెస్ క్లబ్ లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశానికి సిపిఐ రాష్ట్ర నాయకులు ఆదే నాసరయ్య అధ్యక్షత వహించారు.డాక్టర్ షేక్ మహబూబ్ వలి మాట్లాడుతూ2025లో మన ప్రియతమ నాయకుడు, లోక్ సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ దేశంలో జరుగుతున్న ఈవీఎం దొంగతనం గురించి బట్టబయలు చేశారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి దేశవ్యాప్తంగా ధర్నాలు చేశారు.ఇండియన్ ఎక్స్ ప్రెస్ లో వచ్చిన సమాచారం తర్వాత ప్రధాన ఎన్నికల కమిషనర్ బిజెపికి తొత్తుగా మారి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును హత్య చేస్తున్నారని స్పష్టమైంది. దాదాపు 13 కోట్లకు పైగా ఓట్లను అనేక రాష్ట్రాల్లో తొలగించారు.ఎస్ఐఆర్ కి ఎలాంటి త్రిసభ్య కమిటీ సిఫారసు లేకుండా జ్ఞానేష్ కుమార్ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ప్రధాని మోడీ, అమిత్ షా చెప్పినట్లు పనిచేస్తున్నారు.2023లో బిజెపి తెచ్చిన నల్ల చట్టాల వల్ల గతంలో ప్రధాని, ప్రతిపక్ష నాయకుడు, సీజేఐ లతో ఉన్న త్రిసభ్య కమిటీ నుండి సుప్రీంకోర్టు చీఫ్ ని తొలగించి ప్రధాని అనుకూల మంత్రిని చేర్చారు. అలాగే ఎన్నికల కమిషనర్ పై కేసులు పెట్టకూడదని కొత్త చట్టం తెచ్చి, 3 నెలల తర్వాత జ్ఞానేష్ కుమార్ ని నియమించారు.అక్టోబర్ 1న ఒంగోలులో, అక్టోబర్ 2న మార్కాపురంలో కాంగ్రెస్ పార్టీ మరియు వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగే శాంతియుత నిరసనలను అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.పాల్గొన్న నాయకులు ఆదే నాసరయ్య (సిపిఐ రాష్ట్ర నాయకులు), సుదర్శన్ (ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు), దగ్గుబాటి సోమయ్య (సిపిఐఎం జిల్లా కార్యదర్శి), షేక్ ఖాసిం (సిపిఐ మార్కాపురం సెక్రటరీ), షేక్ అబ్దుల్ రజాక్ (ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు), సయ్యద్ ఇమ్రాన్ (కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు), రఫీ, షేక్ నాగూర్ మీరావాలి తదితరులు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.



మహబూబాబాద్ జిల్లా ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:)



నెల్లికుదురు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.మండల వ్యాప్తంగా ప్రజలకు మెరుగైన వేగవంతమైన వైద్య సేవలు అందించడం కోసం సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని షెడ్యూల్ ప్రకారం మెడికల్ క్యాంపులో నిర్వహించాలని, సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, విద్య సంస్థలలో పిల్లలకు వంట చేసే సిబ్బందికి కచ్చితంగా వైద్య పరీక్షలు నిర్వహించాలని అట్టి నివేదికలో తమకు సమర్పించాలన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, గర్భిణీలకు పిల్లలకు బాలింతలకు సంబంధించిన టీకాలు క్రమం తప్పకుండా వేయాలని, మాతా శిశు మరణాలను అరికట్టాలని, హాస్పిటల్ కి వచ్చే ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ మెడిసిన్ రిజిస్టర్ లను అటెండెన్స్ రిజిస్టర్లు తనిఖీ చేశారు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్ల వారీగా మందులను సిద్ధంగా ఉంచుకోవాలని, పిల్లలకు వ్యాక్సిన్ షెడ్యూల్ ప్రకారం వేయాలి, బోద కాలు, గర్భ సంచీ క్యాన్సర్ ల నివారణ చర్యలు తీసుకోవాలని, సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏమైనా వసతులు, సౌకర్యాల ఇబ్బందులు లేకుండా చూసుకోవన్నారు.

అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి ప్రతి తరగతి గదిని తనిఖీ చేసి పిల్లలతో స్వయంగా మాట్లాడి భవిష్యత్తు కార్యచరణ ప్రణాళిక పై వారిని అడిగి తెలుసుకున్నారు, క్రమం తప్పకుండా కళాశాలకు హాజరుకావాలని ప్రతి సబ్జెక్టుపై నాలెడ్జి పెంచుకోవాలని సూచించారు, ప్రతి విద్యార్థినీ ,విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ లోనే భవిష్యత్తు కార్యాచరణ పై అడుగులు పడతాయని గుర్తుకు చేశారు, పిల్లలు ,ఉపాధ్యాయుల హాజరు శాతం పూర్తిగా నమోదయ్యే విధంగా ప్రిన్సిపల్ చర్యలు తీసుకోవాలని, ఇంగ్లీష్ ప్రతి సబ్జెక్టు పై ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, వంద శాతం ఉత్తీర్ణత పొందే విధంగా విద్యార్థినీ విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు.

ఈ పర్యటనలో కలెక్టర్ వెంట జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి మదర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, నెల్లికుదురు తహసిల్దార్ నరేష్, కళాశాల ప్రిన్సిపల్ వీరస్వామి, ప్రాథమిక వైద్యశాల అధికారి, తదితరులు ఉన్నారు.

# 'అనకాపల్లి' ఇంటర్వెల్, క్లైమాక్స్ సర్ప్రైజింగ్‌గా ఉంటాయి

## – మీడియా మీట్‌లో లగడపాటి శ్రీధర్



హైదరాబాద్:ట్రైనెట్‌న్యూస్,సెప్టెంబర్ 30:

'అనకాపల్లి' అక్టోబర్ 2న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ కాబోతోంది. అందరూ చూసి సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను – మీడియా మీట్‌లో త్రినాథరావు నక్కిన భవ్య శ్రీ మూవీ మేకర్స్, నక్కిన నెరేటివ్స్ బ్యానర్ల మీద కాంద్రేగుల నాయుడు, త్రినాథరావు నక్కిన నటిస్తూ, నిర్మించిన రా అండ్ రస్టిక్ చిత్రం 'అనకాపల్లి'. ఈ మూవీలో విక్రమ్ సహిదేవ్, సంధ్యా వశిష్ట, తారక్ పొన్నప్ప ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సినిమాకి ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహించారు. కాంద్రేగుల కుమార్ రాజా కో ప్రొడ్యూసర్‌గా చేసిన ఈ మూవీకి త్రినాథరావు నక్కిన కథ, స్క్రీన్ ప్లేని అందించారు. ఈ చిత్రాన్ని అక్టోబర్ 2న విడుదల చేయబోతోన్నారు. ఈ క్రమంలో బుధవారం నాడు మీడియాతో ఇంటరాక్ట్ అయ్యారు. ఈ మీడియా మీట్‌లోలగడపాటి శ్రీధర్ మాట్లాడుతూ .. "అనకాపల్లి' మూవీ అక్టోబర్ 2న రాబోతోంది. ఆగస్ట్‌లోనే ఈ సినిమా రావాల్సింది. అయితే చాలా మందికి ఈ మూవీని చూపించాం. అందరి సలహాల్ని తీసుకున్నాం. సినిమాని మరింత బెటర్ చేశాం. ఈ మూవీ కోసం మా విక్రమ్‌ని అడిగిన త్రినాథరావు గారికి థాంక్స్. నేను ఎప్పుడో ఆయన్ను నాకు ఓ సినిమా చేసి పెట్టండని అడిగాను. విక్రమ్‌కి ఇంత మంచి అవకాశం ఇచ్చిన త్రినాథరావు గారికి థాంక్స్. నాయుడు గారు పడ్డ కష్టం, ఆయనకి ఉన్న ప్యాషన్ కోసమైనా 'అనకాపల్లి' పెద్ద విజయం సాధించాలి. సంధ్య పోషించిన పాత్ర కొత్తగా ఉంటుంది. తారక్ పొన్నప్ప అయితే అందరినీ భయపెట్టేస్తాడు. ఇంటర్వెల్, క్లైమాక్స్ సర్ ప్రైజింగ్‌గా ఉంటాయి. మ్యూజిక్, ఆర్ఆర్ అద్భుతంగా కుదిరింది. ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుందని అనుకుంటున్నాను' అని అన్నారు.త్రినాథరావు నక్కిన మాట్లాడుతూ .. 'నిర్మాతల కష్టం నాకు ఇప్పుడిప్పుడు అర్థం అవుతోంది. సినిమా తీయడం కంటే ఆడియెన్స్ ముందుకు తీసుకు రావడం మరింత కష్టంగా మారింది. నిర్మాతగా కంటే దర్శకుడిగా ఉండటమే బెటర్ అనిపిస్తోంది. కానీ నిర్మాణం అనేది నాకు ప్యాషన్. నిర్మాతగా నా ఈ జర్నీని ఎంజాయ్ చేశాను. మేం ఓపెన్ చేసిన బుకింగ్స్ అన్ని చోట్లా ఫుల్ అవుతున్నాయి. ఇంటర్వెల్‌లో వచ్చే ట్విస్ట్‌ని ఎవ్వరూ ఊహించరు. క్లైమాక్స్ చాలా ఎమోషనల్‌గా ఉంటుంది. 'మేం వయసుకు వచ్చాం' తర్వాత నేను మళ్లీ అలాంటి ఓ ఫీల్ గుడ్ లవ్ స్టోరీని చేయలేదు. ఇన్నేళ్ల తర్వాత నాకు మళ్లీ ఓ అద్భుతమైన ప్రేమ కథ తట్టింది. అదే 'అనకాపల్లి'. ఇందులోని ఫ్యామిలీ డ్రామా గొప్పగా ఉంటుంది. విక్రమ్ ఈ మూవీ కోసం ఎంతో కష్టపడ్డాడు. ఈ సినిమాతో విక్రమ్‌కి మంచి పేరు వస్తుంది. సంధ్య అద్భుతంగా నటించింది. తారక్ పొన్నప్ప అందరినీ భయపెడతాడు. మా నిర్మాత నాయుడు కూడా ఈ చిత్రంలో మంచి పాత్రను పోషించాడు. 'అనకాపల్లి' సినిమాని అనకాపల్లిలో ప్రదర్శించాం. అక్కడ మాకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. 'అనకాపల్లి' అక్టోబర్ 2న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ కాబోతోంది. అందరూ చూసి సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను' అని అన్నారు.

నిర్మాత కాంద్రేగుల నాయుడు మాట్లాడుతూ .. "అనకాపల్లి' చిత్రంలో విక్రమ్ చాలా కొత్తగా కనిపిస్తారు. ఈ సినిమా కోసం విక్రమ్ చాలా కష్టపడ్డాడు. సంధ్య, త్రినాథరావు, తారక్ పొన్నప్ప, ఇంద్రజ ఇలా అందరి పాత్రలు అందరినీ ఆకట్టుకుంటాయి. అక్టోబర్ 2న మా సినిమా రాబోతోంది. అందరూ చూసి సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను' అని అన్నారు.

సంధ్య వశిష్ట మాట్లాడుతూ .. "అనకాపల్లి' చిత్రం అక్టోబర్ 2న రాబోతోంది. ఇంటెన్స్, లవ్, ఫ్యామిలీ, యాక్షన్ డ్రామాగా మా సినిమా రానుంది. మా మూవీ అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది' అని అన్నారు.

# కేటీఆర్, సంతోష్ రావు ఇసుక దందాలు

**పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సిరిసిల్ల "ఉరిసిల్ల" గా మారింది**
**సీఎం రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు**



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 30:**

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నేతన్నల గడ్డ సిరిసిల్ల అభివృద్ధి చెందకపోగా, అది కాస్తా 'ఉరిసిల్ల'గా మారిపోయిందని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సిరిసిల్లలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేసీఆర్ కుటుంబ పాలనపై, సిరిసిల్లలో జరిగిన అవినీతిపై నిప్పులు చెరిగారు. దైవం, ధైర్యం కలిసి వెలిసిన పవిత్ర ప్రాంతం సిరిసిల్ల అని, చేనేత కార్మికులు తమ అద్భుతమైన వృత్తి నైపుణ్యంతో 'అగ్గిపెట్టె చీర'ను సృష్టించి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చారని సీఎం కొనియాడారు. అలాంటి సిరిసిల్లను గత పాలకులు తమ స్వార్థ రాజకీయాల కోసం సమస్యల నిలయంగా మార్చేశారని విమర్శించారు. కార్మికుల కన్నీళ్లు, మగ్గాల చప్పుళ్లు నిలిచిపోయి, సంఘాల ఆందోళనలతో సిరిసిల్ల అంధకారంలోకి నెట్టబడిందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఉద్యమ సమయంలో క్రియాశీలకంగా పనిచేసిన కేకే మహేందర్ రెడ్డికి మొండిచెయ్యి చూపి, అమెరికా నుంచి కేసీఆర్ తన కొడుకును ఇక్కడ బరిలోకి దింపారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని అడ్డుపెట్టుకుని కల్వకుంట్ల కుటుంబం వేల కోట్ల ఆస్తులను వెనకేసుకుందని ఆరోపించారు. అధికారంలో ఉన్న పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం గల్ఫ్ వలసలను ఎందుకు నివారించలేకపోయిందని సీఎం రేవంత్ నిలదీశారు. ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి అక్కడ కార్మికులు మృతి చెందితే, కనీసం వారి మృతదేహాలను స్వస్థలాలకు తీసుకొచ్చేందుకు కూడా ఆనాడు ప్రభుత్వం సహకరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న ఒక్కరోజు కూడా గల్ఫ్ బాధితుల గురించి కేసీఆర్ కుటుంబం పట్టించుకున్న పాపాన పోలేదని దుయ్యబట్టారు. గతంలో కేసీఆర్ను ఎంపీగా గెలిపించినా పాలమూరు జిల్లాలో కూడా ఎలాంటి మార్పు రాలేదని గుర్తుచేశారు. అమెరికాలో ఎన్ని చిప్పలు కడిగితే లక్ష కోట్లు వస్తాయని కేసీఆర్ను సీఎం రేవంత్ ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబానికి ఏ వ్యాపారం చేస్తే రూ. లక్ష కోట్లు వచ్చాయో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కేసీఆర్ రూ. లక్ష కోట్లు కొల్లగొట్టారని ఆరోపించారు. ఆయన సడ్డకుడి కొడుకు సంతోష్ రావు మానేరు వాగులో ఇసుకను విచక్షణారహితంగా తోడేసి దోచుకున్నారని మండిపడ్డారు. కేటీఆర్తో కలిసి వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్నారని, వారి అవినీతిని ప్రశ్నించిన దళితులను లారీలతో తొక్కి చంపించింది నిజం కాదా అని తీవ్ర స్థాయిలో నిలదీశారు.

# కాచిగూడలో నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు

**- అక్రమ పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు :**
**- కాచిగూడ ట్రాఫిక్ ఇన్స్ స్పెక్టర్ బీ.వీరకౌశిక్**




ట్రైనెట్ న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 30 :

అక్రమ పార్కిం గ్ సమస్యలను అరికట్టడానికి, ట్రాఫిక్ నియంత్రణ కోసం నో పా ర్కింగ్ బోర్డుల ఏర్పాటు అత్యం త కీలకమైన పాత్ర పోషిస్తుందని కాచిగూడ ట్రాఫిక్ ఇన్స్ స్పెక్టర్ బీ.వీరకౌశిక్ అన్నారు. ట్రాఫి క్ రద్దీలను నివారించి, వాహనాలు సజా వుగా సాగేందుకు మెడిమిక్స్ వారు కాచి గూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేసేందుకు బుధవారం 26 నో పార్కింగ్ బోర్డులు అందజేశారు. ఈ మేర కు ట్రాఫిక్ సిబ్బంది, మెడిమిక్స్ సిబ్బంది తో కలిసి రామంతాపూర్ విశాల్ మార్ట్ వద్ద, చే నెంబర్ చౌరస్తా, బర్కత్ పుర రాఘవేంద్ర వద్ద, ఇండియా ఆయిల్ పెట్రో బంకు వద్ద వివిధ ప్రాంతాల్లో నో పార్కిం గ్ బోర్డులు, నింబోలిఅడ్డ ఫ్రీ లెఫ్ట్ బోర్డులు ఏర్పాటు చేశారు. అనంతరం సీఐ వీర కౌశిక్ మాట్లాడుతూ....వాహనాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న ప్రస్తుత రోజు ల్లో, రోడ్లపై క్రమశిక్షణను కాపాడటానికి ఇవి ఎంతో అవసరం అని అన్నారు. నో పార్కింగ్ జోన్లను స్పష్టంగా గుర్తించడం వల్ల వాహనదారులు అక్కడ పార్క్ చే యకుండా ఉంటారు, దీనివల్ల వాహనా ల రాకపోకలు సజావుగా సాగుతాయ న్నారు. ముఖ్యంగా పాదచారుల భద్రత, ప్రమాదాల తగ్గింపు, అత్యవసర సేవల ఆటంకాలు లేకుండా నో పార్కింగ్ బోర్డులు ఈ సమస్యను అరికడతాయని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాలతో పాటు నో పార్కింగ్ బోర్డులు వద్ద అక్రమ పార్కిం గ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

# ఫిలిం ఫెడరేషన్‌పై భగ్గుమన్న పలు సినీ సంఘాలు

**- చిత్రపురి హౌసింగ్ సొసైటీలో భారీ అక్రమాల ఆరోపణలు**
**- సినీ యూనియన్లను విచ్ఛిన్నం చేస్తున్నారంటూ విమర్శలు**
**- వల్లభనేని అనిల్‌ను వదిలిపెట్టబోమంటూ తీవ్ర హెచ్చరిక**
**- విచారణ నివేదికలను బయటపెట్టాలని డిమాండ్**
**-ఫిలిం ఛాంబర్‌కు బాధితులు, కార్మిక సంఘాల ప్రతినిధుల వినతిపత్రం**
**- వల్లభనేని అనిల్‌ను జైలులో పెట్టాలి: పాశం యాదగిరి డిమాండ్**



హైదరాబాద్:ట్రైనెట్‌న్యూస్,సెప్టెంబర్ 30:

తెలుగు సినీ పరిశ్రమకు వెన్నెముకగా భావించే 24 క్రాఫ్ట్స్ కార్మిక సంఘాల వ్యవస్థలో అంతర్గత పోరు రచ్చకెక్కింది. ఫిలిం ఫెడరేషన్‌లోని అధికార వ్యవహారశైలి, టాలీవుడ్ ఫిలిం ఎంప్లాయిస్ ఫెడరేషన్ (తెలుగు ఫిలిం వర్కర్స్ ఫెడరేషన్) అధ్యక్షుడిగా వల్లభనేని అనిల్ అక్రమాలు, యూనియన్లలో జోక్యం, ఎన్నికల ప్రక్రియ, కార్మికుల హక్కులు, చిత్రపురి హౌసింగ్ సొసైటీ వ్యవహారాలపై తీవ్ర ఆరోపణలు ఒక్కసారిగా తెరపైకి వచ్చాయి. ఒకవైపు ఫెడరేషన్‌పై నియంతృత్వ పోకడల ఆరోపణలు వినిపిస్తుండగా.. మరోవైపు చిత్రపురి హౌసింగ్ సొసైటీకి సంబంధించిన ఆర్థిక వ్యవహారాలు, సభ్యత్వాలు, ఇళ్ల కేటాయింపులు, విచారణ నివేదికలపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో సినీ కార్మిక సంఘాల ప్రతినిధులు తెలుగు ఫిలిం ఛాంబర్‌నుఆశ్రయించడంపరిశ్రమలోచర్చనీయాంశం గా మారింది.చిత్రపురి సాధన సమితి నాయకులు, 24 క్రాఫ్ట్స్--చిత్రపురి కాలనీ బాధితుల ప్రతినిధులు, తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ ఫిల్మ్ వింగ్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రతినిధులు, తెలంగాణ సినిమా వేదిక సభ్యులు తదితరులు కలిసి తెలుగు ఫిలిం ఛాంబర్ సెక్రటరీ అశోక్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఫెడరేషన్‌లో జరుగుతున్నాయని వారు ఆరోపిస్తున్న పరిణామాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని, చిత్రపురి వ్యవహారాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ తీవ్రంగా మండిపడ్డారు. ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షుడిగా వల్లభనేని అనిల్ అక్రమాలపై కేసులు పెట్టి జైలులో పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఇలాంటి మోసగాళ్లను వదిలిపెట్టకూడదన్నారు.

'24 క్రాఫ్ట్స్‌ను గుప్పిట్లో పెట్టుకునే ప్రయత్నం'

డైరెక్టర్స్ అసోసియేషన్ మాజీ సెక్రటరీ మద్దినేని రమేష్ చేసిన వ్యాఖ్యలు ఈ వ్యవహారాన్ని మరింత తీవ్రంగా మార్చాయి. 24 కార్మిక సంఘాలతో కూడిన ఫెడరేషన్‌లో ఒక వ్యక్తి ఆధిపత్యం పెరుగుతోందని ఆయన ఆరోపించారు. డ్యాన్సర్స్ యూనియన్, మహిళా వర్కర్స్ యూనియన్, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ మేనేజర్స్ యూనియన్ వంటి పలు సంఘాల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ, వాటిలో విభేదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఫెడరేషన్ ఎన్నికలు, యూనియన్ ఎన్నికల సమయంలో డబ్బు, ఓట్ల వ్యవహారం జరుగుతోందని ఆయన ఆరోపించారు. తనకు అనుకూలంగా లేని వర్గాలను బలహీనపరిచి, అనుకూల వ్యక్తులను వివిధ సంఘాల్లోకి తీసుకురావడం ద్వారా మొత్తం ఫెడరేషన్‌ను ఆధీనంలోకి తెచ్చుకునే ప్రయత్నం జరుగుతోందని పేర్కొన్నారు.

'ఫెడరేషన్‌కు 26 వేల మంది కార్మికులు.. నిర్ణయాలు కొందరి చేతుల్లోనా?'

24 క్రాఫ్ట్స్‌లో సుమారు 26 వేల మంది కార్మికుల ప్రయోజనాలు ముడిపడి ఉన్నాయని ప్రతినిధులు పేర్కొన్నారు. ఇంత పెద్ద వ్యవస్థలో ప్రజాస్వామ్యబద్ధమైన విధానం, యూనియన్ల స్వతంత్రత, కార్మికుల హక్కులు కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత ఫెడరేషన్ నాయకత్వం అన్ని యూనియన్లను సమన్వయం చేయాల్సి ఉండగా, విభేదాలు సృష్టించడం, ప్రత్యర్థి వర్గాలతో చేతులు కలపడం, బైలాస్‌కు విరుద్ధంగా వ్యవహరించడం వంటి ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి.

**చిత్రపురిపై రూ.110 కోట్ల స్కామ్ ఆరోపణలు!**

చిత్రపురి సాధన సమితి ప్రతినిధి కస్తూరి శ్రీనివాస్ చిత్రపురి హౌసింగ్ సొసైటీ వ్యవహారాలపై తీవ్ర ఆరోపణలు చేశారు. గతంలో జరిగిన విచారణ నివేదికల్లో సుమారు రూ.110 కోట్ల మేర ఆర్థిక అవకతవకలు జరిగినట్లు పేర్కొన్నారని ఆయన తెలిపారు. 2020--2025 కాలానికి సంబంధించి మరో విచారణ నివేదిక కూడా సిద్ధమైందని, అందులోని వివరాలను పూర్తిగా బహిర్గతం చేయలేదని ఆరోపించారు. విచారణ నివేదిక బయటకు వచ్చిన తర్వాత నిర్దిష్ట కాలవ్యవధిలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించాల్సి ఉన్నప్పటికీ అది జరగలేదని పేర్కొన్నారు. అయితే ఈ రూ.110 కోట్లకు సంబంధించిన ఆరోపణలు సంబంధిత విచారణ పత్రాలు, అధికారిక నివేదికల ఆధారంగా స్వతంత్రంగా నిర్ధారించాల్సి ఉంది.

సభ్యత్వాలు.. ఓటర్ల జాబితాపైనా తీవ్ర ఆరోపణలు

చిత్రపురి హౌసింగ్ సొసైటీలో సభ్యత్వాలు, ఓటర్ల జాబితా, ఇళ్ల కేటాయింపులు, రిజిస్ట్రేషన్ల విషయంలో కూడా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. సుమారు 1,300 మంది నాన్-మెంబర్ల అంశాన్ని గత న్యాయపరమైన వ్యవహారాలతో ముడిపెట్టి కస్తూరి శ్రీనివాస్ ప్రశ్నించారు. అర్హత, సభ్యత్వం, కేటాయింపు ప్రక్రియపై పూర్తిస్థాయిలో పరిశీలన జరిపిన తర్వాతే రిజిస్ట్రేషన్లు, ఇళ్ల కేటాయింపులు జరగాలని ఆయన డిమాండ్ చేశారు.

**డ్యాన్సర్స్ యూనియన్ వివాదం కూడా ముదిరింది**

ఇదే సమయంలో డ్యాన్సర్స్ యూనియన్ వ్యవహారం కూడా వివాదానికి కేంద్రంగా మారింది. తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు వి.వి. సుమలతా దేవి ఫిలిం ఫెడరేషన్ వైఖరిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ కుమార్, కార్యదర్శి రాయపల్లి ప్రసాద్‌లు తమ యూనియన్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని ఆమెఆరోపించారు.యూనియన్‌లోజరుగుతున్నాయని తాము ఆరోపిస్తున్న అవకతవకలను ప్రశ్నించినందుకే తమపై కక్షసాధింపు చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. 30 ఏళ్ల తర్వాత తొలిసారిగా మహిళా అధ్యక్షురాలిగా ఎన్నికైన తనను ప్రశాంతంగా పనిచేయనివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆమె ఆరోపించారు. జానీ మాస్టర్‌పై విధించిన నాన్-కోఆపరేషన్/సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కూడా డిమాండ్ చేశారు.

**'ఫెడరేషన్‌లో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి'**

ఫెడరేషన్‌లో వ్యక్తిగత ఆధిపత్యం కాకుండా 24 క్రాఫ్ట్స్‌లోని అన్ని సంఘాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని ప్రతినిధులు కోరారు. యూనియన్ల అంతర్గత సమస్యలను సంబంధిత సంఘాల పరిధిలోనే పరిష్కరించాలని, ఫెడరేషన్ స్థాయిలో పారదర్శక విధానాన్ని పాటించాలని డిమాండ్ చేశారు. ఫిలిం ఛాంబర్, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సినిమాటోగ్రఫీ శాఖ, సహకార శాఖతో పాటు సంబంధిత అధికార సంస్థలు ఈ ఆరోపణలపై సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని వారు కోరారు.

'విచారణ జరిపితే వాస్తవాలు బయటకు వస్తాయి'

చిత్రపురి హౌసింగ్ సొసైటీకి సంబంధించిన భూములు, సభ్యత్వాలు, ఓటర్ల జాబితా, ఇళ్ల కేటాయింపులు, రిజిస్ట్రేషన్లు, నిధుల వినియోగం వంటి అంశాలపై సమగ్ర ఆడిట్, విచారణ అవసరమని ప్రతినిధులు పేర్కొన్నారు. తాము అధికారులకు, వివిధ ప్రభుత్వ సంస్థలకు ఇప్పటికే పలు ఫిర్యాదులు, వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. సంబంధిత పత్రాలు, విచారణ నివేదికలు, కోర్టు ఆదేశాలను పరిశీలించి వాస్తవాలను బహిర్గతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో చిత్రపురి సాధన సమితి ప్రతినిధి డా. కస్తూరి శ్రీనివాస్, డైరెక్టర్స్ అసోసియేషన్ మాజీ సెక్రటరీ మద్దినేని రమేష్, తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు వి.వి. సుమలతా దేవి, పలు సినీ సంఘాల ప్రతినిధులు హేమ జిల్లోజు, కలగారా సుధీర్, భీమ్ రెడ్డి గుర్రం రాజు, ఉస్మానియా నగేష్, శివ శంకర్ పటేల్, తోట హరిత, తడివేలు తదితరులు పాల్గొన్నారు.

**ఇప్పుడు ఫిలిం ఛాంబర్ నిర్ణయంపైనే దృష్టి**

24 క్రాఫ్ట్స్ ఫెడరేషన్ వ్యవహారం, డ్యాన్సర్స్ యూనియన్ వివాదం, చిత్రపురి హౌసింగ్ సొసైటీ ఆరోపణలు ఒకేసారి తెరపైకి రావడంతో తెలుగు సినీ పరిశ్రమలో ఈ అంశం చర్చనీయాంశమవుతోంది. బాధితులు, కార్మిక సంఘాల ప్రతినిధులు సమర్పించిన వినతిపత్రంపై తెలుగు ఫిలిం ఛాంబర్ ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది ఇప్పుడు కీలకంగా మారింది.

--

# ప్రముఖ నటుడు నాగమహేశ్ చేతుల మీదుగా వైభవంగా 'వేల్' సినిమా ట్రైలర్ లాంచ్



హైదరాబాద్:ట్రైనెట్‌న్యూస్,సెప్టెంబర్ 30:

రవిచంద్ర, ఆదిత్య, అమృత శ్రీవాత్సవ, రాధిక రామ్ హీరో హీరోయిన్స్ గా నటిస్తున్న సినిమా 'వేల్'. ఈ చిత్రాన్ని క్షత్రియ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ప్రొడ్యూసర్ జి. అశోక్ (రాజు), వై మురళి(రాజు) నిర్మిస్తున్నారు. డైరెక్టర్ నాగేంద్ర ఆవుల రూపొందిస్తున్నారు. వచ్చే నెలలో 'వేల్' సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. మంగళవారం హైదరాబాద్ లో జరిగిన ఈవెంట్ లో ఈ చిత్ర ట్రైలర్ ను ప్రముఖ నటుడు నాగమహేశ్ చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో

మ్యూజిక్ డైరెక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ – ఈ సినిమా మొత్తం గోవాలో చిత్రీకరించారు. ప్రతి సీన్ ఎక్కడా ల్యాగ్ లేకుండా వెళ్తూ మనల్ని ఎంటర్ టైన్ చేస్తుంది. ఈ కథలో అనేక కోణాలు ఉన్నాయి. స్టోరీలోని ఎలిమెంట్స్ అన్నీ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటాయి. ఈ సినిమాకు మంచి మ్యూజిక్ చేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది. అన్నారు.

హీరోయిన్ అమృత శ్రీవాత్సవ మాట్లాడుతూ – నేను మిస్ ఇండియా విన్నర్ అయ్యాక మిస్ వరల్డ్ పోటీలకోసం సన్నద్ధమవుతూ వచ్చాను. ఆ క్రమంలో ఈ సినిమా ఆఫర్ వచ్చింది. నాకు దక్షిణాది చిత్రాలు అంటే ఇష్టం. ఇక్కడి నుంచి మంచి మంచి మూవీస్ వస్తున్నాయి. ఇలాంటి ఇండస్ట్రీలో నేనూ భాగమవ్వాలని కోరుకున్నా. ఈ చిత్రంలో నాయికగా నటించే అవకాశం దక్కడం సంతోషంగా ఉంది. ప్రతి ఒక్కరూ ఈ సినిమా కోసం కష్టపడి పనిచేశారు. మంచి కంటెంట్ ఉన్న సినిమా చేశారు. త్వరలోనే మా మూవీ మీ ముందుకు రాబోతోంది. మీ అందరి సపోర్ట్ ఉంటుందని కోరుకుంటున్నాం. అన్నారు.

హీరో రవిచంద్ర మాట్లాడుతూ – మా మూవీ ట్రైలర్ మీకు నచ్చిందని నమ్ముతున్నాం. మాది స్ట్రాంగ్ కంటెంట్ ఉన్న మూవీ. హిట్ కొడుతున్నాం అనే నమ్మకం మాలో ఉంది. ఈ సినిమాలో యాక్షన్ , రొమాన్స్ తో పాటు అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఉంటాయి. ఈ సినిమాను డే అండ్ నైట్ షెడ్యూల్స్ లో మా డైరెక్టర్ గారు కష్టపడి రూపొందించారు. ఈ సినిమా మా టీమ్ అందరికీ మంచి పేరు తేవాలని కోరుకుంటున్నా. అన్నారు.

హీరో ఆదిత్య మాట్లాడుతూ – ఒక మనిషి తనకు కావాల్సిన పనులు చేయించుకోవడం కోసం ఎలాంటి మసుగులు వేసుకుని ప్రవర్తిస్తున్నాడు అనే పాయింట్ తో మా డైరెక్టర్ ఈ చిత్రాన్ని ఆద్యంతం ఆసక్తికరంగా తెరకెక్కించాడు. ఈ సినిమా చూస్తున్నంతసేపు నెక్ట్స్ సీన్ ఎం జరుగుతుంది అనేది ఊహించలేం. సినిమా మంచి పేస్ తో వెళ్తూ ఎంటర్ టైన్ చేస్తుంది. ఇలాంటి మంచి మూవీలో నటించే అవకాశం రావడం హ్యాపీగా ఫీలవుతున్నా. అన్నారు.

ప్రొడ్యూసర్ జి. అశోక్ కుమార్ మాట్లాడుతూ – మా సినిమా ట్రైలర్ ఎంత బాగుందో సినిమా అంతకంటే బాగుంటుంది. మా మూవీ ట్రైలర్ కు మీరు ఇస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే సంతోషంగా ఉంది. మంచి సస్పెన్స్, రొమాన్స్, యాక్షన్ అన్నీ ఉన్న చిత్రమిది. యూత్ తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్ ను ఆకట్టుకుంటుంది. వచ్చే నెలలో మా చిత్రాన్ని రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నాం. అన్నారు.

డైరెక్టర్ నాగేంద్ర మాట్లాడుతూ – మా మూవీ ఇంత బాగా రావడానికి మా ప్రొడ్యూసర్ కారణం. ఆయన ఇచ్చిన సపోర్ట్ వల్లే కథను బాగా తెరకెక్కించగలిగాం. ఈ సినిమాకు ఏం కావాలన్నా ఆయన సమకూర్చారు. మా సినిమా ప్రేక్షకులకు ఒక సరికొత్త ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. మా టీమ్ అంతా కంప్లీట్ గా సపోర్ట్ చేసి క్వాలిటీ మూవీ చేసేందుకు కష్టపడ్డారు. మా హీరోలు, హీరోయిన్ ఇతర టీమ్ అందరికీ థ్యాంక్స్ చెబుతున్నా. అన్నారు.

నటుడు నాగమహేశ్ మాట్లాడుతూ – ప్రొడ్యూసర్ అశోక్ కుమార్ గారు ఈ చిత్రాన్ని ప్యాషనేట్ గా నిర్మించారు. ఆయనలాంటి నిర్మాతలు ఇప్పుడు ఇండస్ట్రీకి అవసరం. ఇద్దరు యంగ్ ఎనర్జిటిక్ హీరోలు రవితేజ, ఆదిత్య ఈ చిత్రంలో నటించారు. మిస్ ఇండియా అమృత హీరోయిన్ గా మనల్ని ఆకట్టుకోనుంది. ట్రైలర్ చాలా బాగుంది. హీరో హీరోయిన్స్ బాగా నటించారు. డైరెక్టర్ నాగేంద్ర పగలూ రాత్రీ షెడ్యూల్స్ లో తక్కువ టైమ్ లో ఈ చిత్రాన్ని క్వాలిటీగా నిర్మించారని తెలిసింది. ఈ సినిమా టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్ చెబుతున్నా. అన్నారు.

నటీనటులు – రవిచంద్ర, ఆదిత్య, అమృత, రాధికా రామ్, ముని కుమార్, సురేష్ మరియన్న, శివుంభైర కొడియాల, వంశీరాజ్, శివానందన్, జి.ఉమేష్

టెక్నీషియన్స్
ఎడిటర్ – భాను
డీవోపీ – సాయి శ్రీరామ్
మ్యూజిక్ – వెంకటేష్
ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ – వంశీ రాజు
ప్రొడ్యూసర్స్ – జి. అశోక్(రాజు), వై.మురళి (రాజు)
స్క్రిప్ట్, డైరెక్షన్ – నాగేంద్ర ఆవుల
పీఆర్ఓ – బి. వీరబాబు

# చికిత తానిపర్తి అభినందనలు తెల్పిన సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 30:**
జపాన్‌లో జరుగుతున్న ఆసియా క్రీడలు 2026లో మిక్స్‌డ్ కాంపౌండ్ ఆర్చరీలో అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించడమే కాకుండా 2028లో లాస్ ఏంజెల్స్‌లో జరగబోయే ఒలింపిక్స్‌లో పాల్గొనడానికి అర్హత సాధించిన తెలంగాణ ముద్దుబిడ్డ చికిత తానిపర్తితో పాటు సాహిల్ జాదవ్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శుభాభినందనలు తెలిపారు.ఆసియా క్రీడల్లో ఒకేరోజు రెండు స్వర్ణ పతకాలు సాధించి తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తంగా చేసిన ఆర్చరీ క్రీడాకారిణి చికిత రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. పెద్దపల్లికి చెందిన తానిపర్తి చికిత ప్రతిభను గుర్తించి ఆమెను వెన్నంటి ప్రోత్సహించిన తల్లిదండ్రులు, కోచ్‌లను ముఖ్యమంత్రి గారు అభినందించారు.కాంపౌండ్ ఉమెన్స్ టీమ్ విభాగంలో స్వర్ణ పతకం సాధించడంతో పాటు మిక్స్‌డ్ టీమ్ విభాగంలో సాహిల్ జాదవ్‌తో కలిసి దక్షిణ కొరియాపై విజయం సాధించి స్వర్ణ పతకం కైవసం చేసుకున్న చికిత పేరు తెలంగాణ క్రీడారంగ చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. చికిత నిరంతర సాధన, పట్టుదల, దృఢసంకల్పంతో సాధించిన ఈ విజయం క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు.

# ఇండియన్ బ్యాంక్ రిటైరీల సంఘం రజతోత్సవ వేడుకలు

## ముఖ్య అతిథిగా ఇండియన్ బ్యాంక్ మాజీ ఎండీ, సీఈవో పద్మజా చుండూరు

**విశిష్ట అతిథిగా సినీ నటుడు తనికెళ్ల భరణి**
**జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు ప్రత్యేక ప్రదర్శన**




**హైదరాబాద్, సెప్టెంబర్ 30 (ట్రైనెట్ న్యూస్):**
ఇండియన్ బ్యాంక్ రిటైరీల సంఘం (ఐబీఆర్ఏ), హైదరాబాద్ఆధ్వర్యంలో వ్యవస్థాపక దినోత్సవం, రజతోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కాచిగూడలోని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ప్రాంగణంలోని మాడం అంజయ్య మెమోరియల్ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమం జరిగింది.
ఐబీఆర్ఏ25సంవత్సరాలసేవలనువిజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకలను ఇండియన్ బ్యాంక్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో పద్మజా చుండూరు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి విశిష్ట అతిథిగా పాల్గొని తన ప్రసంగంతో సభ్యుల్లో స్ఫూర్తి నింపారు.గౌరవ అతిథులుగా ఇండియన్ బ్యాంక్ హైదరాబాద్ ఎఫ్‌జీఎం ఎం. శ్రీరామచంద్రబాబు, కిమ్స్--రెనోవా క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ చీఫ్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ పి.ఎస్. దత్తాత్రేయ, ఇండియన్ బ్యాంక్ హైదరాబాద్ జోనల్ మేనేజర్ కె. శ్రీనివాస్, మల్కాజిగిరి జోనల్ మేనేజర్ కె. సాయిప్రసాద్ పాల్గొన్నారు.ప్రముఖ కవి, సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు ప్రత్యేక ప్రదర్శనలో భాగంగా కవిత్వం, హాస్య పేరడీలతో సభికులను అలరించారు. ఆయన ప్రదర్శన కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
ఈ సందర్భంగా సంఘం పాతికేళ్ల ప్రస్థానాన్ని, విశ్రాంత బ్యాంకు ఉద్యోగుల సంక్షేమానికి చేపట్టిన కార్యక్రమాలను వక్తలు గుర్తుచేశారు. సభ్యుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, ఆరోగ్య--సంక్షేమ అంశాల్లో ఐబీఆర్ఏ చేస్తున్న సేవలను అభినందించారు. భవిష్యత్తులోనూ సభ్యుల మధ్య ఐక్యతను బలోపేతం చేస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. రజతోత్సవాన్ని పురస్కరించుకుని సంఘం సభ్యులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

# ప్రజాపాలన--2 ప్రభుత్వం ఖాయం: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 30:**
రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి వచ్చి ప్రజాపాలన--2 ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. సిరిసిల్లలో నిర్వహించిన 'ప్రజాపాలన ప్రగతి బాట' బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.
వేములవాడ రాజన్న సాక్షిగా చెబుతున్నానని, యూపీఏ-1, యూపీఏ-2 ప్రభుత్వాల మాదిరిగానే సీఎం రేవంత్ రెడ్డి--తన సారథ్యంలో ప్రజాపాలన ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తుందని అన్నారు. "వచ్చే ఎన్నికల్లో ప్రజాపాలన--2 ప్రభుత్వాన్ని సాధించి తీరుతాం" అని స్పష్టం చేశారు. సిరిసిల్లలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని పేర్కొంటూ, "కేటీఆర్ రాసి పెట్టుకో.. మళ్లీ ఎమ్మెల్యేగా గెలవడం కల్ల" అని వ్యాఖ్యానించారు. రాజుల కాలానికి, దోపిడీ చేసిన దొరల రాజ్యాలకు కాలం చెల్లిందన్నారు. 2023లో అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతులు, కార్మికులు, నేతన్నలు, గీత కార్మికులు సహా అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సిరిసిల్లలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.
కేటీఆర్ ఆస్తులు ప్రతి ఎన్నికల అఫిడవిట్‌లో పెరుగుతున్నాయని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. కేటీఆర్‌కు సంబంధించిన ఆస్తులపై ఆయన సోదరి కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. సిరిసిల్లలో జరిగిన నేరెళ్ల ఘటనను ప్రజలు మరిచిపోలేదన్నారు. దళితులపై జరిగిన అఘాయిత్యాల విషయంలో కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు పలుమార్లు సిరిసిల్లలో పర్యటించి ప్రశ్నించారని పేర్కొన్నారు. గత పదేళ్లలో సంపాదించిన సొమ్ముతో సోషల్ మీడియా వ్యవస్థను నడుపుతూ అసత్య ప్రచారాలు చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలపై ఆరోపణలు చేశారు. సోషల్ మీడియాలో వస్తున్న కథనాలను చూసి కేసీఆర్, హరీశ్‌రావు భ్రమల్లో ఉన్నారని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు తిరిగి అధికారంలోకి వస్తామని కలలు కనవద్దని సూచించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన పరిణామాలను ప్రజలు మరిచిపోలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కులగణన నిర్వహించి దాని వివరాలను డాక్యుమెంట్ చేశామని తెలిపారు. ఈటల రాజేందర్, రాజయ్య వంటి నేతలను బీఆర్ఎస్ నుంచి ఎలా బయటకు పంపించారో ప్రజలు చూశారని అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి--డి శ్రీనివాస్ జోడీ తరహాలో రేవంత్ రెడ్డి--తన జోడీ కాంగ్రెస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకు వస్తుందని స్పష్టం చేశారు. 2034 వరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండేలా ప్రజల మద్దతుతో పనిచేస్తామని మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు.

# పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా - లింగంపర్తి ఎస్ఎంసి

## నూతన చైర్మన్ నడికట్ల వెంకన్న




**ఏలేశ్వరం ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 30:**
ఏలేశ్వరం మండలంలింగంపర్తి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన పాఠశాల తల్లిదండ్రుల కమిటీ (ఎస్.ఎం.సి) ఎన్నికలు ఉత్సాహభరితంగా జరిగాయి.ఈ ఎన్నికల్లో ఎస్.ఎం.సి చైర్మన్ గా నడికట్ల వెంకన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్ గా పితాని లీలా జ్యోతి ఎన్నికయ్యారు. ఎన్నికల అనంతరం నూతన కమిటీని పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఘనంగా అభినందించారు.ఈ సందర్భంగా నూతన చైర్మన్ నడికట్ల వెంకన్న మాట్లాడుతూ - తనపై నమ్మకంతో చైర్మన్ గా ఎన్నుకున్న తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడం, మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షణలో తన వంతు బాధ్యతగా పని చేస్తానని హామీ ఇచ్చారు.ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో అవసరమని, అందరినీ కలుపుకుని వెళ్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, చిక్కాల లక్ష్మణరావు, వరుపుల సాయికిరణ్, వరుపుల అప్పనపల్లి, ఈశ్వరరావు, పడాల అఖిల్, బుల్ రాజు, ఎస్ఎంసి సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గేమింగ్, వీఎఫ్ఎక్స్, యానిమేషన్ రంగాలకు జాతీయ, అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు

**తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో ప్రత్యేక కార్యక్రమాలు:**
**సీఎస్ సంజయ్ జాజు**



**హైదరాబాద్,ట్రైనెట్‌న్యూస్,సెప్టెంబర్ 30:**
ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు హైదరాబాద్ నగరాన్ని గేమింగ్, వీఎఫ్ఎక్స్, యానిమేషన్ రంగాలకు జాతీయ, అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు.
డిసెంబర్‌లో హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై బుధవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సీఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి సహా పలువురు ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. యానిమేషన్, గేమింగ్, వీఎఫ్ఎక్స్, కామిక్ తదితర క్రియేటివ్, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాల్లో ప్రపంచ ప్రసిద్ధ సంస్థలను హైదరాబాద్‌కు ఆకర్షించి, తమ కేంద్రాలను రాష్ట్రంలో ఏర్పాటు చేసేలా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు.
"కథలు -- ఆటలు -- కలలు" అనే థీమ్‌తో యువతను ఆకర్షించేలా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సీఎస్ వెల్లడించారు. ఇందులో భాగంగా కామిక్, గేమింగ్, వీఎఫ్ఎక్స్ బిజినెస్ డే నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే కామిక్ కాన్, డ్రీమ్‌హాక్, ఇండియా గేమ్ ఉత్సవ్ వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా బీ2బీ ఎక్స్‌పో, ఇన్నోవేషన్ జోన్, యానిమేషన్ స్టాళ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆయా రంగాల్లోని సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆవిష్కరణలు, పెట్టుబడి వ్యాపార అవకాశాలను ప్రదర్శించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఇప్పటికే సుమారు 50 పెద్ద, 150 వరకు మధ్యతరహా యానిమేషన్, గేమింగ్ సంస్థలు ఉన్నాయని సీఎస్ తెలిపారు. మరిన్ని అంతర్జాతీయ సంస్థలను హైదరాబాద్‌కు ఆకర్షించడంతో పాటు, ఈ అభివృద్ధి చెందుతున్న రంగాల్లో రాష్ట్ర యువతకు విస్తృత అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.
తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో ఏర్పాటు చేసే కార్యక్రమాలు, ఎక్స్‌పోలు, స్టాళ్లను నగరంలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ప్రత్యక్షంగా సందర్శించేలా చర్యలు తీసుకుంటున్నట్లు సీఎస్ తెలిపారు. సుమారు 70 కళాశాలలకు చెందిన విద్యార్థులతో పాటు దాదాపు 50 వేల మంది సందర్శకులు ఈ కార్యక్రమాలను సందర్శించేలా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.
యువతలో సృజనాత్మకత, నైపుణ్యాలను ప్రోత్సహిస్తూ హైదరాబాద్ నగరాన్ని గ్లోబల్ క్రియేటివ్ ఎంటర్‌టైన్‌మెంట్ పరిశ్రమలకు కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సీఎస్ సంజయ్ జాజు తెలిపారు.

# భారత నౌకాదళ వ్యూహాత్మక పాత్ర మరింత కీలకం

## నౌకాదళ కమాండర్ల సదస్సులో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

**ఆధునిక యుద్ధంలో సాంకేతిక పరివర్తన, సమాచార భాగస్వామ్యం అవసరం: సీడీఎస్**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30 (ట్రైనెట్ న్యూస్):**
భారత నౌకాదళ కమాండర్ల రెండో సదస్సు--2026 న్యూఢిల్లీలోని నౌసేన భవన్‌లో ప్రారంభమైంది. సెప్టెంబర్ 29న ప్రారంభమైన ఈ మూడు రోజులసదస్సులోనౌకాదళ సీనియర్ అధికారులు, ఆపరేషనల్, ఏరియా కమాండర్లు పాల్గొని కార్యాచరణ సంసిద్ధత, సముద్ర భద్రత, భవిష్యత్ సామర్థ్యాలఅభివృద్ధిపై సమగ్రంగా చర్చిస్తున్నారు.
భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ ప్రారంభోపన్యాసం చేస్తూ ప్రస్తుత సముద్రభద్రతాపరిస్థితులు, నౌకాదళ కార్యాచరణ స్థితిని సమీక్షించారు. సముద్ర రంగంలో ప్రస్తుతం ఎదురవుతున్న, భవిష్యత్‌లో తలెత్తే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు అత్యున్నత స్థాయియుద్ధసంసిద్ధత,చురుకుదనం,వేగవంతమైన ప్రతిస్పందన సామర్థ్యాన్ని కొనసాగించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వేగంగా అందిపుచ్చుకోవడంతోపాటు నౌకాదళ సామర్థ్యాలను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు.
సదస్సును ఉద్దేశించి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ సముద్ర రంగంలో భారత్ బాధ్యతలు వ్యూహాత్మకంగా విస్తరిస్తున్నాయని తెలిపారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో అత్యవసర పరిస్థితులకు ముందుగా స్పందించే శక్తిగా, విశ్వసనీయ భద్రతా భాగస్వామిగా భారత నౌకాదళం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. సముద్ర నిఘా వ్యవస్థలు, విశ్లేషణ సామర్థ్యం, కార్యాచరణ ప్రతిస్పందనను మరింత బలోపేతం చేయాలని సూచించారు.
పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులను ప్రస్తావించిన రాజ్‌నాథ్ సింగ్, భారత నౌకాదళం చేపట్టిన 'ఆపరేషన్ ఊర్జా సురక్ష' దేశ ఇంధన భద్రతను కాపాడటంలో ముఖ్యమైన పాత్ర పోషించిందన్నారు.రక్షణ రంగంలో ఆత్మనిర్భరత, స్వదేశీ సామర్థ్యాల అభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. సురక్షితమైన సముద్రాలు దేశ భద్రతకు, వికసిత భారత్ లక్ష్య సాధనకు అత్యంత కీలకమని స్పష్టం చేశారు.
చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణి మాట్లాడుతూ భారత నౌకాదళం దేశానికి వ్యూహాత్మక శక్తిని పెంచే కీలక దళమని ప్రశంసించారు. సాంకేతిక పరిజ్ఞానం స్వీకరణ, ఆత్మనిర్భరత సాధన, దేశ ఇంధన భద్రత పరిరక్షణకు నౌకాదళం చేస్తున్న నిరంతర కృషిని అభినందించారు.
ఆధునికయుద్ధస్వరూపం వేగంగా మారుతోందని, అందుకు అనుగుణంగా సాంకేతిక పరివర్తనను వేగవంతం చేయాలని సీడీఎస్ సూచించారు. సాయుధ దళాల మధ్య నిరంతర సమాచార భాగస్వామ్యం, సమన్వయం, ప్రతికూల పరిస్థితులను తట్టుకునే సామర్థ్యం పెరగాలని తెలిపారు. త్రివిధ దళాల మధ్య సంయుక్త కార్యాచరణ, సమగ్ర అనుసంధానం మరింత బలోపేతం కావాల్సిన అవసరాన్ని వివరించారు.
భారత సైన్యాధిపతి జనరల్ ధీరజ్ సేథ్ కూడా నౌకాదళ కమాండర్లతో సమావేశమై ప్రస్తుత భద్రతా పరిస్థితులపై తన అభిప్రాయాలను పంచుకున్నారు.త్రివిధదళాల మధ్య సమన్వయం, పరస్పర కార్యాచరణ సామర్థ్యం, నూతన భద్రతా సవాళ్లకు సమగ్ర ప్రతిస్పందనలను మరింత బలోపేతం చేయడంపై చర్చించారు. సంయుక్త సంసిద్ధతను పెంచేందుకు దళాల మధ్య కార్యాచరణ అనుభవాలు, పాఠాలను నిరంతరం పంచుకోవాలని సమావేశం అభిప్రాయపడింది.
మూడు రోజుల సదస్సులో నౌకాదళ కార్యకలాపాలు, యుద్ధ సామగ్రి, రవాణా--సరఫరా వ్యవస్థలు, మానవ వనరులు, శిక్షణ, దళాల అభివృద్ధి, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాల వినియోగంపై విస్తృతంగా చర్చించనున్నారు. దళాల సంఖ్యను సమర్థంగా వినియోగించడం, యుద్ధ సంసిద్ధతను బలోపేతం చేయడం, సామర్థ్యాల అభివృద్ధిని వేగవంతం చేసే చర్యలను కూడా సమీక్షించనున్నారు.

# ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం కల్పించడం ఈసీ బాధ్యత: డిప్యూటీ సీఎం భట్టి




**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 30:**
ఎన్నికలుస్వేచ్ఛగా, నిష్పాక్షికంగా, పారదర్శకంగా జరగాలని, ఎన్నికల సంఘం పక్షపాత వైఖరిపై ప్రజల్లో అనుమానాలున్నాయని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఎస్ఐఆర్‌పై ప్రజల్లో ఉన్న అనుమానాలను ఈసీ నివృత్తి చేయాలన్నారు. ఓట్ల తొలగింపుపై ఎన్నికల సంఘం పారదర్శకంగా సమాధానం చెప్పాలన్నారు. వేలాది ఓట్ల తొలగింపు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపుతుందన్నారు. ఎన్నికల వ్యవస్థపై అనుమానాలు తొలగించడం ఈసీ బాధ్యత అని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. బ్యాలెట్ పేపర్‌పై ప్రజల్లో ఉన్న డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు గెలవొచ్చు.. ఓడిపోవచ్చు.. వ్యవస్థపై ప్రజల నమ్మకం ముఖ్యం అని చెప్పారు. తెలంగాణ సంక్షేమ పథకాలను 'ఫ్రీబీస్'గా చూడొద్దు అన్నారు. ?కొచ్చిలో 'ఇండియా టుడే సౌత్ కాన్క్లేవ్'లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం వేగంగా అమలు చేస్తున్నామని, తొలిదశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించామని వివరించారు. మరో 2 లక్షల ఇందిరమ్మ ఇళ్లకు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచి అమలు చేస్తున్నామని చెప్పారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలులో ఉందని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌తో 53 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. మంచి విద్యతో నాణ్యమైన మానవ వనరులను తయారు చేయవచ్చని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు సమాఖ్య స్ఫూర్తితో న్యాయం చేయాలని,రాష్ట్రాలు దేశానికి అందిస్తున్న సహకారాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. జీఎస్టీ సమావేశాల్లోనూ దక్షిణాది రాష్ట్రాల అంశాన్ని ప్రస్తావించాని తెలిపారు.
రాష్ట్రాల మధ్య పోటీ ఆరోగ్యకరమైనదే అని స్పష్టం చేశారు. ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఫైనాన్షియల్ సిటీ, హైటెక్ సిటీ తెలంగాణకు బలం అని చెప్పారు. వైఎస్ రాజశేఖరరెడ్డితో కలిసి పనిచేసిన అనుభవం ఎప్పటికీ గుర్తుండిపోతుందని డిప్యూటీ సీఎం అన్నారు. వైఎస్ఆర్ మార్గనిర్దేశం కాంగ్రెస్ సిద్ధాంతాలపై నా నమ్మకాన్ని బలపరిచిందన్నారు.
కాంగ్రెస్‌ను వీడిన పాత నాయకులంతా తిరిగి పార్టీలోకి రావాలని కోరారు.
దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌ను వీడిన నాయకులకు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు.
తిరిగి కాంగ్రెస్‌లో చేరి దేశాన్ని బలోపేతం చేయడానికి కలిసి పనిచేద్దాం అని పిలుపునిచ్చారు.
రేవంత్‌రెడ్డితో 100 శాతం సఖ్యతతో కలిసి పనిచేస్తున్నామని..తామంతా చర్చించుకుని, ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు.
రాష్ట్రంలో కాంగ్రెస్ సిద్ధాంతాల అమలే మా లక్ష్యం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# రిమ్స్ అదిలాబాద్ ఘటనపై ఎన్సీపీసీఆర్ ప్రతినిధులతో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 29:**
రాష్ట్రీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్సీపీసీఆర్ ) ప్రతినిధులు తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (టీజీఎస్సీపీఆర్ ) చైర్‌పర్సన్ కోతకోట సీతా దయాకర్ రెడ్డి కమిషన్ సభ్యులతో సమావేశమయ్యారు.
ఈ సందర్భంగా రిమ్స్ , అదిలాబాద్‌లో జరిగిన నవజాత శిశువుల అగ్ని ప్రమాద ఘటనపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా ఈనెల 24 న టీజీఎస్సీపీఆర్ బృందం రిమ్స్ అదిలాబాద్‌ను సందర్శించిన సందర్భంగా చేపట్టిన పరిశీలనలు, బాధిత కుటుంబాలతో జరిపిన సంభాషణలు, ఆసుపత్రి అధికారులతో సమావేశం, చికిత్స పొందుతున్న చిన్నారుల పరిస్థితి తదితర అంశాలను ఎన్సీపీసీఆర్ ప్రతినిధులకు వివరించారు.ఈ సమావేశంలో చైర్‌పర్సన్ కోతకోట సీతా దయాకర్ రెడ్డి, గౌరవ సభ్యులు మర్రిపల్లి చందన, ప్రేమలత అగర్వాల్, వందనా గౌడ్, సరిత మరియు వచన్ కుమార్ బుర్కా పాల్గొన్నారు. పిల్లల భద్రత, ముఖ్యంగా ఆసుపత్రుల్లో నవజాత శిశువుల రక్షణకు సంబంధించిన భద్రతా ప్రమాణాలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందనా వ్యవస్థలు, ఫైర్ సేఫ్టీ ఇతర ముందస్తు జాగ్రత్తలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరంపై సమావేశంలో చర్చ జరిగింది.
ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో సమర్థవంతమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఇరు కమిషన్లు ప్రస్తావించాయి.

# విఖ్యాత గాయని సుశీల స్వర సామ్రాజ్ఞి



**హైదరాబాద్, రవీంద్రభారతి, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:**
విఖ్యాత నేపథ్య గాయని డాక్టర్ పి సుశీల లను గాంధీ స్ఫూర్తి పురస్కారం తో పాటు స్వర సామ్రాజ్ఞి బిరుదుతో సత్కార సభ రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై శృతి లయ ఫౌండేషన్ సీల్ వెల్ కార్పొరేషన్. నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న శాసన మండలి సభ్యులు దాసోజు శ్రవణ్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్ సంఖ్యా శాస్త్ర వేత్త దైవజ్ఞ శర్మ తదితరులు తో సత్కరించి మాట్లాడారు సుశీల పాట తర తరాలు నిలిచి ఉంటుందని అన్నారు గాంధీ సత్య పవిత్రతకు ప్రతీక కాగా సుశీల శృతి పవిత్రతకు ప్రతీక గాంధీ వలెనే సుశీల మృదు భాషి మిత భాషి అని చెప్పి గాంధీ పురస్కారం ఆమెకు ప్రదానం చేయటం సముచితం అన్నారు అధ్యక్షత వహించిన పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్ మాట్లాడుతూ సుశీల దక్షిణ భారతం లోని అన్ని భాషలూ లో పాడారు అని చెప్పారు ఆమెకు కేంద్ర ప్రభుత్వం భారత రత్న అవార్డు ప్రకటించాలనీ కోరారు సుశీల మాట్లాడుతూ ప్రజల హృదయంలో తనకు తొమ్మిది పదుల వయసు పై పడినా ప్రజల హృదయాలలో నిలిచి ఉంటాం గొప్ప అవార్డ్ అన్నారు ఎందరో మహానుభావులు అడుగిడిన రవీంద్ర భారతి వేదిక కు అవార్డ్ ఇవ్వాలి అని అన్నారు ఇదే వేదికపై ఇటీవల ఏ సి పి గా పదవీ విరమణ చేసిన జితేందర్ రెడ్డి నీ అతిథులు సర్వీస్ ఐకాన్ అవార్డ్ తో సత్కరించారు వేదిక పై టి జి ఓ నాయకుడు శ్రీనివాస్ ముత్యాల హరి కిషన్ రత్నాకర్ గంగా ప్రసాద్ రహీమ్ తదితరులు పాల్గొన్నారు మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ప్రముఖ గాయనీ గాయకులు ఆమని సుభాష్ చంద్ర తేజ ఆంజనేయ శాస్త్రి అరుణ శ్రీదేవి శోభ తదితరులు మధురమైన పాటలు ఆలపించారు వీణా పాణి వేద ఆశీర్వాదం గాంధీ వ్యాఖ్యానం సందర్భోచితం గా ఉన్నాయి

# అలరించిన తెలుగు--హిందీ సినీ సంగీత విభావరి
# మధుర గీతాలతో ఆకట్టుకున్న గాయనీ గాయకులు



**హైదరాబాద్, సెప్టెంబర్ 30 (ట్రైనెట్ న్యూస్):**
శ్రీ శ్రేష్ట మ్యూజికల్ ఈవెంట్స్ సంస్థ అధ్యక్షురాలు, గాయని, వ్యాఖ్యాత శ్రీమతి సీత గరిమెళ్ల ఆధ్వర్యంలో ఈ నెల 22న హైదరాబాద్‌లోని చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో నిర్వహించిన తెలుగు--హిందీ సినీ సంగీత విభావరి సంగీతాభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. "మనసు కోవెలగా... మమతల మల్లెలుగా..." పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు గాయనీ గాయకులు పాత, కొత్త సినీ గీతాలను ఆలపించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు.
మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగిన ఈ సంగీత కార్యక్రమంలో తెలుగు, హిందీ చిత్రాలకు చెందిన సుమధుర గీతాలను కళాకారులు తమదైన శైలిలో ఆలపించారు. గాయకుల గాన ప్రతిభకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ప్రతి పాట ముగిసిన అనంతరం సభికుల కరతాళధ్వనులతో గానసభ ప్రాంగణం మార్మోగింది.
గాయకులు హేమ హారిక, అనురాధ, కృష్ణవేణి, శోభ, దుర్గతో పాటు సుబ్బారెడ్డి, భీమేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ, ఏవీఆర్ రత్నం, ఆనంద్, నరేంద్ర, వెంకటరెడ్డి తదితరులు తమ గానంతో అలరించారు. కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు కళాకారుల ప్రతిభను అభినందించారు. సంగీతంమనసుకుప్రశాంతతనుఅందించడంతోపాటు మానవ సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని వక్తలు పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా వర్ధమాన గాయనీ గాయకులకు మంచి వేదిక లభిస్తుందని తెలిపారు. కళలు, కళాకారులను ప్రోత్సహించేందుకు శ్రీ శ్రేష్ట మ్యూజికల్ ఈవెంట్స్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఈ కార్యక్రమాన్ని ట్రైనెట్ లైవ్ టీవీ, గానసభ టీవీ 1966 ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేశారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించినఅతిథులు,కళాకారులు,సంగీతాభిమానులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# అంతర్జాల వేదిక గా విఖ్యాత గాయకుడు బాల సుబ్రహ్మణ్యం వర్ధంతి




**న్యూయార్క్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:**
అమెరికా లోని న్యూ యార్క్ నగరం లో విఖ్యాత గాయకుడు పద్మ విభూషణ్ పురస్కార గ్రహీత ఎస్ పి బాలసుబ్రహ్మణ్యం అభిమానులు స్థాపించిన ఎస్ పి బి మ్యూజిక్ అకాడమీ నిర్వహణలో అంతర్జాల వేదిక గా బాల సుబ్రహ్మణ్యం అరవ వర్ధంతి నిర్వహించారు ప్రముఖ నటుడు రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ బాలు తెలుగు భాష తో పాటు తమిళ హిందీ కన్నడ మలయాళం తదితర భాషలో గానం చేసి ఆయా ప్రాంతాల వారు తమవాడే అనేంతగా పాటను తన గాన మాధుర్యం తో ఆవిష్కరించారు అని చెప్పారు ఆయనకు మృత్యువు తొందరలో వచ్చిందని ఇంకా కొంత కాలం ఉంటే తెలుగు భాషకు ఆయన పాట మాట ద్వారా ఎంతో మేలు జరిగేది అని పేర్కున్నారు వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు మాట్లాడుతూ ఘంటసాల తరువాత బాలు ఆయన స్థానం భర్తీ చేశారు అని బాలు తరువాత అంతటి గాయకుడు ఇంకా రాలేదు అని చెప్పారు ప్రముఖ గాయకులు రామా చారి నేమాని పార్థసారధి సందీప్ వినోద్ ధీరజ్ లు బాలు తో తమకు వున్న అనుబంధం గుర్తు చేసుకుని ఆయన పాటలను మధురం గా ఆలపించారు గీత రచయిత రస రాజు పాల్గొన్న కార్యక్రమానికి అకాడమీ అధ్యక్షుడు శ్రీనివాస్ గూడూరు సంస్థ కార్యక్రమాలు తెలిపారు చైర్మెన్ హారి ఇప్పనపల్లి స్వాగతం పలికగా బుర్ర రాజేశ్వరి సుజాత లావణ్య , శ్రీనివాస్ రెడ్డి రాము గేదెల చంద్ర రవి అయ్యగారి కుమారి రాణీ తదితరులు కార్యక్రమ నిర్వహణ చేశారు. వివిధ దేశాలకు చెందిన తెలుగు ప్రతినిధులు తమ సందేశాలు తెలిపారు

# ఘనంగా 'వెండితెర స్వర వైభవం'
# లైవ్ ఆర్కెస్ట్రాతో అలనాటి మధుర గీతాలు






**హైదరాబాద్, సెప్టెంబర్ 30 (ట్రైనెట్ న్యూస్):**
కాకినాడ మ్యూజికల్ గ్రూప్ ఆధ్వర్యంలో బుధవారం చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన మందిరంలో నిర్వహించిన 'వెండితెర స్వర వైభవం' సంగీత కార్యక్రమం ఘనంగా ముగిసింది. కాకినాడ మ్యూజికల్ గ్రూప్ మాజీ అధ్యక్షుడు, ఎన్ఆర్ఎస్ఏ--ఇస్రో మాజీ డిప్యూటీ డైరెక్టర్ దివంగత డి.వి. రాజు స్మారకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ మాజీ జాయింట్ కలెక్టర్ డాక్టర్ బీఎస్‌వీఎస్ మూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ప్రముఖ సాహితీవేత్త, 'ప్రసార కళా ప్రవీణ' డాక్టర్ ఓలేటి పార్వతీశం అధ్యక్షత వహించారు.
ప్రముఖ గాయకులు డాక్టర్ కొమాండూరి రామాచారి, బి. వినోద్‌బాబు, చింతలపాటి సురేష్ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. నంది, కీర్తి పురస్కార గ్రహీత వి. శశికళా స్వామి, 'సింగింగ్ స్టార్' బి. విజయలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు ప్రముఖులు, సంగీతాభిమానులు హాజరయ్యారు.
గాయకులు జి.ఎస్.జె. కుమార్, బి. కృష్ణకుమార్, వి.ఎస్. రామచంద్రం, ఎం.ఆర్. ప్రసాద్, ఇందునయన, కె. భవ్య, ఏ.వి. అస్మితారెడ్డి, సి. శరణ్యాక్షిత తదితరులు లైవ్ ఆర్కెస్ట్రా సహకారంతో ఆలపించిన అలనాటి మధుర గీతాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి.
కీబోర్డుపై బి. సూర్యతేజ, పి. రవితేజ, రిథమ్ ప్యాడ్స్‌పై ఎన్. శివరామిరెడ్డి, తబలా--ఢోలక్‌పై పి. విద్యాసాగర్, ఎన్. అనిల్ సంగీత సహకారం అందించారు. కార్యక్రమాన్ని జి.ఎస్.జె. కుమార్, కార్యదర్శి టి. రవికుమారి తదితరులు సమన్వయం చేశారు.

# భారత వారసత్వానికి మరో గుర్తింపు
# యునెస్కో తాత్కాలిక జాబితాలో మరో 5 వారసత్వ ప్రదేశాలు








**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 30:**
భారతదేశంలోని సాంస్కృతిక, చారిత్రక వారసత్వాన్ని ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందే దిశగా మరో ముందడుగు పడింది. ఐదు కొత్త వారసత్వ ప్రదేశాలు, ప్రతిపాదనలు యునెస్కో తాత్కాలిక జాబితాలో చేరాయి. దీంతో భారతదేశం నుంచి ఈ జాబితాలోని ప్రదేశాల సంఖ్య 78కి చేరింది. బాగ్ గుహల బౌద్ధ చిత్రాలు, చంబల్ లోయ దేవాలయాల సమూహం, గుప్తుల కాలానికి చెందిన ఉదయగిరి గుహలు, గిన్నోర్గఢ్ గిరిజన వారసత్వం తదితరాలు ఇందులో ఉన్నాయి

# ఘనంగా 'స్వర లహరి--పాడుతా తీయగా చల్లగా'
# మధుర గీతాలతో అలరించిన గాయనీ గాయకులు




**హైదరాబాద్, సెప్టెంబర్ 30 (ట్రైనెట్ న్యూస్):**
మహిళా మ్యూజికల్ ఈవెంట్స్ సీజన్--68 ఆధ్వర్యంలో బుధవారం చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభ సంగీత కళావేదికలో నిర్వహించిన 'స్వర లహరి--పాడుతా తీయగా చల్లగా' సంగీత కార్యక్రమానికి త్రినాథరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సాగిన ఈ సంగీత విభావరిలో గాయనీ గాయకులు అలనాటి, ఆధునిక సినీ గీతాలను ఆలపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. సంగీత ప్రియుల కరతాళ ధ్వనుల మధ్య కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగింది.
కృష్ణ నాయక్, జగదీశ్, సుబ్బిరెడ్డి, మనోహర్, లక్ష్మీనారాయణ, పద్మశ్రీ, సౌభాగ్య, రమాదేవి, అక్కి నరసింహులు, రాజారాం, బీఎస్ఎన్ఎల్ ప్రసాద్, కామేశ్వరి, చిత్ర, కల్యాణి, శోభ, జ్యోతి, నిత్యానంద్, చక్రపాణి, సుబ్రహ్మణ్యం, కావ్య తదితరులు తమ గానంతో శ్రోతలను అలరించారు. డాక్టర్ ప్రేమారెడ్డి తదితర ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొని గాయనీ గాయకులను అభినందించారు. నిర్వాహకురాలు, గాయని మహేశ్వరి కాసోజు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. సంగీతాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గిరిజన కళా వారసత్వ పరిరక్షణకు చర్యలు
# గిరిజన సంస్కృతిని డిజిటల్‌గా భద్రపరిచేందుకు ఒప్పందం

**న్యూఢిల్లీ,సెప్టెంబర్30(ట్రైనెట్‌న్యూస్):**
భారతదేశంలోని వైవిధ్యమైన గిరిజన సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించడం, డాక్యుమెంటేషన్ చేయడం, డిజిటలైజ్ చేయడం, పరిశోధన చేయడం కోసం గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. గిరిజన సమాజాల సంప్రదాయాలు, కళలు, జ్ఞాన సంపదను భవిష్యత్ తరాలకు అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం










Edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA.
www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136